
మంగళవారం 24-1-2023



సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 303

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



క్లీన్ స్వీప్ లక్ష్యంగా...
ఇండోర్‌లో నేడు న్యూజిలాండ్‌తో భారత్ మూడో వన్డే ఆడనుంది. - 12లో




ఒక్క చిరునవ్వు..కోటి కాంతులు
నేడు నేషనల్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.. - 11లో




మహా యోధుడు బోస్
నేతాజీ జయంతిని పురస్కరించుకొని ప్రధాని మోదీ సోమవారం ప్రతిపాదిత నేతాజీ స్మారకం నమూనాను ఆవిష్కరించారు.
- వివరాలు 6లో▶



నేవీ అమ్ములపొదిలోకి 'వాగీర్'
అత్యాధునిక ఆయుధ వ్యవస్థ, వేగంగా దూసుకెళ్లే సామర్థ్యం ఉన్న నూతన జలాంతర్గామి ఐఎన్ఎస్ వాగీర్ నావికాదళంలో చేరింది.
- వివరాలు 6లో▶



పాక్‌లో చీకట్లు..
పాకిస్తాన్‌లో నేషనల్ పవర్ గ్రిడ్ వైఫల్యంతో రాజధాని ఇస్లామాబాద్‌తో సహా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.
- వివరాలు 6లో▶



తెలుగు విద్యార్థులపై కాల్పులు
అమెరికాలోని షికాగోలో నల్లజాతీయులు జరిపిన కాల్పుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు.
- వివరాలు 5లో▶

న్యూస్‌రీల్

మళ్లీ రాజ్‌భవన్‌లోనే గణతంత్ర వేడుక



రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26న రాష్ట్ర స్థాయిలో అధికారికంగా నిర్వహించాల్సి ఉన్న వేడుకలను ఈ ఏడాది సైతం రాజ్‌భవన్‌కు పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం రాత్రి రాజ్‌భవన్‌కు సమాచారాన్ని అందించింది.
- వివరాలు 5లో▶

స్థలాలకు అద్దె వల!



ప్రీలాంచ్ పేరిట బిల్డర్లు వేలాది మంది మధ్య తరగతి ప్రజల సొంతింటి కలలను కల్లలు చేసి సొమ్ము చేసుకుంటుండగా, మరోపక్క కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఖాళీ స్థలాలను బైబ్యాక్, రెంటల్ ఇన్‌కం, ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ వంటి పేర్లతో సామాన్యులను బురిడీ కొట్టిస్తున్నారు.
- వివరాలు 2లో▶

సరైన అమ్మాయి దొరికితే పెళ్లి చేసుకుంటా..



పెళ్లికి తాను వ్యతిరేకం కాదని, సరైన అమ్మాయి దొరికితే కచ్చితంగా పెళ్లి చేసుకుంటానని కాంగ్రెస్ నేత, 52 ఏళ్ల రాహుల్ గాంధీ చెప్పారు. తెలంగాణ వంటలు ఘాటుగా ఉంటాయని 'కర్లీ టేల్స్' యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.
- వివరాలు 6లో▶

• ఎన్ని 'కలల' బడ్జెట్

రూ.3 లక్షల కోట్లు!

2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూపకల్పనలో నిమగ్నమైన రాష్ట్ర ప్రభుత్వం
సంక్షేమం, మౌలిక సదుపాయాలు, సాగునీటి రంగాలకు ప్రాధాన్యం

- సొంత స్థలం ఉంటే ఇల్లు కట్టుకునేందుకు రూ.3 లక్షలు.. దీనికోసం రూ.12 వేల కోట్లు కేటాయించే అవకాశం
- ప్రతి పంచాయతీకి రూ.10 లక్షల చొప్పున రూ.1,300 కోట్లు కేటాయింపు!
- దళితబంధు తరహాలోనే గిరిజన బంధు... రూ.5 వేల కోట్లు ఇచ్చే చాన్స్
- సాగునీటి పథకాలకు రూ.35 వేల కోట్ల పైమాటే.. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.30 వేల కోట్లు
- అప్పులకు వడ్డీలు, రుణాల చెల్లింపు పద్దు రూ. 30వేల కోట్లు!
- వచ్చే నెల 3న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న సర్కార్



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాదిలో ఎప్పుడైనా ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో ప్రజారంజక బడ్జెట్ రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సంక్షేమం, అభివృద్ధితో పాటు 'బ్యాలెట్ బాక్స్' పథకాలను కూడా వచ్చే ఏడాది బడ్జెట్‌లో పొందుపరిచే అవకాశమున్నట్లు తెలుస్తోంది. వచ్చే నెల 3న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండగా, అదే రోజు దాదాపు రూ.3 లక్షల కోట్ల ప్రతిపాదనలతో సర్కారు అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశముందనే చర్చ ఆర్థిక శాఖ వర్గాల్లో జరుగుతోంది. పన్ను ఆదాయం ఆశించిన మేర వస్తుండటం, జీడీపీలో స్థిరమైన వృద్ధి నమోదవుతుండటంతో 2023-24 ఆర్థిక సంవత్సరంపై కూడా గంపెడాశలతో బడ్జెట్‌ను అసెంబ్లీ ముందు పెట్టేందుకు సిద్ధమవుతోంది.

సంక్షేమం.. సబ్సిడీలు

రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి నుంచీ సంక్షేమ పథకాలకు తగిన ప్రాధాన్యతనిస్తోంది. ఈ కోవలోనే ఈసారీ సంక్షేమం, మౌలిక సదుపాయాలు, సాగునీటి రంగాలకు
మిగతా 3వ పేజీలో ▶

విద్యుత్ చార్జీలు పెంచొద్దు!

విద్యుత్ సబ్సిడీల కింద రూ.10,535 కోట్లను బడ్జెట్‌లో కేటాయించాలని ఇంధన శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఎన్నికల ఏడాది కావడంతో ప్రస్తుత విద్యుత్ చార్జీలనే 2023-24లో కొనసాగించాలని, ఎలాంటి పెంపు అమలు చేయరాదని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు నిర్ణయించాయి. ప్రస్తుత చార్జీల కొనసాగింపుతో రూ.10,535 కోట్ల ఆదాయ లోటు ఉండనుందని, ప్రభుత్వమే సబ్సిడీ రూపంలో ఆమేరకు నిధులు కేటాయించాలని కోరాయి. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌తోపాటు వివిధ కేటగిరీల వినియోగదారులకు ఇస్తున్న విద్యుత్ రాయితీ పథకాలను కొనసాగించడానికి సబ్సిడీలు అవసరం కానున్నాయి. విద్యుత్ సబ్సిడీలతోపాటు ఎత్తిపోతల పథకాల విద్యుత్ బిల్లుల కోసం రూ.13 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించాలని ఇంధన శాఖ ప్రతిపాదించినట్లు తెలిసింది.



27 నుంచి షురూ.. మార్చి 4న ముగింపు

మార్చి 5 నుంచి 19వ తేదీ మధ్య అప్పీళ్ల స్వీకరణ
టీచర్ల బదిలీల షెడ్యూల్ విడుదల.. లీక్‌పై డైరెక్టర్ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ సోమవారం అనధికారికంగా బయటకొచ్చింది. అందుబాటులోకి వచ్చిన షెడ్యూల్ ప్రకారం.. ఈ నెల 27 నుంచి మొదలయ్యే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మార్చి 4వ తేదీతో ముగియనుంది.

షెడ్యూల్ ఇలా...

→ జనవరి 27న అన్ని కేటగిరీల్లో ఖాళీలు, ప్రధానోపాధ్యాయుల పదోన్నతికి అర్హులైన స్కూల్ అసిస్టెంట్స్ సీనియారిటీ జాబితాలు ఆన్‌లైన్‌లో ప్రకటిస్తారు.
→ 28 నుంచి 30 వరకు బదిలీ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు
→ జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 లోపు.. దరఖాస్తుల హార్డ్ కాపీలను హైస్కూల్ ఉపాధ్యాయులు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు, ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులు సంబంధిత ఎంఈఓలకు, మండల పరిషత్ పీఎస్, యూపీఎస్ ఉపాధ్యాయులు సంబంధిత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డీఈఓకు సమర్పించాలి
→ ఫిబ్రవరి 3-6 తేదీల మధ్య దరఖాస్తుల హార్డ్ కాపీలను ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు డీఈఓ కార్యాలయంలో సమర్పించడం, పరిశీలన.. ఆన్‌లైన్‌లో ఆమోదం.
→ 7న డీఈఓ/ఆర్జేడీ వెబ్‌సైట్లలో బదిలీ పాయింట్లతో ప్రొవిజనల్ సీనియారిటీ, పదోన్నతుల సీనియారిటీ జాబితాలు ప్రకటిస్తారు.
→ 8 నుంచి 10 వరకు మూడురోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన, పరిష్కారం జరుగుతుంది.
→ 11, 12 తేదీల్లో తుది సీనియారిటీ జాబితాల ప్రకటన, ప్రధానోపాధ్యాయుల బదిలీలకు వెబ్ ఆప్షన్ల నమోదు.
→ 13న మల్టీ జోనల్ స్థాయిలో ప్రధానోపాధ్యాయులు వెబ్ ఆప్షన్ల ఎడిటింగ్, పునఃపరిశీలన చేసుకోవచ్చు.
→ 14న ఆర్జేడీలు ప్రధానోపాధ్యాయుల బదిలీ ఉత్తర్వులు విడుదల.
→ 15న బదిలీల అనంతరం మిగిలిన
మిగతా 5వ పేజీలో ▶



ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు

2.73 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులకు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జూలై 2021 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యాన్ని (డీఏ) 2.73 శాతం పెంచింది. ప్రస్తుతం 17.29 శాతం ఉన్న డీఏను 20.02 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమ వారం ఉత్తర్వులు జారీ చేశారు. జూలై 2021 నుంచి డిసెంబర్ 2022 వరకున్న డీఏ బకాయిలను జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నట్లు ప్రభుత్వం అందులో స్పష్టం చేసింది. సీపీఎస్ ఉద్యోగులకు జూలై 2021 నుంచి డిసెంబర్ 2022 వరకున్న బకాయిలను 10 శాతం మొత్తాన్ని వారి
మిగతా 3వ పేజీలో ▶

'చలో ప్రగతిభవన్'లో ఉద్రిక్తత

- 'జీవో 317'తో నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలంటూ బీజేపీ ఆందోళన
- పోలీసులు, బీజేపీ శ్రేణుల మధ్య తోపులాట
- నిరసనకారుల అరెస్టు.. స్టేషన్లకు తరలింపు
- ఉద్యోగులు, టీచర్లకు సీఎం క్షమాపణలు చెప్పాలి: బండి డిమాండ్

- వివరాలు 2లో▶



అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి

- మంత్రి కేటీఆర్ స్పష్టీకరణ
- అమెజాన్ ఎయిర్‌తో మరిన్ని అవకాశాలు
- విమానాల ద్వారా సరుకుల రవాణాకు సంస్థ శ్రీకారం



'అమెజాన్ ఎయిర్' ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం తయారీ రంగంతో పాటు వ్యవసాయ, మౌలిక, సేవారంగాల్లో గణనీయమైన ప్రగతి సాధిస్తోందని, పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం ద్వారా ఇది సాధ్యమైందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు తెలిపారు. 2021లో ఎయిర్ కార్గో కూడా 35 శాతం వరకూ పెరిగిందని చెప్పారు. అంతర్జాతీయ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ దేశంలోనే మొట్టమొదటిసారిగా అమెజాన్ ఎయిర్ సర్వీసులను సోమవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన
మిగతా 10వ పేజీలో ▶

5న నాందేడ్‌లో బీఆర్ఎస్ సభ

- జాతీయస్థాయి విస్తరణలో భాగంగా ఏర్పాట్లు
- మహారాష్ట్ర నేతలతో 3 రోజులుగా కేసీఆర్ భేటీలు
- ఖమ్మం సభ తరహాలో భారీగా జరపాలని దిశానిర్దేశం.. తెలంగాణ సరిహద్దు జిల్లాల నుంచీ జన సమీకరణకు యోచన



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో భారత్ రాష్ట్ర సమితి విస్తరణ, జాతీయ రాజకీయాల దృష్టిని మరింతగా ఆకర్షించడం లక్ష్యంగా మహారాష్ట్రలోని నాందేడ్‌లో బీఆర్ఎస్ బహిరంగ సభను నిర్వహించాలని ముఖ్య మంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ తొలి సభ విజయవంతమైందని.. ఈ ఊపులోనే మరో సభతో పార్టీలో ఉత్సాహం నెలకొంటుందని భావిస్తున్నారు. నాందేడ్ సభకు అవసరమైన ఏర్పాట్లపై మహారాష్ట్రకు చెందిన కొందరు నేతలతో ప్రగతిభవన్‌లో మూడు రోజులుగా కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. సభ విజయవంతానికి అనుసరించాల్సిన వ్యూహాలపై
మిగతా 2వ పేజీలో ▶

సీజే స్థానాన్ని కించపరిచింది!

వెకేషన్ బెంచ్ తీరును తప్పుబట్టిన ఏపీ సీజే ధర్మాసనం.. డీఫాక్టో ప్రధాన న్యాయమూర్తిలా వ్యవహరించింది

- ప్రతి వెకేషన్ జడ్జి ఇలాగే వ్యవహరిస్తే వ్యవస్థ ఏమవుతుంది?
- ఇది తేలిగ్గా తీసుకునే విషయం ఎంత మాత్రం కాదు
- వెకేషన్ కోర్టులో ఏం జరిగిందో ప్రతిదీ తెలుసు
- మాకు తెలియదనుకుంటే అది పెద్ద పొరపాటు
- మూలాల్లోకి వెళ్లి ఈ వ్యవహారాన్ని తేలుస్తాం
- ఏం మునిగిపోయిందని జీవో 1పై వెకేషన్ కోర్టులో పిల్ వేశారు?
- ఇలాంటి పిటిషన్‌తో తీవ్ర గందరగోళ పరిస్థితులు సృష్టించారు
- ఇందుకు సమాధానం చెప్పి తీరాల్సిందే
- పిటిషనర్‌కు తేల్చి చెప్పిన హైకోర్టు ధర్మాసనం
- బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్ పిటిషన్లపై నేడు విచారణ



సాక్షి, అమరావతి: సెలవుల్లో ఎలాంటి అత్యవసర కేసులను విచారించాలో ప్రధాన న్యాయమూర్తి (సీజే) పరిపాలనాపరంగా నిర్దిష్ట ఆదేశాలు జారీ చేసినప్పటికీ అందుకు విరుద్ధంగా జస్టిస్ బట్టు దేవానంద్ నేతృత్వంలోని వెకేషన్ బెంచ్ వ్యవహరించడాన్ని సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. సంక్రాంతి సెలవుల సందర్భంగా వెకేషన్ బెంచ్ వ్యవహరించిన తీరు చాలా దురదృష్టకరమంది. ఆ బెంచ్ డీఫాక్టో ప్రధాన న్యాయమూర్తిలా వ్యవహరించిందని ఆక్షేపించింది. సీజే నిర్దేశించిన ఆదేశాలకు విరుద్ధంగా సెలవుల్లో ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని
మిగతా 10వ పేజీలో ▶



కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు తిరిగినా దొరకలేదంటే ఇంకేం దొరుకుతుంది సార్!

క్లుప్తంగా...

పంజగుట్టలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయండి

- సీఎస్‌ను కోరిన భట్టి, ఇతర నేతలు



సాక్షి, హైదరాబాద్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని పంజగుట్ట సర్కిల్‌లో ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు కాంగ్రెస్ శాసనసభాపక్షం నేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, మల్లురవి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌లు సోమవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారిని కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం భట్టి మీడియాతో మాట్లాడుతూ పంజగుట్టలో దళిత సంఘాల ఆధ్వర్యంలో పెట్టిన విగ్రహాన్ని మున్సిపల్ సిబ్బంది తీసుకెళ్లి పోలీస్‌స్టేషన్‌లో పెడితే తమ నాయకుడు వీహెచ్ కొట్లాడి హైకోర్టు ద్వారా బయటకు తెచ్చారని చెప్పారు. ఈ నేపథ్యంలో విగ్రహాన్ని గతంలో తొలగించిన పంజాగుట్ట సర్కిల్‌లోనే ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా సీఎస్‌ను కోరామని తెలిపారు.

75 సీట్లతో అధికారంలోకి రాబోతున్నాం: మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో 75 అసెంబ్లీ స్థానాల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇంతకంటే ఎక్కువ సీట్లు గెలిస్తే సన్యాసం తీసుకుంటామని చెపుతున్న నాయకులంతా సన్యాసం తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు.

'హాథ్ సే' కమిటీ ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రల కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి చైర్మన్‌గా, మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కన్వీనర్‌గా, మాజీమంత్రి గడ్డం ప్రసాదకుమార్, మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, ఉపాధ్యక్షులు జి.నిరంజన్, మదన్‌మోహన్‌రావు, జగదీశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శులు కైలాశ్ కుమార్, ఫక్రుద్దీన్, భరత్‌చౌహాన్‌తోపాటు సీనియర్ నేత పాల్వాయి స్రవంతిని సభ్యులుగా నియమించారు. కమిటీ సోమవారం గాంధీభవన్‌లో సమావేశమై హాథ్ సే హాథ్ జోడో యాత్రల ఏర్పాట్లను సమీక్షించింది. ఈ నెల 26న హాథ్ సే హాథ్ పాదయాత్రలను లాంఛనంగా ప్రారంభించి ఫిబ్రవరి 6వ తేదీ నుంచి రెండు నెలలపాటు కొనసాగిస్తామని మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

'బీజేపీలో అధికారం అగ్రకులాలకేనా?'




చార్మినార్ (హైదరాబాద్): బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ను ఎదుర్కోవాలంటే అన్ని వర్గాల ప్రజలు ఏకమై ఉమ్మడిగా పోరాడాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో పాతబస్తీలో ఆదివారం రాత్రి జరిగిన హాలాతే హాజరా బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లపై మండి పడ్డారు. గుజరాత్ అల్లర్లలో బీజేపీ ప్రధాన పాత్ర పోషించిందని తేల్చి చెప్పిన ఒక చానల్‌తో పాటు వెబ్‌సైట్‌ను భారత్‌లో నిషేధించిన కేంద్రం.. గాంధీని హత్య చేసిన గాడ్సేపై చిత్రం నిర్మిస్తుంటే చూస్తూ ఊరుకోవడం ఏమిటని ప్రశ్నించారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్ కంటే గొప్ప నాయకులు ఎవరూ లేరన్నారు. మైనార్టీ, దళిత వర్గాలను చిన్నచూపు చూసే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుల కళ్లు తెరుచుకునే విధంగా తమ పోరాటం ఉండాలన్నారు.

'త్వరలో ఇంటింటికీ టీడీపీ'

సాక్షి, హైదరాబాద్: తెలుగుదేశం పార్టీని ప్రతి పల్లెకు, పట్టణానికి తీసుకెళ్లేందుకు త్వరలోనే కార్యాచరణ చేపట్టనున్నట్లు ఆపార్టీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తెలిపారు. ఇంటింటికి టీడీపీ పేరుతో రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పర్యటించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సోమవారం ఎన్టీఆర్ భవన్లో టీటీడీపీ రాష్ట్ర సమావేశం జరిగింది.

స్పౌజ్ బదిలీలు చేపట్టాలి



సాక్షి, హైదరాబాద్: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి వారి భవిష్యత్తును చక్కదిద్దే గురువులు పిల్లాపాపలతో ప్రగతి భవన్ ముందు ఆర్తనాదాలు చేయాల్సిన దుస్థితికి సీఎం కేసీఆర్ తీసుకొచ్చారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల మండిపడ్డారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల విషయంలో కేసీఆర్ సైకోలా వ్యవహరిస్తున్నారని సోమవారం ట్విట్టర్ వేదికగా దుయ్యబట్టారు. ఇప్పటికైనా కేసీఆర్ గడీ దాటి బయటకు వచ్చి బ్లాక్ చేసిన 13 జిల్లాల స్పౌజ్ బదిలీలను వెంటనే చేపట్టాలని షర్మిల డిమాండ్ చేశారు.

"మా ఫామ్‌ల్యాండ్‌లో రూ. 3 లక్షలుపెట్టి రెండు గుంటలు (242 గజాలు) కొంటే ప్రతి నెలా రూ. 15 వేల అద్దె చొప్పున 20 నెలల తర్వాత రూ. 3 లక్షల అసలు సహా మొత్తం రూ. 6 లక్షలు చెల్లిస్తాం. 4 గుంటల స్థలానికి రూ. 6 లక్షలు చెల్లిస్తే ప్రతి నెలా రూ.30 వేల చొప్పున 20 నెలల తర్వాత రూ. 12 లక్షలు ఇస్తాం. 8 గుంటలకు రూ. 12 లక్షలు కడితే నెలకు రూ. 24 వేల చొప్పున 20 నెలల్లో రూ.24 లక్షలు రిటర్న్ చేస్తాం"

హైదరాబాద్‌కు 140 కి.మీ. దూరంలోని నారాయణ్‌ఖేడ్‌లో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఫామ్‌ల్యాండ్ వెంచర్ పేరిట వినియోగదారులను ఆకర్షించేందుకు జోరుగా సాగిస్తున్న ప్రచారం ఇది.

స్థలాలకు అద్దె వల!



బై బ్యాక్, రెంటల్ స్కీమ్‌ల పేరుతో రియల్ ఎస్టేట్ సంస్థల సరికొత్త మోసం

ఏడాదిలో అద్దెతో సహా కట్టిన సొమ్ము తిరిగిస్తామంటూ విస్తృత ప్రచారం

మార్కెట్ ధరకన్నా 100 శాతం రేటు పెంచేసి విక్రయిస్తున్న బిల్డర్లు

తీరా గడువు ముగిశాక ముఖం చాటేస్తున్న వైనం

హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతుల్లేకుండానే యథేచ్ఛగా వెంచర్లు

అమాయకులను తీసుకొచ్చే ఏజెంట్లకు భారీ నజరానాలు

సాక్షి, హైదరాబాద్

ప్రీలాంచ్ పేరిట గత కొన్నేళ్లుగా హైదరాబాద్ సహా ప్రధాన పట్టణాల్లో కొందరు బిల్డర్లు వేలాది మంది మధ్యతరగతి ప్రజల సొంతింటి కలలను కల్లలు చేసి సొమ్ము చేసుకుంటుంటే తాజాగా మరి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఖాళీ స్థలాలను వెంచర్ల పేరు చెప్పి బై బ్యాక్, రెంటల్ ఇన్‌కం, ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ వంటి కొత్త పేర్లతో సామాన్యులను బురిడీ కొట్టిస్తున్నారు. ఏడాదిలో అద్దెతో సహా కట్టిన సొమ్మును వాపసు చేస్తామంటూ నమ్మించి ఫామ్ ప్లాట్లు, ఖాళీ స్థలాలను అక్రమ మార్గంలో విక్రయిస్తున్నారు. మార్కెట్ రేటు ప్రకారం గజానికి రూ. 5 వేలు కూడా పలకని ప్రాంతంలో గజం రూ. 10 వేలకుపైనే విక్రయించి ముందే డబ్బు వసూలు చేసుకుంటున్నారు. డీటీసీపీ, హెచ్ఎండీఏ నుంచి ఎలాంటి అనుమతులు, రెరాలో నమోదు చేసుకోకుండానే వెంచర్లలో ప్లాట్లను విక్రయిస్తున్నారు.

నమ్మకస్తులే మధ్యవర్తులుగా..

గ్రామాలు, శివారు ప్రాంతాలలో టీచర్లు, ఎల్ఐసీ ఏజెంట్లు, రిటైర్డ్ ఉద్యోగులను రియల్ ఎస్టేట్ ఏజెంట్లుగా నియమించుకుంటున్నారు. గ్రాఫిక్స్ హంగులను అద్ది రంగురంగుల బ్రోచర్లను ముద్రించి ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం చేస్తూ కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు. ప్రతి నెలా స్టార్ హోటళ్లలో మధ్యవర్తులతో సమావేశం నిర్వహించి, ఎక్కువ విక్రయాలు చేసిన ఏజెంట్లకు విదేశీ టూర్లు, కార్లు, బంగారం వంటివి బహుమతులుగా అందజేస్తున్నారు.

చట్ట నిబంధనల ప్రకారం ఫామ్‌ల్యాండ్ వెంచర్‌లను రియల్ ఎస్టేట్ సంస్థలు కనీసం అర ఎకరం, ఆపై మొత్తాల్లోనే విక్రయించాలి. అయితే అంత విస్తీర్ణంలోని భూముల ధరలు రూ. పదుల లక్షలు, ఆపైనే ఉంటాయి కాబట్టి సామాన్యులు అంత డబ్బు పెట్టి కొనే పరిస్థితి ఉండదనే ఉద్దేశంతో ఆయా సంస్థలు ఫామ్‌ల్యాండ్ వెంచర్‌లను గజాలు లేదా గుంటల లెక్కన విక్రయిస్తున్నాయి. నిర్ణీత కాలం తర్వాత అసలుకు రెట్టింపు డబ్బు ఇస్తామని ఆశ

అసలుకు రెట్టింపు ఆశ చూపి...

చూపుతూ వినియోగదారులతో అగ్రిమెంట్లు చేసుకుంటున్నాయి. కొన్ని చోట్ల మాత్రం అధికారులకు లంచాలు ఇచ్చి ఆ స్థలాలను వ్యవసాయ భూములుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. అయితే ఒకవేళ అగ్రిమెంట్ గడువు తర్వాత రియల్ ఎస్టేట్ మార్కెట్ పతనమై సంస్థ డబ్బు తిరిగి చెల్లించే పరిస్థితి లేకపోయినా లేదా కంపెనీ బోర్డు తిప్పేసినా కొనుగోలుదారులే మోసపోతున్నారు. తమకు కొసరు ఇవ్వకపోయినా పరవాలేదు అసలు సొమ్ము ఇస్తే చాలంటూ సంస్థల చుట్టూ తిరుగుతున్నారు. కానీ దీనిపై చాలా మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సైతం వెనకాడుతున్నారు. అలా చేస్తే తమ పేర్లు బయటపడటంతోపాటు ఆయా సంస్థలు కోర్టులోనే తేల్చుకోమంటాయేమోనని భయపడుతున్నారు.

ఈ పట్టణాల్లో కుప్పలుతెప్పలుగా...

సదాశివపేట, నారాయణ్‌ఖేడ్, నందివనపర్తి, చేవెళ్ల, జనగాం, బచ్చన్నపేట, చౌటుప్పల్, యాదాద్రి వంటి హైదరాబాద్ నుంచి 100 కి.మీ. దూరంలో ఉన్న ప్రాంతాల్లో ఈ తరహా ప్రాజెక్టులు కుప్పలుతెప్పలుగా ఉన్నాయి. రహదారులు, విద్యుత్, మురుగు నీటి వ్యవస్థ వంటి కనీస మౌలిక వసతులు కూడా సరిగా లేని ప్రాంతాలలో వందలాది ఎకరాలలో ప్రాజెక్టులు చేస్తున్నామని మాయమాటలు చెబుతున్నాయి. కరోనా కాలంలో పుట్టుకొచ్చిన ఏవీ ఇన్‌ఫ్రా కాన్, జయ గ్రూప్, ఫార్చ్యూన్ 99 తదితర సంస్థలు ఈ మోసాలకు పాల్పడుతున్నాయి.

బై బ్యాక్ పేరుతో మోసపోయా...

జనగాం జిల్లాలోని పెంబర్తిలో 11 ఎకరాలలో ఓ సంస్థ వేసిన వెంచర్‌లో బై బ్యాక్ స్కీమ్ కింద రూ. 20 లక్షలకు 183.33 గజాల స్థలం కొన్నా. 12 నెలల తర్వాత లాభం రూ. 10 లక్షలు, మొదట్లో నేను కట్టిన రూ. 20 లక్షలు కలిపి మొత్తం రూ. 30 లక్షలు తిరిగి చెల్లిస్తామని సంస్థ నాతో అగ్రిమెంట్ చేసుకుంది. కానీ ఏడాది దాటినా సొమ్ము చెల్లించడం లేదు. - ఓ బాధితుడి ఆవేదన.

స్కీమ్‌లలో తీసుకొని మోసపోవద్దు...



ప్రీలాంచ్, బై బ్యాక్, రెంటల్ గ్యారంటీ అంటూ రకరకాల పేర్లతో సామాన్యులను కొందరు వ్యాపారులు ఆకర్షిస్తున్నారు. టీఎస్–రెరా, నిర్మాణ అనుమతులు లేని ఏ ప్రాజెక్టులలోనూ ప్రజలు స్థలాలు కొనుగోలు చేయకూడదు. రెరా రిజిస్ట్రేషన్ లేని మధ్యవర్తులను నమ్మి మోసపోకూడదు.

-విద్యాధర్, సెక్రటరీ, టీఎస్–రెరా

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి...

రియల్టీ మార్కెట్‌ను స్కీమ్‌ల పేరుతో కొందరు బిల్డర్లు చెడగొడుతున్నారు. స్థలం కొనుక్కోవాలను కొనే సామాన్యుల ఆశలను ఆసరా చేసుకొని మోసం చేస్తున్నారు. స్కీమ్‌ల పేరుతో విక్రయించే స్థలాలను రిజిస్ట్రేషన్ చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. - సునీల్ చంద్రారెడ్డి, అధ్యక్షుడు, నరెడ్కో తెలంగాణ

బీఆర్‌ఎస్.. బందిపోట్ల రాక్షసుల సమితి

కేసీఆర్‌ది మోసపూరిత సర్కార్...

- దళితులు, నిరుద్యోగులను మోసం చేశారు
- 13 అంశాలతో కాంగ్రెస్ చార్జిషీట్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అంటే బందిపోట్ల రాక్షసుల సమితి అని కాంగ్రెస్ పార్టీ అభివర్ణించింది. ముఖ్యమంత్రిగా గత తొమ్మిదేళ్లలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యాలను కేసీఆర్ నెరవేర్చలేదని అభియోగం మోపింది. కేసీఆర్‌ది మోసపూరిత సర్కార్ అని విమర్శించింది. 'తల్లికి మట్టి గాజులు తేలేనోడు చిన్నమ్మకు బంగారు గాజులు తెస్తా'అన్నట్టు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వందల హామీలను తుంగలో తొక్కిన కేసీఆర్ బీఆర్‌ఎస్ పేరుతో దేశానికి ఏదో చేస్తానంటున్నారని దుయ్యబట్టింది. ఈ మేరకు హాథ్ సే హాథ్ జోడో యాత్రలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంపై చార్జిషీట్‌ను సోమవారం విడుదల చేసింది. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విడుదల చేసిన ఈ చార్జిషీట్‌లో మొత్తం 13 అభియోగాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ మోపింది. అమరుల ఆశయాలను, తెలంగాణ అభివృద్ధిని పట్టించుకోని కేసీఆర్ తెలంగాణ పదాన్ని తొలగించి ఇప్పుడు బీఆర్‌ఎస్ పేరుతో రాష్ట్ర ప్రజల దృష్టిని మరల్చి మరోమారు ముఖ్యమంత్రి కావాలని ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించింది. మేధావుల మౌనం అసమర్థులకు రాజమార్గం కాకూడదంటూ తెలంగాణలోని మేధావివర్గం, నిరుద్యోగులు, రైతులు, ప్రజాస్వామికవాదులు కేసీఆర్ కుట్రలను ప్రజలకు తెలియజేసి తెలంగాణ భవిష్యత్తును రక్షించాలని ఆ చార్జిషీట్‌లో కాంగ్రెస్ కోరింది.

కాంగ్రెస్ చార్జిషీట్‌లో బీఆర్‌ఎస్‌పై మోపిన అభియోగాలివే..

1. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎందరికిచ్చారో చెప్పాలి
2. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, కాపలా కుక్కలా తానుంటానని చెప్పి అలా చేయకుండా దళితులను దగా చేసింది నిజం కాదా?
3. తెలంగాణ ఇస్తే ఇంటికో ఉద్యోగమని చెప్పి మళ్లీ అసెంబ్లీలో అనలేదని మాట మార్చడం నిరుద్యోగులను మోసం చేయడం కాదా?
4. తొమ్మిదేళ్లయినా కేజీ టూ పీజీ నిర్బంధ విద్యను ఎందుకు అమలు చేయలేదు?
5. అధికారంలోకి వచ్చాక నియామకాలు ఎక్కడకు పోయాయి? నిరుద్యోగులకు ఇస్తానన్న రూ.3 వేల భృతి ఏమైంది?
6. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేస్తా రద్దు చేస్తా అంటూ ఎందుకు రద్దు చేయడం లేదు?
7. పోడు భూములకు పట్టాలు, దళితులు, గిరిజనులకు మూడెకరాల భూపంపిణీ ఏమైంది?
8. రైతులకు ఉచిత ఎరువులు ఏవి?
9. గొల్ల కుర్మలకు గొర్రెలేవీ?
10. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలేదీ?
11. ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ఏమైంది?
12. నియోజకవర్గానికో మెడికల్ కాలేజీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, పాలిటెక్నిక్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలలు ఏమయ్యాయి?
13. ప్రతి నియోజకవర్గానికి లక్ష ఎకరాల సాగు నీరు ఎక్కడ పారింది?

మొదటి నుంచీ వాగ్దాన భంగమే..

కేసీఆర్.. కురువృద్ధుల కల్లబొల్లి మాటలే నమ్ముతున్నారు

- వైఎస్సార్, ఎన్టీఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి
- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి




ఇల్లెందులో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పార్టీలో చేరిన ప్పటి నుంచి ఇప్పటి వరకు తన విషయంలో బీఆర్‌ఎస్ వాగ్దాన భంగం చేస్తూనే ఉందని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆధ్వర్యంలో ఇల్లెందులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 2014లో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలు రాకముందే, హంగ్ ప్రభుత్వం ఏర్పడుతుందనే ఉద్దేశంతో తమ పార్టీలోకి రావాలంటూ అప్పటి టీఆర్‌ఎస్ నాయకులు కోరారని పొంగులేటి చెప్పారు. చివరకు రెండున్నరేళ్ల తర్వాత నాటి టీఆర్‌ఎస్‌లో చేరగా.. ఇప్పటి వరకు తనకు కానీ, తనను నమ్ముకున్న నేతలకు గానీ అర్హత ఉన్నా ఒక్క పదవీ రాలేదని అన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కేవలం ఒకేస్థానాన్ని గెలవగా, ఆ ఫలితాలపై కురువృద్ధ నాయకులు చెప్పిన కల్లబొల్లి మాటలు నమ్మి తనకు 2019 పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదని పొంగులేటి చెప్పారు. ఒక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా తమ పార్టీని అప్పటి టీఆర్‌ఎస్‌లో విలీనం చేస్తే చివరకు ఖమ్మం ఎంపీ టికెట్ కూడా నిరాకరించడమే తనకు దక్కిన గౌరవమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనను జైలులో పెట్టినా ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా తన రాజకీయ ప్రస్థానం ఉంటుందని, తనను కానీ తనను నమ్ముకున్న వారిని కానీ ఇబ్బంది పెట్టాలని చూస్తే గాంధేయమార్గంలో సత్యాగ్రహం చేసైనా అధికార బలానికి ఎదురెళ్తామని పొంగులేటి వెల్లడించారు. అయితే, ప్రస్తుతం తమ దారి ఏమిటో ఇంకా తెలియదని ఆయన పేర్కొన్నారు.

వారే ఆదర్శం: పోడు భూములకు పట్టాలిచ్చిన దివంగత నేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి, కిలో బియ్యం రూ.2కే ఇచ్చిన ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో పదికాలాల పాటు నిలిచిపోయారని, వారే ఆదర్శంగా రాజకీయాల్లోకి వచ్చానని పొంగులేటి తెలిపారు. 2018 ఎన్నికల సందర్భంగా పోడు సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్.. నేటికీ పోడు సమస్యకు పరిష్కారం చూపలేదని పేర్కొన్నారు.

బయటకు వెళ్లాక తెలుస్తుంది..

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరిప్రియా నాయక్



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బీఆర్‌ఎస్‌ను వదిలి వెళ్లిన వారు, ఆ తర్వాత ఎందుకు ఆ పని చేశామా! అని తప్పక బాధపడతారని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియా నాయక్ వ్యాఖ్యానించారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆత్మీయ సమ్మేళనానికి పోటీగా సోమవారం ఆమె మున్సిపల్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇల్లెందు మున్సిపల్ పాలవర్గం ఏర్పడి మూడేళ్లు పూర్తయినందున ఈ భేటీ ఏర్పాటు చేసినట్లు పార్టీ నేతలు చెపుతున్నారు. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ, గత అసెంబ్లీ ఎన్నికల్లో పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నమ్మి పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఆయన చేతిలో పెడితే తొమ్మిది చోట్ల పార్టీ ఓటమికి కారణమయ్యారని ఆరోపించారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయిన కోరం కనకయ్యకు జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కట్టబెడితే, పార్టీకి వెన్నుపోటు పొడిచేందుకు ప్రయత్నించారని ధ్వజమెత్తారు.

నిజమైన హిందూధర్మ పరిరక్షకుడు కేసీఆర్

వివేకానంద విదేశీ విద్యాపథకం స్కాలర్‌షిప్ పత్రాలు అందజేసిన మంత్రి హరీశ్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ నిజమైన హిందూ ధర్మపరిరక్షకుడని మంత్రి హరీశ్‌రావు అభివర్ణించారు. కొంతమంది రాజకీయాల కోసం హిందూమతాన్ని వాడుకుంటున్నారని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమం కోసం అలోచించే సీఎం కేసీఆర్ అని, బ్రాహ్మణులపట్ల అపార గౌరవం కలిగిన నేత అని అన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే దేశంలోనే మొదటిసారిగా బ్రాహ్మణ సమాజ్ సామూహిక భవనాన్ని సిద్దిపేటలో నిర్మించారని అన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఆధ్వర్యంలో 'వివేకానంద విదేశీ విద్యాపథకం'అర్హులకు స్కాలర్‌షిప్ మంజూరు పత్రాలను అందించే కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఒకప్పుడు అర్చకులకు పుణ్యకార్యం జరిగితేనే జీతాలు వచ్చే పరిస్థితి ఉండేదని, కానీ ముఖ్యమంత్రి కృషితో ప్రతీనెల అర్చకులకు జీతాలు సమయానికి వచ్చే వ్యవస్థ ఏర్పాటైందని వివరించారు. దేవాలయాల కోసం బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. విదేశీవిద్య కోసం ఈ ఏడాది 121 మందికి రూ.24.20 కోట్లు మంజూరయ్యాయని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. వేద విద్యార్థులకు నెలకు రూ.250, వేదవిద్య పూర్తయ్యాక వృత్తిలో నిలదొక్కుకునేందుకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల ఆర్థికసాయం అందిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని గోపన్‌పల్లిలో 6 ఎకరాల విస్తీర్ణంలో రూ.20 కోట్ల వ్యయంతో కొత్త బ్రాహ్మణభవన్ ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం ఉంటే విజయవంతం

బాలవికాస సంస్థ మహాసభలో మంత్రి హరీశ్‌రావు



సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మల్లారెడ్డి, అంబటి రాంబాబు

కీసర: స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేస్తే విజయవంతమవుతాయని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీర్ హరీశ్‌రావు అన్నారు. సోమవారం రాంపల్లి దాయరలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి కమిటీల మహాసభకు హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. జన నిర్మాణంతోనే సమాజం నిర్మితమవుతుందని, ఇందుకు బాలవికాస సంస్థ చేపడుతున్న పనులే నిదర్శనమన్నారు. బాలవికాస నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటుచేస్తే.. తెలంగాణ ప్రభుత్వం ఆ స్ఫూర్తితో మిషన్ భగీరథను తెచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. ఈ సంస్థ గ్రామాల్లో సేవాగుణం గలవారిని కమిటీలుగా నియమించి వారికి శిక్షణ ఇచ్చి కార్యక్రమాలను నడిపించడం గొప్పవిషయమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, చామకూర మల్లారెడ్డి, బాలవికాస వ్యవస్థాపకుడు ఆండ్రూ జింగ్రాస్, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరీరెడ్డి పాల్గొన్నారు. బాల వికాస సంస్థ 23 బ్రాంచీలు ఏర్పాటుచేసి 8 వేల గ్రామాల్లో కార్యక్రమాలు చేపడుతోంది.

'చలో ప్రగతి భవన్'లో ఉద్రిక్తత



బీజేపీ నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రగతిభవన్ ముట్టడికి బీజేపీ నేతల యత్నం

- పోలీసులకు, బీజేపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం.. తోపులాటలో కిందపడిన ఆందోళనకారులు, పోలీసులు

పంజగుట్ట/ సాక్షి, హైదరాబాద్: జీవో నెంబర్ 317 వల్ల నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం వివిధ బీజేపీ మోర్చా నాయకులు చేపట్టిన చలో ప్రగతిభవన్ కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తంగా మారింది. పెద్ద సంఖ్యలో మోర్చా నాయకులు ప్రగతిభవన్ చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరిని అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసులకు, బీజేపీ నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరస్పరం దూషించుకునే స్థాయికి వెళ్లింది. తోపులాటలో బీజేపీ నాయకులతో పాటు పోలీసులు కూడా కింద పడటంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. బీజేవైఎం నేత రవికుమార్, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు అఫ్సర్ పాషా, బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆలె భాస్కర్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొప్పు బాషాతో పాటు పలువురిని అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.

ఉద్యోగులు, టీచర్లకు సీఎం క్షమాపణలు చెప్పాలి..

ఉద్యోగులు, ఉపాధ్యాయుల అరెస్టుల సందర్భంగా పోలీసులు అమానుషంగా వ్యవహరించడంపై సీఎం కేసీఆర్ బేషరతుగా ఆయా వర్గాలకు క్షమాపణ చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.. 317 జీవోను సవరించి వారికి న్యాయం చేయాలని, భార్యాభర్తలు ఒకే చోట పనిచేసే అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలను లంచాల కోసమే నిలిపేశారని ఆరోపించారు. జిల్లా కేంద్రాల్లో ఖాళీలు చూపకుండా పోస్టులన్నీ బ్లాక్ చేశారని ఆరోపించారు. సోమవారం సంజయ్ మీడియాతో మాట్లాడుతూ తమ సమస్యలు మెరుగుపరచుకునేందుకు ప్రగతిభవన్‌కు వెళితే మహిళా టీచర్లు, చిన్న పిల్లలపై కేసీఆర్ ప్రభుత్వం రాక్షసంగా వ్యవహరించిందని సంజయ్ మండిపడ్డారు. పసిపిల్లలు ధర్నాలో రోదిస్తుండడాన్ని చూసి అందరి మనసు ద్రవించినా కేసీఆర్ మనసు మాత్రం కరగలేదన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సకల జనుల సమ్మె నాటి పరిస్థితులు గుర్తుకొస్తున్నాయన్నారు. కష్టపడి తెలంగాణ సాధించుకున్నాక స్థానికత కోసం మళ్లీ ఉద్యమించే దుస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువకులు ఉద్యమించకపోతే, 42 రోజులు సకల జనుల సమ్మె చేయకపోతే ఇయాళ తెలంగాణ వచ్చేదా? కేసీఆర్ సీఎం అయ్యేవారా? అని ప్రశ్నించారు.

కేసీఆర్‌కు కేంద్రాన్ని తిట్టడమే పని: బండి



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: "సీఎం కేసీఆర్‌కు ఫక్తు రాజకీయాలు చేయడమే పని.. నిత్యం కేంద్రాన్ని, ప్రధానిని తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. అభివృద్ధి జరిగితే కేంద్రానికే పేరొస్తుందనే అక్కసుతో జాప్యం చేస్తున్నారు"అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ధ్వజమెత్తారు. సోమవారం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్‌తో కలిసి సంజయ్ మహబూబ్‌నగర్ జిల్లాకు వచ్చారు. అక్కడ బీజేపీ పదాధికారుల సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలను నేతలకు వివరించారు. రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ప్రధానంగా తొమ్మిది అంశాలపై చర్చించారు. వాటిని మంగళవారం జరిగే రాష్ట్ర కార్యవర్గ భేటీలో ఆమోదించనున్నారు. అంతకుముందు జడ్చర్ల- మహబూబ్‌నగర్ రహదారిలో అప్పనపల్లి వద్ద ఆర్వోబీ నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ఆర్వోబీకి కేంద్రం నిధులు మంజూరు చేసినా కేసీఆర్ ప్రభుత్వం మాత్రం ఒప్పందానికే పరిమితమైందని.. మ్యాచింగ్ గ్రాంట్ నిధులను ఇంతవరకు ఇవ్వలేదని మండిపడ్డారు. రేషన్ బియ్యం, మరుగుదొడ్లు, పల్లె ప్రకృతి వనాలు, రైతువేదికల నిర్మాణం కోసం కేంద్రమే నిధులిస్తున్నా.. కేసీఆర్ బొమ్మలు పెట్టుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.

నేడు రాష్ట్ర కార్యవర్గ భేటీ

మహబూబ్‌నగర్ భగీరథకాలనీ సమీపంలోని అన్నపూర్ణ గార్డెన్‌లో మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అధ్యక్షతన ఉదయం పది గంటలకు ప్రారంభమై సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగనుంది. సమావేశంలో 9 అంశాలపై చర్చించనున్నారు. ఈ సమావేశాల్లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, ఇతర నేతలు హాజరుకానున్నారు.

5న నాందేడ్‌లో బీఆర్‌ఎస్ సభ

▶ మొదటి పేజీ తరువాయి

దిశానిర్దేశం చేస్తున్నారు.

ముందే నిర్వహించాలనుకున్నా..

నాందేడ్‌లో బీఆర్‌ఎస్ బహిరంగ సభను ఈ నెల 29వ తేదీనే నిర్వహించాలని తొలుత భావించారు. కానీ అక్కడ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఫిబ్రవరి 5ని ముహూర్తంగా ఎంచుకున్నట్టు తెలిసింది. మహారాష్ట్ర శాసనమండలిలో రెండు పట్టభద్రుల, మూడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 30న పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 2న ఓట్ల లెక్కింపు ఉంది. దీనితో ఫిబ్రవరి 5న బీఆర్‌ఎస్ సభ చేపట్టాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఫిబ్రవరి 3న బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. అయితే సమావేశాలకు 4, 5 తేదీల్లో విరామం ఇవ్వనుండటంతో 5న నాందేడ్ సభకు అనుకూలంగా ఉంటుందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

భారీగా చేరికలు, ముఖ్య నేతలకు ఆహ్వానాలు

నాందేడ్ సభ వేదికగా మహారాష్ట్రకు చెందిన ముఖ్యనేతలు బీఆర్‌ఎస్‌లో చేరనున్నారని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఖమ్మం సభకు సీఎం కేసీఆర్‌తో పాటు ముగ్గురు సీఎంలు, ఓ మాజీ సీఎం హాజరైన తరహాలోనే నాందేడ్ సభకు కూడా వివిధ పార్టీల ముఖ్య నేతలు హాజరయ్యే అవకాశం ఉందని అంటున్నాయి. సభ నిర్వహణ ఏర్పాట్లు, చేరికలు, ఆహ్వానితులపై ఒకటి రెండు రోజుల్లో స్పష్టత రానుంది. సభ కోసం ఈ నెల 5న నాందేడ్‌కు వెళ్తున్న సీఎం కేసీఆర్ అక్కడి గురుద్వారాను సందర్శించనున్నారు.

మంత్రులకు బాధ్యతలు!: పొరుగు రాష్ట్రంలో నిర్వహిస్తున్న సభ కావడంతో ఖమ్మం సభను తలపించేలా భారీగా ఏర్పాట్లు చేయాలని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలిసింది. మహారాష్ట్ర నేతలతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను పర్యవేక్షించే బాధ్యతను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ మంత్రి జోగు రామన్న, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్‌తోపాటు మరికొందరు నేతల బృందానికి అప్పగించనున్నట్టు సమాచారం. నాందేడ్ సభకు తెలంగాణ సరిహద్దు జిల్లాలు, నియోజకవర్గాల నుంచి కూడా కొంతమేర జన సమీకరణ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది.

క్లుప్తంగా...

బీబీనగర్ ఎయిమ్స్‌లో 13 సీనియర్ రెసిడెంట్ల భర్తీ

సాక్షి, హైదరాబాద్: బీబీనగర్ ఎయిమ్స్‌లో 13 సీనియర్ రెసిడెంట్ల పోస్టుల భర్తీకి సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. జనరల్ మెడిసిన్‌లో 3, పల్మనరీ మెడిసిన్‌లో 1, జనరల్ సర్జరీలో 1, రేడియాలజీలో 2, పీడియాట్రిక్స్‌లో 2, డెర్మటాలజీలో 1, గైనకాలజీలో 1, ఆప్తల్మాలజీలో 2 చొప్పున పోస్టులను భర్తీ చేయనున్నారు. సంబంధిత విభాగాల్లో పీజీ వైద్య విద్య పూర్తి చేసిన వారు అర్హులు. జనరల్ మెడిసిన్, పల్మనరీ మెడిసిన్, జనరల్ సర్జరీ, రేడియాలజీ విభాగాల్లో పోస్టులకు వచ్చే నెల 2వ తేదీ ఉదయం 8 గంటల నుంచి... పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, గైనకాలజీ, ఆప్తల్మాలజీ విభాగాల్లో పోస్టులకు వచ్చే నెల 9వ తేదీ ఉదయం 8 గంటల నుంచి వాక్ ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు బీబీనగర్ ఎయిమ్స్ డీన్ ప్రకటించారు. నిర్దేశించిన విభాగాల్లో మూడేళ్ల పాటు పనిచేయాల్సి ఉంటుంది.

16 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలి

ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్



కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీల డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 8, 9 తేదీల్లో పార్లమెంటు వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఈబీసీ సంక్షేమ సంఘం ఏపీ చైర్మన్ చెన్నకృష్ణారెడ్డి, కృష్ణ, వెంకటేశ్, అంజి, రాజేందర్, అనంతయ్య పాల్గొన్నారు.

బోధనాస్పత్రుల్లో 30 మంది రేడియోగ్రాఫర్లు

సాక్షి, హైదరాబాద్: బోధనాస్పత్రుల్లో 30 మంది రేడియోగ్రాఫర్లను నియమిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ సోమవారం ఆదేశాలు జారీచేసింది. కోర్టు కేసు తొలగిపోవడంతో కొత్తగా 30 మంది రేడియోగ్రాఫర్ల నియామకం జరగ్గా, వీరి సేవలు వినియోగించుకునేందుకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగులు ఇస్తూ ఆ శాఖ ఆదేశాలు జారీచేసింది.

స్మార్ట్ బజార్ ఫుల్ పైసా వసూల్ సేల్



సాక్షి, హైదరాబాద్: సరికొత్త ఆఫర్లతో స్మార్ట్ బజార్ ఫుల్ పైసా వసూల్ సేల్ మళ్లీ వచ్చినట్టు సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ సేల్ ఈనెల 21 నుంచి 26 వరకు అన్ని స్మార్ట్ బజార్, స్మార్ట్ సూపర్ స్టోర్, స్మార్ట్ పాయింట్ స్టోర్స్‌లలో అందుబాటులో ఉంటుందని తెలిపింది. ప్యాకేజ్డ్ ఫుడ్, గృహోపకరణాలు, వ్యక్తిగత తమైన, కిచెన్‌కు సంబంధించిన వస్తువులపై అద్భుతమైన డిస్కౌంట్లను ఇస్తున్నట్టు వివరించింది. బిస్కెట్లు, కూల్ డ్రింక్స్, షాంపూలు, సబ్బులు, టూత్‌పేస్ట్ వంటివి 50 శాతం డిస్కౌంట్‌కే లభిస్తున్నాయని వెల్లడించింది. అలాగే మహిళలు, పురుషులు, చిన్నపిల్లల బట్టలపై 50 శాతం డిస్కౌంట్ వంటి మరెన్నో ఆఫర్లు ఉన్నట్టు పేర్కొంది.

పసుపు రైతులకు పరిహారంపై స్పష్టత ఇవ్వాలి


సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది పంట నష్టపోయిన పసుపు రైతులకు ఎలాంటి నష్ట పరిహారం ఇస్తారన్న దానిపై సీఎం కేసీఆర్ స్పష్టత నివ్వాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సోమవారమిక్కడ డిమాండ్ చేశారు. ప్రస్తుత సీజన్‌లో 80 శాతం రైతులు పంట నష్టపోయిన నేపథ్యంలో పంట నష్టంపై కేంద్రానికి లేఖ పంపుతారా? లేదంటే పంట నష్టం కట్టిస్తారా? అన్న దానిపై రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి ప్రశాంత్‌రెడ్డి చెప్పాలని అన్నారు.

డెస్క్ నుంచి డిస్క్ దాకా..

జాబ్‌లో జాగ్రత్తగా లేకుంటే జబ్బుల సమస్య

కూర్చుని తింటే కొండలైనా కరిగిపోతాయన్నది ఎప్పటి నుంచో ఉన్న నానుడి. కానీ కూర్చుని కదలకుండా పనిచేస్తే కొండంత ఆరోగ్య సమస్యలూ చుట్టుముడతాయన్నది నేటి సామెతగా మారింది. ఐటీతో పాటు అనేక రంగాల్లో కంప్యూటర్ల ముందు కూర్చుని చేసే డెస్క్‌జాబ్స్ పెరిగిపోయాయి. ఆ ఉద్యోగాల్లో ఎక్కువసేపు కూర్చునే ఉండటం, పనిఒత్తిడి కారణంగా వివిధ రకాల వ్యాధులూ పెరిగిపోతున్నాయి. అందువల్ల పనిప్రదేశంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

\- సాక్షి, హైదరాబాద్



- ఎక్కువ సేపు కూర్చుని పనిచేసే ఉద్యోగాలతో ఆరోగ్య సమస్యలు
- మెడ, వెన్నెముక, కంటి ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం.. వ్యాయామం లేకుంటే.. బీపీ, మధుమేహం వంటి వ్యాధులు కూడా
- పని చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

ఈ జాగ్రత్తలు తీసుకుంటే సమస్యలు దూరం



- కంప్యూటర్ ముందు కూర్చున్నప్పుడు వెన్నెముక కుర్చీకి ఆసాంతం ఆనుకునేలా నిటారుగా కూర్చోవాలి. కళ్లకు, స్క్రీన్‌కు మధ్య తగినంత దూరం ఉండేలా ఉంచుకోవాలి. పాదాలను నేలపై విశ్రాంతిగా ఆనించి ఉంచి మోకాలి వద్ద 90 డిగ్రీల కోణంలో కాళ్లు ఉంచాలి.
- మోచేయి ఎక్కువగా ఒత్తిడికి గురికావడం వల్ల కలిగే 'టెన్నిస్ ఎల్బో' సమస్య డెస్క్ జాబ్ ఉద్యోగుల్లో పెరుగుతోంది. ఈ పరిస్థితిలో కీబోర్డు, మౌస్‌లను వినియోగించేప్పుడు మణికట్టును వదులుగా ఉంచాలి.
- 45 నిమిషాల నుంచి గంట కంటే ఎక్కువసేపు నిర్విరామంగా కూర్చోవడం మంచిది కాదు. మధ్య మధ్యలో నిలబడటం, నడవటం చేయాలి.
- పని సమయంలో కాఫీలు/టీలు ఎక్కువగా తాగడం వల్ల డీహైడ్రేషన్ అవకాశాలు పెరుగుతాయి.
- ప్రతి 20 నిమిషాల పాటు కంప్యూటర్, ల్యాప్‌టాప్ స్క్రీన్‌పై పనిచేశాక.. కనీసం 20 సెకన్లపాటు మీకు దూరంగా ఉన్న వస్తువులను చూడాలి. దీనివల్ల కంటిపై ఒత్తిడి తగ్గుతుంది.

\- డాక్టర్ సుధీంద్ర, కిమ్స్ ఆస్పత్రి వైద్యుడు

డెస్క్ వర్క్.. 'డిస్క్'పై ఎఫెక్ట్..

ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం వల్ల శరీరంలో శక్తి ఖర్చు తగ్గి కొవ్వు పేరుకుపోతోంది. ఇది ఊబకాయానికి దారితీస్తుంది. ముందుకు వంగి కూర్చోవడం వల్ల వెన్నెముకపై ప్రభావం పడుతోంది. తొలుత పనిచేసేటప్పుడే ఈ ఒత్తిడి ఉంటుంది. తర్వాత పడుకున్నప్పుడు కూడా ఇబ్బంది పెడుతుంది. కొన్నేళ్లలో ఇది పూర్తి స్థాయి డిస్క్ సమస్యగా మారుతుంది. పనిచేసే చోట కూర్చునే తీరులో లోపాలు, దీర్ఘకాల పని గంటలే దీనికి కారణమని వైద్య నిపుణులు చెప్తున్నారు.

మణికట్టుపై 'పని'కట్టు



కార్పల్ టన్నెల్ సిండ్రోమ్.. ఈ సమస్య మణికట్టు దగ్గర వస్తుంది. మణికట్టు దగ్గర దాదాపు 15 చిన్నచిన్న కండరాలు ఉంటాయి. వీటిలో ఒక్క కండరానికి వాపు వచ్చినా మిగతా అన్నింటిపై ఒత్తిడి పడుతుంది. దీనితో చేతిలో తిమ్మిర్లులా రావడం, రాత్రి పడుకున్నప్పుడు వేళ్లు వణకడం వంటివి జరగొచ్చు. రోజంతా మౌస్, కీబోర్డు వాడి.. ఆ తర్వాత బైక్ హ్యాండిల్, కార్ స్టీరింగ్ పట్టుకోవాల్సిన అవసరం వల్ల మణికట్టు కండరాలు మరింత అధిక శ్రమకు గురవుతాయి.

ఐటీ రంగంలో ఎక్కువగా..

ప్రముఖ వెల్‌నెస్ సంస్థ సోల్ హెల్త్‌కేర్ సంస్థ అధ్యయనం ప్రకారం.. ఐటీ రంగంలో ఆరోగ్య సమస్యలు బాగా పెరిగిపోయాయి. ఓ కంపెనీలో పనిచేసే 784 మందిని ఎంచుకుంటే.. అందులో 179 మంది నడుము నొప్పి, 129 మంది గర్భాశయం, వెన్నెముకలోని కీళ్లు/ డిస్క్‌లను ప్రభావితం చేసే గర్భాశయ స్పాండిలోసిస్, 65 మందిలో కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ (చేతుల్లో తిమ్మిర్లు), 61 మందిలో సాక్రోలియాక్ సమస్యలు ఉన్నట్టు గుర్తించారు.

- ఐటీ ఉద్యోగుల్లో గుండె జబ్బులు 147 శాతం ఎక్కువని, వీటితో మరణించే ప్రమాదం 18 శాతం పెరుగుతోందని అన్నల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్ అధ్యయనంలో వెల్లడైంది.
- ది జర్నల్ ఆఫ్ నేషనల్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక ప్రకారం.. ఎక్కువగా కూర్చోవడం పెద్దపేగు కేన్సర్ ప్రమాదాన్ని 24 శాతం, ఊపిరితిత్తుల కేన్సర్ ప్రమాదాన్ని 21 శాతం, ఎండోమెట్రియల్ కేన్సర్ ప్రమాదాన్ని 24 శాతం వరకు పెంచుతోంది. కాళ్లలోని సిరల్లో రక్తం గడ్డకట్టడం వల్ల వచ్చే డీప్ వెయిన్ థ్రాంబోసిస్‌కు దారి తీయవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముందే గుర్తించా..



కంప్యూటర్ ముందు పనిచేయడం మొదలెట్టిన కొన్నినెలల్లోనే ఆరోగ్యంలో తేడా గమనించాను. వేళ్ల తిమ్మిర్లు, నొప్పులు, కళ్లు పొడిబారడం వంటి సమస్యలు వచ్చాయి. డాక్టర్‌ను కలిసి వారి సూచనలకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటూ పనిచేస్తున్నా. ఇప్పుడు సమస్యలు తగ్గిపోయాయి. మా సీనియర్లలో చాలా మంది మాత్రం ఇలాంటి సమస్యలతో బాధపడుతున్నారు.

\- స్రవంతి, ప్రైవేటు ఉద్యోగిని

హెల్త్ సెషన్స్ జరుగుతున్నాయి



మానసిక ఒత్తిడి, శారీరక సమస్యలు కార్పొరేట్ సంస్థల ఉద్యోగుల్లో ఇప్పుడు సాధారణమైపోయాయి. అనేకమంది జాబ్స్ వదిలేసి సొంత ఉపాధి వైపు మళ్లుతుండటానికి ఇదో కారణం కూడా. అందుకే ఆఫీసుల్లోనే ఆరోగ్యంపై వర్క్‌షాప్స్ జరుగుతున్నాయి.

\- సంతోష్, ఐటీ ఉద్యోగి

రూ.3 లక్షల కోట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాధాన్యమిచ్చేలా బడ్జెట్ రూపకల్పన చేస్తోంది. పింఛన్లు, దళితబంధు, రైతుబంధు, బీమా, రుణమాఫీ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి సంక్షేమ పథకాలకు నిధుల కొనసాగింపుతోపాటు సాగునీటి ప్రాజెక్టులు, రీజనల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్), రాష్ట్ర రహదారులు, విద్యుత్ సబ్సిడీలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించే అవకాశాలున్నాయి. సాగునీటి పథకాలకు రూ.35వేల కోట్లు ప్రతిపాదించే అవకాశముంది. దీనికితోడు వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.30 వేల కోట్లు, ఉద్యోగుల, జీతభత్యాల పద్దు కింద రూ.40 వేల కోట్లు, పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద రూ.2,500 కోట్లు ప్రతిపాదించనున్నట్టు సమాచారం. వీటితోపాటు అప్పులకు వడ్డీల కింద రూ.12 వేల కోట్లు, అప్పుల చెల్లింపు కింద రూ.18వేల కోట్లు ప్రతిపాదించే అవకాశముంది.

బడ్జెట్‌లో బ్యాలెట్ బాక్స్ పథకాలు!

ఎన్నికలే లక్ష్యంగా బ్యాలెట్ బాక్స్ పథకాలనూ ఈసారి బడ్జెట్‌లో ప్రకటిస్తారనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది. అందులోభాగంగానే రాష్ట్రంలోని దాదాపు 13 వేల గ్రామపంచాయతీలకు ఒక్కోదానికి రూ.10లక్షల చొప్పున దాదాపు రూ.1,300 కోట్ల వరకు ప్రకటించే చాన్సుంది. సొంత స్థలం ఉంటే ఇల్లు కట్టుకునేందుకు రూ.3 లక్షలు ఇచ్చే పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు కూడా సిద్ధమైనందున దీనికి రూ.12వేల కోట్లు కావాలని ఆ శాఖ ప్రతిపాదించింది. అలాగే, దళితబంధు తరహాలోనే గిరిజన బంధును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. గిరిజన బంధును ప్రకటిస్తే ఈ పద్దు కింద రూ.5వేల కోట్ల వరకు చూపించే అవకాశముంది. వీటితోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్, మన ఊరు–మన బడి, పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు, సబ్సిడీ గొర్రెల పథకం, ఉచిత చేప పిల్లల పంపిణీ, ఆర్టీసీకి ఆసరా లాంటి కార్యక్రమాలకూ నిధులు పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.2.56 లక్షల కోట్ల ప్రతిపాదనలను ప్రభుత్వం పెట్టగా, అందులో రూ.2.3 లక్షల కోట్ల వరకు సవరించిన అంచనాలు వచ్చే అవకాశముందని సమాచారం. గత బడ్జెట్ కంటే 15 శాతం వరకు బడ్జెట్‌ను పెంచే అవకాశముందని, అందువల్ల ఈసారి పద్దు రూ.3 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా.

కీలక శాఖల ప్రతిపాదనలు ఇలా..

- మౌలిక సౌకర్యాల కల్పనలో కీలకమైన ఆర్‌అండ్‌బీకి నిధులు పెంచే అవకాశముంది. రాష్ట్ర రహదారులకు రూ.6 వేల కోట్లు, భవనాల నిర్మాణానికి రూ.850 కోట్లు, ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగంలో (సంగారెడ్డి–చౌటుప్పల్) భూసేకరణ కోసం రూ.2,500 కోట్లు కావాలని ఆ శాఖ అధికారులు ప్రతిపాదించారు. గత మూడేళ్లుగా ప్రభుత్వం ఆర్టీసీకి రూ.1500 కోట్లు కేటాయిస్తుండగా, ఈసారి కొత్త బస్సులు కొనాల్సిన పరిస్థితుల్లో బడ్జెట్ పెరుగుతుందని ఆర్టీసీ అధికారులు ఆశిస్తున్నారు.
- గత బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించిన పంచాయతీరాజ్ శాఖకు ఈసారి రూ.35 వేల కోట్లు అవసరం అవుతాయని ఆ శాఖ ప్రతిపాదించింది. ఆసరా పింఛన్ల కింద రూ.14 వేల కోట్లు, వడ్డీలేని రుణ పథకానికి రూ.3 వేల కోట్లు కావాలని కోరింది.
- రూ.15 వేల కోట్లు కేటాయించాలని ఆరోగ్య శాఖ ప్రతిపాదించింది.
- నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రం విధించిన ఆంక్షలతో ఏడాది కాలంగా కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల పనుల్లో వేగం తగ్గింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు ఇప్పటికే వాటి కోసం తీసుకున్న రుణాల చెల్లింపుల కోసం రూ.35 వేల కోట్లు కేటాయించాలని నీటి పారుదల శాఖ ప్రతిపాదించింది. కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణాలకు అసలుతోపాటు వడ్డీల చెల్లింపులకు గతేడాది రూ.12 వేల కోట్ల వ్యయమైందని, ఈ ఏడాది రుణాలు, వడ్డీల చెల్లింపులకు వ్యయం మరింత పెరిగి రూ.14 వేల నుంచి రూ.15 వేల కోట్లకు పెరగనున్నట్టు ప్రభుత్వానికి తెలిపింది. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు పనులు, భూసేకరణ, పరిహారం చెల్లింపులకు మరో రూ.5 వేల కోట్లు కోరినట్టు తెలిసింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు రూ.4వేల కోట్లు, సీతారామ ప్రాజెక్టుకు రూ.వెయ్యి కోట్లు, కల్వకుర్తి ఎత్తిపోతలకు రూ.500 కోట్లు కేటాయించనున్నట్టు సమాచారం.

ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

'ప్రాన్' ఖాతాల్లో జమ చేస్తూ, మిగతా 90 శాతాన్ని నగదు రూపంలో ఎనిమిది వాయిదాల్లో చెల్లించనుంది. ఈనెల నుంచి డీఏను వేతనంతో కలిపి చెల్లించనుంది. పెన్షనర్లకు రావాల్సిన కరువు భత్యాన్ని (డీఆర్) కూడా 2.73 శాతం పెంచగా, జూలై 2021 నుంచి డిసెంబర్ 2022 వరకున్న బకాయిలను ఎనిమిది వాయిదాల్లో చెల్లించనున్నట్లు ప్రభుత్వం అందులో స్పష్టం చేసింది. డీఏ/డీఆర్ పెంపుతో రాష్ట్రంలోని 4.40 లక్షల మంది ఉద్యోగులు, 2.88 లక్షలమంది పెన్షనర్లకు లబ్ధి కలుగుతుందని ఆర్థికమంత్రి హరీశ్ సోమవారం ట్విట్టర్ వేదికగా తెలిపారు.

ఇంటర్ అఫిలియేషన్ ప్రక్రియ ప్రారంభం

- షెడ్యూల్ ప్రకటించిన బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్

సాక్షి, హైదరాబాద్: అఫిలియేషన్ వ్యవహారంలో వివాదాలకు తెరదించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు ఉపక్రమించింది. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించిన అనుబంధ గుర్తింపు ప్రక్రియను ప్రారంభించింది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను బోర్డ్ సోమవారం విడుదల చేసింది. గతంలో పరీక్ష ఫీజు చెల్లించే తేదీ సమీపిస్తున్నా.. అఫిలియేషన్ వ్యవహారం కొలిక్కిరాక గుర్తింపు రాని కాలేజీల్లోని విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం లేకుండా పోయేది. దీంతో ఇలాంటి వివాదాలకు ఫుల్‌స్టాప్ పెడుతూ వచ్చే ఏడాది కాలేజీలు మొదలయ్యే నాటికే అఫిలియేషన్ల ప్రక్రియ ముగించాలని బోర్డు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 2023–24 విద్యాసంవత్సరానికి కళాశాలల అనుబంధ గుర్తింపు నోటిఫికేషన్‌ను బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ విడుదల చేశారు. ఏప్రిల్ 30 లోపే అనుబంధ గుర్తింపు పొందిన కాలేజీల జాబితాను ప్రకటించాలని బోర్డు గడువుగా పెట్టుకుంది.

అలస్యం లేకుండా ముందే

రాష్ట్రంలోని ఇంటర్ కాలేజీలు బోర్డు అనుబంధ గుర్తింపును పొందిన తర్వాతే నడపాల్సి ఉంటుంది. కొత్త కాలేజీల ఏర్పాటుకు అవకాశం లేకపోగా, నడుస్తున్న కాలేజీలు, వీటిల్లో అదనపు సెక్షన్లకు ఏటా అనుబంధ గుర్తింపును పునరుద్ధరిస్తుంటారు. అయితే కొంతకాలంగా అనుమతుల జారీ ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఇదంతా జూన్ కంటే ముందుగానే ముగియాల్సి ఉండగా, సెప్టెంబర్ వరకు కొనసాగుతోంది. అనుబంధ గుర్తింపు పొందకుండానే కాలేజీలు అడ్మిషన్లు తీసుకుని విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. దీంతో ఏటా గందరగోళానికి దారి తీస్తోంది. ఈ సంవత్సరం మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ కారణంగా డిసెంబర్ వరకు అఫిలియేషన్ల జారీ కొనసాగింది. ఈ నేపథ్యంలో బోర్డు ఈసారి ముందుగానే అనుమతుల షెడ్యూల్ ప్రకటించింది. అనుబంధ గుర్తింపు కోసం కాలేజీ యాజమాన్యాలు ఆలస్య రుసుము లేకుండా ఈనెల 25 నుంచి ఫిబ్రవరి 21 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని నవీన్‌మిత్తల్ చెప్పారు. ఆలస్య రుసుముతో మార్చి 31 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు.

అఫిలియేషన్ దరఖాస్తుల షెడ్యూల్ ఇలా..

ఆలస్య రుసుము లేకుండా	21-2-2023 వరకు
రూ. వెయ్యి ఆలస్య రుసుముతో	28-2-2023 వరకు
రూ.5వేల ఆలస్య రుసుముతో	07-3-2023 వరకు
రూ.10వేల ఆలస్య రుసుముతో	14-3-2023 వరకు
రూ.15వేల ఆలస్య రుసుముతో	21-3-2023 వరకు
రూ.20వేల ఆలస్య రుసుముతో	31-3-2023 వరకు

30న 'అనాథల అరిగోస' పేరుతో దీక్ష

మంద కృష్ణమాదిగ



అభివాదం చేస్తున్న మందకృష్ణ, హరగోపాల్ పలు పార్టీలు, సంఘాల నేతలు

పంజగుట్ట: అనాథలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు, మంత్రివర్గ ఉపసంఘం చేసిన ప్రతిపాదనలు గుర్తు చేసేందుకు 30వ తేదీన ఇందిరాపార్క్ వద్ద 'అనాథల అరిగోస' పేరుతో దీక్ష నిర్వహిస్తున్నట్లు అనాథల హక్కుల పోరాట వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. పోరాట వేదిక ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అనాథ హక్కుల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు, మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదనలు గుర్తుచేస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ప్రొఫెసర్ హరగోపాల్, కాంగ్రెస్ నేతలు మల్లు రవి, అద్దంకి దయాకర్, రాములు నాయక్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, టీడీపీ నేత రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఆప్ నేత ఇందిరా శోభన్, జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు రాములుతోపాటు పలు ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. మందకృష్ణ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అనాథలకు ఎన్నో హామీలు ఇచ్చి నేటికి ఏడు సంవత్సరాల ఏడు నెలలు అయ్యిందని ఇప్పటికీ అవి నెరవేర్చకుండా మోసం చేశారని విమర్శించారు.

కోర్టు ఆదేశాలున్నా.. అనుమతి ఇవ్వరా?

- బీఈడీ పూర్తయిన బీటెక్ అభ్యర్థుల కేసులో అధికారులపై హైకోర్టు ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టీజీటీ) పరీక్ష రాసిన బీఈడీ చేసిన బీటెక్ అభ్యర్థులకు పోస్టింగ్‌లలో పరిగణనలోకి తీసుకోవాలని ఇది వరకే ఆదేశాలు ఇచ్చినా అధికారులు అమలు చేయకపోవడంపై హైకోర్టు మండిపడింది. ఆదేశాలు ఎందుకు అమలు చేయడంలేదో నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని తెలంగాణ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ సంస్థల నియామక బోర్డు(టీఆర్‌ఈఐఆర్‌బీ) చైర్మన్ రోనాల్డ్ రాస్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 20వ తేదీకి వాయిదా వేసింది. 2011 వరకు బీఏ, బీఎస్సీ ఉత్తీర్ణులైనవారికి మాత్రమే బీఈడీ రాసేందుకు అవకాశం ఉండేది. తర్వాత బీకాం ఉత్తీర్ణులైనవారికీ అనుమతిచ్చారు. 2015 లో బీటెక్ వారికి కూడా మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులుగా బీఈడీ చదివే వెసులుబాటు ఇచ్చారు. బీటెక్ తర్వాత బీఈడీ చేసిన వారికి డీఎస్సీ, టీజీటీ రాసేందుకు అనుమతి ఉన్నా పోస్టింగ్‌లకు అర్హత లేదంటూ సర్కారు స్పష్టం చేసింది. దీనిపై వరంగల్ జిల్లాకు చెందిన డి.కవిత అనే అభ్యర్థితో పాటు ఇతర జిల్లాలవారు హైకోర్టును ఆశ్రయించారు. వీరికి అనుకూలంగా తీర్పు వెలువడింది. పోస్టింగ్‌లు ఇవ్వాలని ఆదేశించింది. ఈ తీర్పుపై అధికారులు అప్పీల్ వేయగా హైకోర్టు కొట్టివేసింది. అధికారుల తీరును తప్పు బట్టింది. అప్పీల్‌ను కొట్టివేస్తూ 2019లో హైకోర్టు అధికారులకు ఆదేశాలిచ్చినా ఆ మేరకు చర్యలు చేపట్టలేదు. దీంతో అభ్యర్థులు టీఆర్‌ఈఐఆర్‌బీ చైర్మన్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాలను కావాలనే పట్టించుకోని ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.

ఇద్దరు చిన్నారులకు బాలశక్తి పురస్కారాలు

- పీఎం రాష్ట్రీయ బాల పురస్కారాలు అందించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- కళ – సంస్కృతి విభాగంలో తెలంగాణకు చెందిన నాట్యకళాకారిణి ఎం.గౌరవి రెడ్డి
- క్రీడల విభాగంలో ఏపీకి చెందిన చెస్ క్రీడాకారిణి కోలగట్ల అలాన మీనాక్షి



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకుంటున్న గౌరవి రెడ్డి, అలాన మీనాక్షి

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు చిన్నారులు 2023 సంవత్సరానికిగానూ ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలశక్తి పురస్కారాలను అందుకున్నారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఆరు విభాగాల్లో 11 మంది చిన్నారులకు బాలశక్తి పురస్కారాలు అందజేశారు. కళ, సంస్కృతి విభాగంలో నలుగురు, శౌర్యం విభాగంలో ఒకరు, నూతన ఆవిష్కరణలలో ఇద్దరు, సామాజికసేవలో ఒకరు, క్రీడా విభాగంలో ముగ్గురు మొత్తంగా 11 మంది చిన్నారులకు పురస్కారాలను అందించారు. కళ సంస్కృతి విభాగంలో అతి పిన్న వయస్కురాలిగా యునెస్కోలోని ఇంటర్నేషనల్ డ్యాన్స్ కౌన్సిల్‌లో నామినేట్ అయిన తెలంగాణకు చెందిన నాట్యకళాకారిణి ఎం.గౌరవి రెడ్డి, క్రీడా విభాగంలో విశాఖపట్నానికి చెందిన 11 ఏళ్ల అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి, గతేడాది మే–అక్టోబర్ మధ్య అండర్–11 బాలికల కేటగిరీలో ప్రపంచ నెంబర్–1 గా నిలిచిన కోలగట్ల అలాన మీనాక్షి ఈ బాలశక్తి పురస్కారాలు స్వీకరించారు. అవార్డు గ్రహీతలకు పతకం, రూ.లక్ష నగదు బహుమతి, ధ్రువపత్రం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అందించారు. కాగా మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు పురస్కారాల గ్రహీతలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంభాషించనున్నారు.



ఆలోచించగా ఆలోచించగా ఒక ఫ్లేన్‌లో అందవికారమనేది వుండదేమో, అంతా అందమైనదనే తోస్తుందేమో. లోకమంతా అనేక విధమైన అందాలుగానే కనబడుతుందేమో అనుకుంటాను.

– చలం

సాక్షి

మంగళవారం, జనవరి, 24

మాటల వెనుక మూటలున్నాయ్!

ఏం కొనాలి? ఎక్కడ తినాలి? ఎందులో డబ్బులు పెట్టాలి? పెరిగిన సోషల్ మీడియా పుణ్యమా అని కంపెనీల నుంచి కాసుల కోసమో, కానుకల కోసమో ఇవన్నీ చెబుతున్న అపర డిజిటల్ ఆర్థిక మేధావులకు ఇక కళ్ళెం పడనుంది. సామాన్యుల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్న సోషల్ మీడియా ప్రజాభిప్రాయ పరికల్పకులకు సర్కార్ మార్గదర్శకాలు ప్రకటించింది. అమాయకులను తప్పుదోవ పట్టిస్తున్న వాణిజ్య ప్రకటనలకు అడ్డుకట్ట వేయడానికీ, సోషల్ మీడియా ప్రభావిత మార్కెట్ విస్తరిస్తున్న వేళ వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికీ ఇది మరో ముందడుగు.

సోషల్ మీడియా ప్రభావశీలురలో ఎక్కువ మంది ఆన్‌లైన్‌లో తమకున్న అనుచరగణమే పెట్టుబడిగా, సంస్థల నుంచి భారీ రుసుము తీసుకుంటూ, అడ్డమైనవాటినీ కొనుక్కోమని సిఫార్సులు చేస్తున్నారు. రోజువారీ వినియోగ వస్తువుల నుంచి క్రిప్టోకరెన్సీలు, నాన్-ఫంగిబుల్ టోకెన్లు, క్రిప్టో డిపాజిట్ల దాకా అన్నిటికీ ఈ జాడ్యం సోకింది. వారికి పోయేదేమీ లేదు కానీ, వారి మాట నమ్మి డబ్బులు పెట్టిన అమాయకులకే నష్టం. అందుకే, ఎలాంటి కానుకలు, హోటల్ బసలు, ఈక్విటీలు, రాయితీలు, అవార్డులందుకొని ఈ ఉత్పత్తులు, సేవలు, పథకాలను సిఫార్సు చేస్తున్నదీ ఈ మిడిమేలపు మేధావులు వెల్లడించాలని సర్కారు షరతు పెట్టింది. ఈ చర్య సహేతుకం, స్వాగతనీయం.

ఇవాళ ప్రపంచమంతా స్థానిక నుంచి బహుళజాతి సంస్థల వరకు అన్నీ తమ బ్రాండ్లు, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను చురుకుగా వాడడం తాజా ధోరణి. సదరు వ్యక్తుల అడ్డగోలు సమర్థనలు, మరీ ముఖ్యంగా ఆర్థిక ఉత్పత్తులు, మదుపులకు సంబంధించినవి బాగా పెరిగాయి. వీటికి సర్కార్ పగ్గాలు వేయనున్నట్టు గత సెప్టెంబర్ నుంచి వార్తలొస్తూనే ఉన్నాయి. ఈ జనవరి 20న అవి నిజమయ్యాయి. సోషల్ మీడియాలో వివిధ ఉత్పత్తుల్ని సమర్థిస్తూ ప్రకటనలిస్తున్నప్పుడు ప్రముఖులు, ప్రభావశీలురు, వర్చ్యువల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు (అవతార్ లాంటి కంప్యూటర్ పాత్రలు) ఎలాంటి విధివిధానాల్ని పాటించాలనేది సర్కార్ తేల్చేసింది.

నిరుడు రూ. 1275 కోట్లున్న సోషల్ మీడియా ప్రభావశీలుర విపణి ఏటా 20 శాతం వంతున పెరగనుంది. 2025 నాటికి అది రూ. 2800 కోట్లకు ఎగబాకుతుందని తాజా అంచనా. అందుకే, సోషల్ మీడియాను సందుగా చేసుకొన్న నవతరం ప్రసిద్ధులు బాధ్యతాయుతంగా ప్రవర్తించడానికి మార్గదర్శకాలు పెట్టడం మంచి పని. ఈ పండితమ్మన్యులు సదరు ఉత్పత్తుల్ని వాడకుండానే, స్వీయ లబ్ధికై వాటిని ప్రోత్సహిస్తున్నారని తెలుసుకోక సామాన్యులు ఉచ్చులో పడిపోవడం సహజం. ఇప్పుడు సదరు బ్రాండ్లతో తమకున్న బంధాన్ని ఇన్‌ఫ్లుయెన్సర్లు సామాన్య భాషలో, ఫోటోలతో సహా ఎలా బయటపెట్టాలో నిర్దేశించారు. అవి జనం దృష్టిని తప్పించుకోలేవన్నది లాభం. ఈ సరికొత్త పారదర్శకతతో, తుది కొనుగోలు నిర్ణయం వినియోగదారుల విచక్షణకు వదిలేసినట్టవుతుంది.

స్వీయ నియంత్రణ సంస్థ అయిన అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 2021లోనే పెయిడ్ ప్రమోషన్‌ను స్పష్టంగా పేర్కొనాలంది. కానీ, ఆ సంస్థ వద్దకు వస్తున్న ఉల్లంఘనల్లో మూడో వంతు ఈ ఇన్‌ఫ్లుయెన్సర్లవే. సోషల్ మీడియాతో ఎవరైనా రాత్రికి రాత్రి ఫేమసవుతున్న వేళ పెరుగుతున్న తప్పుడు ప్రకటనలపై కొరడా తీస్తూ, వినియోగదారుల వ్యవహారాల విభాగం పక్షాన ఈ తాజా నిబంధనలు వచ్చాయి. వీటిని ఉల్లంఘిస్తే, వినియోగదారుల పరిరక్షణ చట్టం- 2019 కింద జరిమానా తప్పదు. అది కాక ఉత్పత్తిదారులు, ప్రకటనకర్తలు, సమర్థకులకు రూ. 10 లక్షల దాకా కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ జుల్మానా వేస్తుంది. మళ్ళీ తప్పు చేస్తే, 50 లక్షలు. తప్పుదోవ పట్టిస్తూ ఒక ఉత్పత్తిని సమర్థిస్తే, ఏడాది పాటు ఆ వ్యక్తిపై నిషేధం. మరోసారి గీత దాటితే, ఆ వేటును మూడేళ్ళు పొడిగించవచ్చు.

యూ ట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాలలో కంటికి నదురుగా కనిపిస్తూ, మాటలతో బుట్టలో వేసే ప్రభావశీలురకు చేతిలో పైసలు, సమాజంలో ప్రాచుర్యం, సక్సెస్‌లకు కొదవ ఉండదు. కానీ, ఫలానా ఉత్పత్తిని సమర్థించడానికీ, సిఫార్సు చేయడానికీ వారికి ఉన్న అర్హత, అపరిమిత జ్ఞానం ఏమిటంటే ప్రశ్నార్థకమే. ఒకప్పుడు ప్రభావశీలురంటే- అనుభవం గడించి, ఆలోచనల్ని ఆచరణలో పెట్టిన మేధావులు, సామాజిక కార్యకర్తలు, పరిణామ చోదకులు. వారి మాటకెంతో విలువ. కానీ, ఇప్పుడు సోషల్ మీడియాలో లైకులు, షేర్లు చేసే అనుచరులు కనీసం లక్ష మంది ఉన్న కాలేజీ కుర్రకారు, చదువులో డింకీ కొట్టినవాళ్ళూ ఇన్‌ఫ్లుయెన్సర్లే. పుస్తకాలు, సిన్మాలు, ఉత్పత్తుల రివ్యూల నుంచి ఆర్థికసలహాల దాకా ఎవరైనా, ఏదైనా చెప్పచ్చు. లేని మేధావితనం చూపచ్చు. అదే పెద్ద చిక్కు.

చేతిలో స్మార్ట్‌ఫోన్లు, చేతి నిండా ఇంటర్నెట్‌తో డబ్బులెలా మదుపు చేయాలన్న ఆర్థిక పరిజ్ఞానం కోసం సాధారణంగా యువతరం సోషల్ మీడియా వేదికలను ఆశ్రయిస్తోంది. మదుపరుల్లో చైతన్యం పెంచే అధికారిక సెమినార్లు, వ్యాసాల కన్నా ఆకర్షణీయంగా ఈ వేదికలు సమాచారాన్ని అందించడమే అందుకు ప్రధాన కారణం. 25 లక్షల మంది కంటెంట్ క్రియేటర్లున్న మార్కెట్‌లో నూటికి 60 సంస్థలు దీన్ని ఆసరాగా చేసుకొని ఎదుగుతున్నాయట. అందుకే, జనం తేలిగ్గా మోసపోకుండా ఉండాలంటే, ఇన్‌ఫ్లుయెన్సర్లకు మార్గదర్శకాలిస్తే చాలదు. మదుపరుల్ని ఆర్థిక విద్యావంతుల్ని చేసి, పరిజ్ఞానంతో పాటు చైతన్యం పెంచే ప్రణాళికలను చేపట్టాలి. ప్రముఖులెవరో చెప్పారు కదా అని అడ్డమైన మాటల్నీ అతిగా నమ్మితే అసలుకే మోసమని అందరూ గ్రహించాలి. ఎందుకంటే, ఒక ప్రకటనలో ఓ పెద్దమనిషి నిత్యం చెబుతున్నట్టు డబ్బులు ఎవరికీ ఊరికే రావు!

హేతువాదమే మౌఢ్యానికి విరుగుడు



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

భారత హేతువాద సంఘాధ్యక్షుడు రావిపూడి వెంకటాద్రి తన 101వ సంవత్సరంలో పరమపదించారు. హేతువాదాన్నీ, మానవతావాదాన్నీ వ్యాపింపజేయడానికి దశాబ్దాలుగా వేలకొలదీ పేజీల ద్వారా అనంతమైన కృషి సల్పిన హేతువాది ఆయన. బౌద్ధాన్నీ, దాని హేతువాద దృక్పథాన్నీ నాశనం చేయడం కోసం రాజకీయ ఆధిపత్యం చలాయించిన శక్తుల దుర్మార్గాన్ని చారిత్రకాధారాలతో నిరూపించారు. అసహనం, ద్వేషాల వల్ల మత విశ్వాసాలు మారవని ఆయనకు స్పష్టంగా తెలుసు. మతమౌఢ్యం మారాలంటే మానసిక పరివర్తన రావాలనీ, అది చాలా నిదానమైన క్రమమనీ అంటారు. మనుషుల్లో ఉన్న వివేచనా జ్ఞానాన్ని పని చేయించడం ద్వారానే మౌఢ్యాన్ని రూపుమాపవచ్చునన్నది హేతువాదుల నిశ్చితాభిప్రాయమని చెబుతారు.

"వైజ్ఞానిక పునాదుల పైన, శాస్త్రీయ పరిజ్ఞానం పైన మాత్రమే మానవుల సుఖసంతోషాలు ఆధారపడి ఉంటాయి."

– స్వతంత్ర భారత తొలి ఉప రాష్ట్రపతిగా సర్వేపల్లి రాధాకృష్ణ

కొన్ని శతాబ్దాల క్రితం వేమన, బద్దెన ఏ నీతులు శతక వాఙ్మయం ద్వారా బోధించారో వాటికి కాలం గడిచిన కొలదీ విలువ పెరుగుతూనే ఉంది. మూఢ విశ్వాసాల నుంచి ప్రజా బాహుళ్యానికి కొంత విమోచన వచ్చినా- పాలక శక్తుల ప్రాపకంతో సమాజంలో పెరుగుతూ వచ్చిన కుల, మత శక్తుల నుంచి విమోచన ఇంకా ప్రజలకు దూరంగానే ఉంది.

ఎనిమిది దశాబ్దాలుగా తెలుగు ప్రజల్ని హేతువాదం ద్వారా నిరంతరం చైతన్యంతో రగిలించిన భారత హేతువాద సంఘాధ్యక్షుడు, 'హేతువాది' పత్రిక ప్రధాన సంపాదకులు, దార్శనికుడు రావిపూడి వెంకటాద్రి తన 101వ సంవత్సరంలో పరమపదించారు. నిష్కల్మష హృదయంతో జీవితం సహేతుక పద్ధతిలో గడిపితే వ్యక్తి మనస్సు ముదిమిని జయిస్తుందని తన జీవితం ద్వారా నిరూపించారు వెంకటాద్రి. సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాలు, భారతీయ తత్వ దర్శనాలు, సత్యాన్వేషణ, ఆస్తికత్వం, నాస్తికత్వం, హేతుత్వం, మత తత్వం – ఆయన అన్వేషణా రంగాలు. హేతువాదాన్నీ, మానవతావాదాన్నీ వ్యాపింపజేయడానికి వేలకొలదీ పేజీల ద్వారా వందలాది సంపుటాల ద్వారా అనంతమైన కృషి సల్పిన విస్పష్ట తొలి తెలుగు హేతువాది ఆయన.

మహాకవి గురజాడ అప్పారావు 110 సంవత్సరాల నాడే – దేశవ్యాపితంగా ఖ్యాతి గడించిన బౌద్ధ ధర్మాన్ని కుల, మత స్వార్థపర వర్గాలు భారత సరిహద్దుల నుంచి ఎలా తరిమికొట్టాయో చెప్పారు. దేశంలోని బౌద్ధ ధర్మ, హేతువాద పీఠాల్ని బలవంతంగా కూల్చి, వాటి స్థానే హేతువాద విరుద్ధ క్షేత్రాలకు పాలకులు ప్రాణ ప్రతిష్ఠ చేయడం జరిగింది. 'క్రీ.శ. రెండు, మూడు శతాబ్దాల నాటికే' కుల, మత వ్యవస్థకు పునాదులు గట్టిపరచుకొనే శక్తులకూ, బౌద్ధానికీ మధ్య జరిగిన సంఘర్షణకు ఆంధ్రలోని శ్రీ పర్వతమే కేంద్రం; బౌద్ధేతర శక్తులు బౌద్ధ భిక్షువులను వారి ఆరామాల నుండి బలవంతంగా బహిష్కరించి, నాగార్జున కొండ వద్ద ఉన్న బౌద్ధారామాలను, విహారాలను ఎలా స్వాధీనం చేసుకున్నారో రావిపూడి వెంకటాద్రి నిరూపణలతో రుజువు చేశారు. క్రీస్తుపూర్వం శుంగుల కాలం నుంచి క్రీ.శ. ఏడవ శతాబ్దం దాకా బౌద్ధాన్నీ, దాని హేతువాద దృక్పథాన్నీ నాశనం చేయడం కోసం రాజకీయ ఆధిపత్యం చలాయించిన శక్తుల దుర్మార్గాన్ని చారిత్రకాధారాలతో రావిపూడి నిరూపించారు. చైనా యాత్రికులైన- క్రీ.శ. 4వ శతాబ్దంలో మన దేశాన్ని సందర్శించిన ఫాహియాన్ గానీ, 7వ శతాబ్దం నాటి హ్యుయాన్ త్సాంగ్ గానీ బౌద్ధుల మీద జరిగిన అనేక దాడుల వివరాలను ఎలా పేర్కొన్నారో వివరించారు.

రెండో మాట



హేతువు మీద ఆధారపడి వర్ధిల్లిన లోకాయత, చార్వాక, బౌద్ధాది దర్శనాల్లోని హేతుబద్ధ భారతీయ తత్వాన్ని పతనం చేసిన తరువాతనే భావవాదం, ఛాందసవాదానికి కొమ్ములు మొలవడం ప్రారంభించాయని రావిపూడి ఉదాహరించారు. సుప్రసిద్ధ చరిత్రకారుడు లక్ష్మీనరసు తన 'బౌద్ధం అంటే ఏమిటి?' గ్రంథంలో బౌద్ధ ధర్మసారం వివరించారు. ఆ సారాంశాన్ని ఆయన బుద్ధుని మాటల్లోనే చెప్పారు: "నేను బోధించే ధర్మం అందరి పట్ల సమాన ఆదరణ కల్గిన ధర్మం. దీన్ని మన, తన భేదం లేకుండా అందరికీ బోధించండి. ఇది మంచివారిని, చెడ్డవారిని, సంపన్నులను, పేదలను ఒకే విధంగా విముక్తి చేస్తుంది. దీని నుంచి ఎవరికీ ఎలాంటి మినహాయింపూ లేదు. కరుణామయులైనవారు తమను మాత్రమేగాక, ఇతరులనూ విముక్తి చేయాలని కోరుకుంటారు. ఎందరినో విముక్తి చేసినా, చెయ్యవలసింది మరెంతో ఉంటుంది. ఇది నిరంతరం కొనసాగవలసిన ప్రక్రియ. ఈ ధర్మం ప్రపంచమంతా వ్యాపించి దుఃఖసాగరంలో మునిగిన అందరినీ రక్షించాలి."

ప్రాచీన కాలంలోనే విజ్ఞాన కాంతుల్ని వెదజల్లుతూ, సంఘంలోని అజ్ఞానాంధకారాలను బట్టబయలు చేయడానికి బయల్దేరిన భావ విప్లవోద్యమం వెయ్యేళ్ళకుపైగా వర్ధిల్లి జన్మించిన భారతదేశంలోనే అడుగంటిపోవడం ఎంతటి విషాదకర పరిణామమో అంటారు రావిపూడి వెంకటాద్రి. ఇక కాలక్రమంలో బౌద్ధంలో చొరబడిన విగ్రహారాధన, పునర్జన్మ, కర్మ సిద్ధాంతాల వంటి మత వాసనలు కూడా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ బౌద్ధాన్ని స్వీకరించడంతో తొలగిపోయి హేతువాద, మానవతావాదాలపై ఆధారపడిన సిసలైన బౌద్ధం వర్ధిల్లాలని రావిపూడి ఆశించారు. అందుకే ఒక సందర్భంలో ఇలా స్పష్టీకరించారు: "ఒక మతం వేరొక మతాన్ని ద్వేషిస్తుంది. కానీ హేతువాదం మతాలన్నింటినీ సమంగా నిరాకరిస్తుంది. అసహనాన్నీ, ద్వేషాన్నీ ప్రదర్శించదు. అసహనం, ద్వేషాల వల్ల మత విశ్వాసాలు మారవని హేతువాదులకు తెలుసు. మతమౌఢ్యం మారాలంటే మానసిక పరివర్తన రావాలనీ, అది చాలా నిదానమైన క్రమమనీ హేతువాదులకు తెలుసు. ఆంక్షల వల్ల, నిర్బంధాల వల్ల, నిరంకుశ నిషేధాల వల్ల మత తత్వం అణగిపోదనీ హేతువాదులకు తెలుసు. కనుకనే మనుషుల్లో ఉన్న వివేచనా జ్ఞానాన్ని పని చేయించడం ద్వారా మాత్రమే ఏ విధమైన మౌఢ్యాన్ని అయినా రూపుమాపవచ్చుననీ హేతువాదుల నిశ్చితాభిప్రాయం".

అంతేకాదు– "జాతి, మత, కుల, వర్గ ప్రాతిపదికల మీద మనం ఆధారపడితే – విజ్ఞానం, తత్వం, స్వేచ్ఛ, సమత, న్యాయం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికలుగా నిర్ణయించవలసిన మానవతావాద నీతి దుర్లభమవుతుంది. మానవులంతా ఒకటే అనుకున్నప్పుడు, మానవుల మధ్య విభిన్నమయిన నీతులు ఉండటానికి వీల్లేదు... అంతేగాదు, నేటి జాతులన్నీ రక్త సాంకర్యం పొందినవే. సిద్ధాంత సాంకర్యం పొందినవే. వర్గాలన్నీ ఆర్థిక స్థాయీ సాంకర్యం పొంది ఉన్నవే. అందువల్ల భిన్న జాతి, మత వర్గాల మధ్య స్పష్టమైన విభజన రేఖ గీయడం సాధ్యం కాదు. అందువల్ల జాతి, మత వర్గాల పేర్లతో మనుషుల్ని విభజించడం హేతువిరుద్ధం. అలాంటి హేతు విరుద్ధమైన విభజనను సృష్టించినవారు ఆయా కాలాల్లో పాలక వర్గాలుగా (శాసకులుగా) పెంపొందిన బాపతే. వారు చిరంతన సత్యాలుగా పేర్కొన్న సిద్ధాంతాలన్నీ మానవుణ్ణి పెంపుడు జంతువుగా, సిద్ధాంతదాసుడిగా, డూడూ బసవన్నగా తయారు చేయడానికే దారి తీశాయి. కానీ, మనిషి పెంపుడు జంతువు కావడానికి స్వభావతః ఇష్టపడడు కనుకనే ఎప్పటికప్పుడు వ్యవస్థీకృత సిద్ధాంతాల మీద తిరుగుబాటు చేస్తూ వచ్చాడు. అదే- భావ విప్లవమంటే" అన్నది రావిపూడి మాట!

అందుకే కారల్ మార్క్స్ మహనీయుడు 'మతం మత్తుమందు' అని ఏనాడో నిర్వచించి పాఠం చెప్పవలసి వచ్చింది. 'విజ్ఞానాభివృద్ధితో పాటు పరిణామం చెందే ఆలోచనా వైఖరిగానే హేతువాదం వన్నె తేలుతుందనీ, ఆలోచనలోనూ, ఆచరణలోనూ హేతువాదం ఒక ఉద్యమమ'నీ వేయి విధాల నిరూపిస్తూ వచ్చాడు రావిపూడి వెంకటాద్రి! కనుకనే ఓ కవి కుమారుడున్నట్టు–

"కలవరపడి వెనుదిరిగితె కాలం ఎగబడుతుంది
కదనుతొక్కి చెలరేగితే కాలం భయపడుతుంది
కర్మయోగి ఎన్నడూ కాలాధీనుడు కాదు –
కనురెప్పలు మూతపడితె కాలం జోకొడుతుంది
కంఠమెత్తి తిరగబడితే కాలం జేకొడుతుంది!"

ఆఖరి శ్వాసలో కూడా స్థూలంగా అదే రావిపూడి తీర్మానం కూడా!

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అదే కారణం



బీబీసీ డాక్యుమెంటరీకి ప్రభుత్వం ఎందుకు భయపడుతోందో అర్థం కాదు. కొంతమంది ముసలి వాళ్లతో కలిసి చూశా. అందరూ చూస్తున్నంతసేపూ ఆవలిస్తూనే ఉన్నారు. గుజరాత్‌లో ఏం జరిగిందో అందరికీ తెలుసు. అయినా సరే మోదీకి మద్దతు దొరుకుతోందని వాపోకండి. అసలు దానివల్లే దొరుకుతోంది.

– ఓంకార్ ఖాండేకర్, ఫీచర్ రైటర్

మంచి నిర్ణయం



అండమాన్ నికోబార్ దీవుల్లోని 21 దీవులకు పరమ్ వీర్ చక్ర అవార్డు అందుకున్నవారి పేర్లను పెట్టాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయం నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు తగిన నివాళి. ఇది మాతృభూమి సంరక్షణ కోసం అత్యున్నత త్యాగాలు చేసినవారిని గౌరవించే నిర్ణయం.

– తుహిన్ ఎ.సిన్హా, రచయిత

అసందర్భ ప్రశ్నలు



అదే జనాలు అవే పనులు చేస్తూ సెల్ఫ్ గోల్ చేసుకుంటున్నారు. ఒకవైపేమో గౌరవనీయ ప్రధాని పరమ్ వీర్ చక్రతో అలంకరించినవారి పేర్లను 21 దీవులకు పెడితే- మరోవైపేమో 'శౌర్య దినోత్సవ' వేళ సర్జికల్ స్ట్రయిక్స్‌ను ప్రశ్నిస్తున్నారు. అదే జనాలు, ప్రతిసారి ఆ పార్టీని (కాంగ్రెస్) నాశనం చేస్తున్నారు.

– తెహసీన్ పూనావాలా, వెంచర్ క్యాపిటలిస్ట్

ఇది కాదు స్వేచ్ఛ



స్వీడన్‌లోని ఒక యాక్టివిస్టు 'రెయిన్‌బో' పతాకాన్నో, ఇజ్రాయిల్ పతాకాన్నో కాల్చితే అనుమతిస్తారా? అలాంటప్పుడు ఖురాన్ దహనాన్ని ఎందుకు సమర్థించుకుంటున్నారు? ఇది భావ స్వేచ్ఛ కాదు.

– రాబర్ట్ కార్టర్, జర్నలిస్ట్

పుట్టుకతోనే నేను!



ప్రత్యేకంగా నన్ను మహిళగా గుర్తించడం కాదు. నేను మహిళనే. నా పుట్టుకను ఒక ఎంపికగా కుదించవద్దు.

– నయోమీ సీబిట్, యాక్టివిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

ఈ వివక్ష తగునా?

జాతీయ బాలికా దినోత్సవం ఏటా జనవరి 24న జరుపుకుంటున్నాం. దీని ప్రధాన ఉద్దేశాలు...బాలికలు ఎదుర్కొంటున్న అసమానతలు, అత్యాచారాలపై అవగాహన కల్పించడం,; విద్య, ఆరోగ్యం, పోషణ ప్రాముఖ్యాన్ని తెలియజేయడం. ఇందుకోసం ఐక్యరాజ్యసమితి బాలికా దినోత్సవం జరపాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. ఈ పిలుపునందుకుని భారత్ 2008 నుండీ మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖవారి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

భారత రాజ్యాంగం ఆడ, మగ – ఇద్దరికీ సమాన హక్కులు కల్పించింది. కానీ లింగవివక్షతో గర్భంలో ఉండగానే స్కానింగ్‌లతో లింగ నిర్ధారణ పరీక్షలు చేయించి ఆడపిల్ల అని తేలగానే ఇప్పటికీ గర్భస్రావం చేయిస్తున్నారు. మన సాంకేతిక పరిజ్ఞాన పురోభివృద్ధిని ఆడ శిశువుల అంతానికి ఉపయోగించడం దారుణం. 2011 జనాభా లెక్కల ప్రకారం వెయ్యి మంది మగ పిల్లలకు 946 మంది ఆడపిల్లలు ఉన్నారు. దీంతో దేశంలో ఇప్పుడు మగ పిల్లలకు వివాహాలు చేయడానికి ఆడపిల్లలు దొరకని దుఃస్థితి వచ్చింది. చట్టాలు ఎన్ని ఉన్నా బాలికల పట్ల జరిగే అన్యాయం జరుగుతూనే ఉంది. 2015 లో 'బేటీ బచావో, బేటీ పఢావో', 'షాదీ ముబారక్' వంటి పథకాలు బాల్య వివాహాలను కొంతవరకు తగ్గించాయి.

స్త్రీ విద్యావంతురాలు అయితే ఆ కుటుంబం అంతా విద్యావంతులు అవుతారని భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అన్నారు. ఆనాటి నుండి నేటి వరకూ బాలికల విద్య నిర్లక్ష్యానికి గురి అవుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం సుమారు 82 శాతం మగవారు, 65 శాతం బాలికలు అక్షరాస్యులుగా ఉన్నారు. మిగతా 35 శాతం బాలికలు బడికి దూరంగానే ఉన్నారు.

2009 విద్యాహక్కు చట్టం ఫలితంగా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో వెనుకబడిన తరగతుల బాలికలు చదువుకోవడానికి మంచి అవకాశం వచ్చింది. అయినప్పటికీ పల్లెటూర్లలో బాలికల అక్షరాస్యత తక్కువగానే ఉంది. ఏ లక్ష్యాలపై అవగాహన కల్పించడానికి బాలికా దినోత్సవాన్ని జరుపుతున్నామో... వాటిని సాకారం చేయడంలో సమాజంలోని అన్ని వర్గాలకూ బాధ్యత ఉంది.

– సయ్యద్ షఫీ, హనుమకొండ
(నేడు జాతీయ బాలికా దినోత్సవం)

భారత్ పట్ల వ్యతిరేకతే కొంప ముంచిందా?

అభిప్రాయం



డా॥ ఎ. కుమార స్వామి

దాయాది దేశం పాకిస్తాన్‌లో స్వాతంత్ర్యానంతరం రాజ్యం, పాలనా వ్యవస్థా, ప్రజాస్వామ్య స్ఫూర్తీ నిర్వీర్యం అవుతూ వచ్చాయి. భారత్ వ్యతిరేక విధానమే అక్కడి రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికీ, వచ్చిన ప్రభుత్వం స్థిరంగా నిలబడక పోవటానికీ ప్రాతిపదికగా ఉంది. అందుకే భారత్‌లో మత, ప్రాంతీయ విద్వేషాలను రగిలిస్తోంది. ఉగ్రవాదుల్ని తయారుచేసి సరిహద్దులు దాటిస్తోంది. భారత్‌పై మూడుసార్లు యుద్ధం చేసింది. అవకాశం దొరికిన ప్రతిసారీ భారత్‌ను ఛిన్నాభిన్నం చేయాలనేది దాని ప్రధాన ధ్యేయం. ఇందుకోసం పెంచి పోషించిన ఉగ్రవాదులే ఆ దేశానికి ఇప్పుడు ప్రమాదకరంగా తయార య్యారు. పాక్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న దురవస్థకు నేపథ్యం ఇదే.

పొరుగు దేశాన్ని అస్థిర పరచడంలో ఉన్న శ్రద్ధ సొంత ప్రజల బాగోగులపై లేకపోవడంతో చివరికి పాక్ మునుపెన్నడూ లేని తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఇరుక్కుంది. ప్రకృతి శక్తులు ఈ స్థితిని మరింత దిగజారుస్తున్నాయి. దీంతో ప్రస్తుతం అక్కడ బియ్యం, గోధుమలు, వంటగ్యాస్ వంటి కనీస అవసరాల కోసం ప్రజలు అర్రులు చాచాల్సి వస్తోంది. గత సంవత్సరంతో పోల్చి చూస్తే... గ్యాస్ సిలిండర్ ధర అప్పుడు రూ. 2,373 ఉండగా, ఇప్పుడు రూ. 2,680కి చేరింది. పెసర పప్పు కిలో రూ. 172 ఉండగా నేడు రూ. 260గా ఉంది. అలాగే కేజీ చికెన్ రూ. 203 ఉండగా, ఈ ఏడాది రూ. 366కు పెరిగింది. 20 కిలోల గోధుమ పిండి ధర రూ.1,112 ఉండగా, ఈ ఏడాదికి రూ.1,812కు చేరింది. పరిస్థితి తీవ్రతకు ఈ ధరవరలు అద్దం పడుతున్నాయి.

ప్రస్తుతం విదేశీ మారకం నిల్వలు 4.5 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరడంతో మూడు వారాలకు సరిపడా దిగుమతులకు మాత్రమే అవకాశం ఉంది. దీంతో ఆ దేశం ఆర్థిక సహాయం కోసం యూఏఈ, సౌదీ అరేబియా లాంటి దేశాల వైపు చూస్తోంది. పాకిస్తాన్‌లో 2010 నుంచి 2020 వరకు ఎకనామిక్ గ్రోత్ కేవలం 1.5 శాతం మాత్రంగానే ఉంది. ద్రవ్యోల్బణం రేటు 28.7 శాతంగా ఉంది. అప్పులు కూడా పుట్టడం లేదు. తమది చెప్పుకోవడానికి అణ్వస్త్ర దేశమైనా అప్పుల కోసం అడుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్వయంగా పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వాపోయారు. గత 70 ఏళ్ల కాలంలో ప్రభుత్వాలు ఆర్థిక పరమైన సవాళ్లను ఎదుర్కోలేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడింది.

పాకిస్తాన్ స్వయంగా పెంచి పోషించిన 'తెహ్రీక్ ఇ తాలిబాన్' పాకిస్తాన్‌కు కొత్త తలనొప్పిగా మారింది. తాలిబన్లు పాకిస్తాన్‌కు అత్యంత కీలక ప్రాంతాలైన ఖైబర్‌ఫక్తున్‌ఖ్వా, బెలూచిస్తాన్, పంజాబ్ లాంటి ప్రదేశాల్లో... సైన్యం, పోలీసులు టార్గెట్‌గా పనిచేస్తూ అనేక ఉగ్రవాద సంస్థలను తమలో



కలుపుకొని పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. ఇక్కడ చెప్పవలసిన మరో అంశం ఏంటంటే పాకిస్తాన్‌లోని 'బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ'ని తాలిబన్లు తమ సంస్థలో విలీనం చేసుకున్నట్లు కూడా పాకిస్తాన్ నిఘా వర్గాలు పేర్కొన్నాయి. పాకిస్తాన్ యువకులనూ తాలిబన్లు సైన్యంలో చేర్చుకుంటూ, ఆయుధ శిక్షణ కూడా అందిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఒకవేళ తాలిబన్ల మీద పాకిస్తాన్ యుద్ధం చేయాల్సి వస్తే ఎదుర్కోలేని దుస్థితి ప్రస్తుతం నెలకొంది. అఫ్గానిస్తాన్‌ను వదిలి వెళ్లేటప్పుడు నాటో దళాలు సుమారు 22,000 వాహనాలు, 64,000 మిషన్‌గన్స్‌ను అక్కడే వదిలి వెళ్లాయి. ఎమ్ 16, ఏకే 47 రకానికి చెందిన ఆయుధాలు సుమారుగా మూడు లక్షలకు పైగా అక్కడ ఉన్నట్లుగా సమాచారం. కాబట్టి ఇంత ఆధునికమైన ఆయుధాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ కలిగిన తాలిబన్ల మీద పాకిస్తాన్ సైన్యం ఏ విధంగా విజయం సాధించగలదు? తినడానికి తిండి లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తాలిబన్లను ఎదిరించగలరా? అనే ప్రశ్న తలెత్తుతోంది.

గణాంకాల ప్రకారం పాక్‌లో కేవలం 68 శాతం మంది పిల్లలు మాత్రమే ప్రాథమిక విద్యను పూర్తిచేసినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. వీటితో పాటుగా ప్రపంచంలోనే అతి తక్కువగా అక్షరాస్యత కలిగిన దేశాల్లో ఒకటిగా తయారయింది. అక్కడ 34.8 శాతం యువత తీవ్రవాదం వైపు ఆకర్షితులు అవుతున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో పొరుగున ఉన్న భారత్‌తో సత్సంబంధాలు ఏర్పరచుకోవటమే పాకిస్తాన్‌కు మంచిదని రక్షణ నిపుణులు పాక్‌కు సలహా ఇస్తున్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం ఎంతో అభివృద్ధి చెందిందనీ, అక్కడి మీడియా కూడా ప్రశంసిస్తోంది. మోదీ నాయకత్వంలో భారత్ అంతర్జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేసుకుంటోందని పాకిస్తాన్ దినపత్రిక 'ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' కీర్తించింది. అమెరికా, రష్యాలు కూడా భారత్‌తో బలమైన సంబంధాలు కోరుకుంటున్నాయని పేర్కొంది.

స్వాతంత్ర్య కాలం నుంచి కశ్మీర్ పాకిస్తాన్‌దే అంటూ నానాయాగీ చేసిన పాకిస్తాన్... కశ్మీర్ అంశంపైన సామరస్య పూర్వకంగా ఒక నిర్ణయానికి రావాలనీ, తద్వారా రెండు దేశాలూ అభివృద్ధి సాధిస్తాయనీ పాక్ కొత్త హితవచనం అందుకుంది. భారత్‌తో మూడు యుద్ధాల్లో తలపడటం వల్ల కష్టాలూ, పేదరికం, నిరుద్యోగం మిగిలాయి. మూడు యుద్ధాలతో ఇప్పుడు తాము పాఠాలు నేర్చుకున్నాం అంటున్నారు పాక్ నాయకులు. ఇప్పుడు శాంతియుతంగా జీవించాలని అనుకుంటున్నామనీ, కశ్మీర్ వంటి సమస్యలపై భారత ప్రధాని మోదీతో నిజాయతీగా చర్చలు జరపాలనీ పాక్ ప్రధాని పిలుపునిచ్చారు. నిజంగా ఈ పిలుపు సాకారమైతే కేవలం పాక్ మాత్రమే కాదు... ఇండియా కూడా లాభపడుతుంది.

వ్యాసకర్త పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఫ్యాకల్టీ
నిజాం కాలేజ్ । 90006 18068

దుఃఖ హేతువు ఈర్ష్య

ఈర్ష్య చాలా చిత్రమైన దుర్గుణం. ఇతరులతో చెప్పుకోవటానికి వీలు లేనిది. అలాగని ఓర్చుకోవటానికి సాధ్యం కానిది. దాని వల్ల పెద్ద ప్రయోజనం లేదు. ఇతరులను చూసి ఈర్ష్య చెందితే కలిగే లాభమేముంది? ఒక విధంగా ఈర్ష్య కర్రకు అంటుకున్న నిప్పు లాంటిది. ఎదుటివాళ్ళను కాల్చటం ఎలా ఉన్నా, మొదట కర్రను మాత్రం కాల్చక మానదు.

మయసభ వైభవం చూసిన దుర్యోధనుని మానసిక స్థితి అలాంటిదే. రాజసూయ యాగ వైభవం, అప్పుడు జరిగిన అన్నదానం, ఆ అన్నదాన కార్యక్రమానికి నిర్వాహకురాలిగా ద్రౌపది ముఖంలో కనిపించిన ప్రకాశం చూసి దుర్యోధనుని కన్ను కుట్టింది. కానీ ఈర్ష్య మనోవేదనను పెంచుతుంది. మానసికంగా దుర్బలులను చేస్తుంది. ప్రశంస అందుకొన్న వ్యక్తికి అది ఆనంద హేతువవుతుంది. కానీ అదే ఈర్ష్యకు గురైన వ్యక్తికి దుఃఖమే మిగులుతుంది.

పరుల సుఖానికి పొరలి ఏడ్చే మనిషికి సుఖం ఉండదని ఒక మహాకవి చెప్పారు. ప్రాచీన కవులు, సద్గురువులు, ప్రవచనకారుల దగ్గర నుంచి నేటి ఆధునిక కవుల వరకూ అందరూ సాటివారి ఎదుగుదలను చూసి ఊరికే ఈర్ష్య పడటం ఎంత హానికరమో, చేటో చాటి చెప్పారు. దానిని నియంత్రించు కోవలసిన అవసరాన్ని స్పష్టం చేశారు.

అరిషడ్వర్గాలలో ఈర్ష్యను జయించటం చాలా సులభం. ఇతరుల బాగును సహించలేక పోవటమే ఈర్ష్య. కానీ, ఇది ఎవరూ ఆలోచించరు. ఇతరులకు మేలు జరిగితే తమకు జరిగినట్లే అని భావించగలిగితే ఈర్ష్యను జయించినట్లే! ఈర్ష్యాళువు మనసు మలినమై ముఖం కళా విహీనమైపోతుంది. ఇతరుల గురించే ఆలోచిస్తూ ప్రశాంతంగా ఉండలేడు. జీవితాన్ని అభివృద్ధి పథంలో సాగించలేడు. ఎవరు చేసిన పనులకు ఫలితం వారికి దక్కుతుంది అనే సూత్రాన్ని గ్రహిస్తే ఈర్ష్యను అదుపులో ఉంచవచ్చు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

జ్యోతిర్మయం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం,, తిథి: శు.తదియ రా.8.29 వరకు, తదుపరి చవితి, నక్షత్రం: శతభిషం రా.3.21 వరకు, తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: ఉ.11.31 నుండి 1.03 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.50 నుండి 9.34 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.45 వరకు, అమృతఘడియలు: రా.8.34 నుండి 10.03 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.47.



పసుపుమయం పట్నం వారం

పసుపుతో నిండిన శివసత్తులు, భక్తులు

కొమురవెల్లి (సిద్దిపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలోని తోటబావి ప్రాంగ ణంలో పట్నం వారాన్ని పురస్కరించుకొని సోమ వారం అగ్నిగుండాలు, పెద్దపట్నం వైభవంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన యాదవ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యా రు. ఒగ్గు పూజారులు పంచవర్ణాల పిండితో పెద్దపట్నం వేశారు. అనంతరం పంచ పల్లవాలతో (మామిడి, జువ్వి, రాగి, మేడి, మర్రి) కట్టెలతో నిప్పు కణిక లు తయారు చేసి అగ్ని గుండాలను సిద్ధం చేశారు. తర్వాత ఉత్సవ విగ్రహాలతో ఆలయ పూజారులు పెద్దపట్నం, అగ్ని గుండాలు దాటారు.

మళ్లీ రాజ్‌భవన్‌లోనే గణతంత్ర వేడుక

- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం.. రాజ్‌భవన్‌కు చేరిన సమాచారం
- వరుసగా రెండో ఏడాదీ రాజ్‌భవన్‌కే గణతంత్ర దిన వేడుకలు పరిమితం

సాక్షి, హైదరాబాద్: దేశ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న రాష్ట్ర స్థాయిలో అధికారికంగా నిర్వహించాల్సి ఉన్న వేడుకలను ఈ ఏడాది సైతం రాజ్‌భవన్‌కు పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆదివారం రాత్రి రాజ్‌భవన్‌కు సమాచారాన్ని అందించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి, గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడం ఆనవాయితీగా వస్తోంది. గణతంత్ర దినోత్సవాన్ని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుండగా, తెలంగాణ వచ్చిన తర్వాత కొన్నాళ్లకు వేదికను నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌కు మార్చారు.

- తొలిసారిగా రాష్ట్ర స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలను గతేడాది రాజ్‌భవన్‌లో నిర్వహించారు. కోవిడ్–19 మహమ్మారి మూడో వేవ్ ప్రభావం ఉండడంతో వేడుకలను తక్కువ మంది అతిథుల సమక్షంలో రాజ్‌భవన్‌లో నిర్వహించాలని అప్పట్లో రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ప్రసంగం లేకుండానే సాదాసీదాగా ఉత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రసంగ పాఠాన్ని పంపకపోయినా, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాత్రం ఓ అడుగు ముందుకేసి రాజ్‌భవన్ వేదికగా ప్రసంగించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల దుస్థితిపై విమర్శలు చేశారు. కోవిడ్–19 వ్యాప్తి ఉన్న సమయంలో రాజకీయ సభలు, సమావేశాలు నిర్వహించారని, గణతంత్ర వేడుకలను మాత్రం కోవిడ్–19 పేరుతో రాజ్‌భవన్‌లో సాదాసీదా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారని, తనను అవమానించడానికే అలా చేశారని అప్పట్లో విమర్శించారు.
- రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ తమిళిసై మధ్య నెలకొన్న తీవ్ర విభేదాల నేపథ్యంలో వరుసగా రెండో ఏడాది కూడా గణతంత్ర దిన వేడుకలు రాజ్‌భవన్‌లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారింది. ప్రస్తుతానికి కోవిడ్–19 ప్రభావం లేకున్నా వేడుకలను రాజ్‌భవన్‌కు పరిమితం చేయడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల గవర్నర్ తమిళిసై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు తెలిసింది.

ఇంకా అందని ప్రసంగ పాఠం..: గణతంత్ర దిన వేడుకలకు మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండగా, ఇప్పటి వరకు గవర్నర్ ప్రసంగ పాఠాన్ని రాష్ట్ర ప్రభుత్వం పంపించలేదు. ప్రసంగం లేకుండానే ఈ ఏడాది సైతం వేడుకలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరనున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో గతేడాది తరహాలోనే ఈ సారి సైతం గవర్నర్ తమిళిసై తన సొంత ప్రసంగాన్ని చదివి వినిపించే అవకాశాలున్నాయి. సంప్రదాయం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పంపించే ప్రసంగాన్ని మాత్రమే గవర్నర్లు చదవాల్సి ఉంటుంది. గతేడాది ఉత్సవాల్లో గవర్నర్ సొంత ప్రసంగం చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా అభ్యంతరం తెలిపింది. ఈ సారి సైతం గవర్నర్ తన ప్రసంగంలో ప్రభుత్వంపై విమర్శలు చేసే అవకాశాలున్నాయి.

పలు బిల్లుల ఆమోదం నిలిపివేత

రాష్ట్ర యూనివర్సిటీల కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లుతో సహా రాష్ట్ర శాసనసభ ఆమోదించిన పలు బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గ త కొన్ని నెలలుగా రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉంచడం రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. గత స్వా తంత్ర్య దినోత్సవం సందర్భంగా పలువురు జీవిత ఖైదీ లకు క్షమాభిక్ష ప్రసాదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సైతం గవర్నర్ తిరస్కరించారు. గవర్నర్ ఆమోదం లభించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినె న్స్‌ల(అత్యవసర ఉత్తర్వులు) జారీని పూర్తిగా మానేసింది.

షికాగోలో తెలుగు విద్యార్థులపై కాల్పులు

- దోపిడీకి పాల్పడి తుపాకులతో కాల్చిన నల్ల జాతీయులు
- ప్రాణాపాయం లేదని వైద్యుల వెల్లడి



సాయిచరణ్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): అమెరికాలోని షికాగోలో నల్ల జాతీయులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు తెలుగు విద్యార్థులకు గాయాలయ్యాయి. డబ్బుల కోసం దోపిడీకి పాల్పడిన దుండగులు తుపాకులతో కాల్చడంతో ఛాతీ భాగంలో బుల్లెట్లు దూసుకెళ్లాయి. పోలీసులు వారిని వెంటనే ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఏం జరిగింది?

సంగారెడ్డి జిల్లా భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీ చెందిన సాయిచరణ్, హైదరాబాద్‌కు చెందిన దేవాశిష్, ఏపీలోని విశాఖపట్నానికి చెందిన లక్ష్మణ్ ఇటీవలే అమెరికాలోని షికాగోకు వెళ్లారు. అక్కడ ఒక అపార్ట్‌మెంట్‌లో మరొకరితో కలసి ఉంటున్నారు. షికాగోలోని గవర్నర్ స్టేట్ యూనివర్సిటీలో చదువుకుంటున్నారు. భారత కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం సమయంలో సాయిచరణ్, దేవాశిష్, లక్ష్మణ్ ముగ్గురూ ఇంటర్‌నెట్ రీచార్జ్ చేసుకునేందుకు అపార్ట్‌మెంట్ నుంచి బయటికి వెళ్లారు. రోడ్డుపై వెళ్తుండగా కారులో వచ్చిన కొందరు నల్ల జాతీయులు వీరిని ఆపారు. తుపాకులు గురిపెట్టి డబ్బుల కోసం బెదిరించారు. దీంతో ముగ్గురూ తమ వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్లు, పర్సులు ఆ నల్ల జాతీయులకు ఇచ్చారు. వాటిని తీసుకున్న నల్ల జాతీయులు వెళ్లిపోతూ.. ఈ ముగ్గురిపై కాల్పులు జరిపారు. ఘటనలో సాయిచరణ్, దేవాశిష్‌లకు ఛాతీలోకి బుల్లెట్లు దూసుకుపోయాయి. లక్ష్మణ్‌కు గాయాలు కాలేదు. క్షతగాత్రులను స్థానికులు, పోలీసులు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సాయిచరణ్ ఆస్పత్రిలో కోలుకుంటున్నట్టు తమ కుమారుడి స్నేహితుల ద్వారా సమాచారం అందిందని అతడి తల్లిదండ్రులు శ్రీనివాసరావు, లక్ష్మి తెలిపారు.

ఇద్దరికీ శస్త్రచికిత్సలు

నల్ల జాతీయుల కాల్పుల్లో గాయపడిన తెలుగు విద్యార్థులకు అవసరమైన సాయం అందించేందుకు అక్కడి భారతీయులు ప్రయత్నిస్తున్నారు. బాధితుల స్నేహితులు, వైద్యులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఇద్దరికీ ప్రాణాపాయం తప్పినట్టేనని వారు తెలిపారు. సాయిచరణ్ షికాగో యూనివర్సిటీ ఆఫ్ మెడిసిన్‌లో చికిత్స పొందుతున్నాడని.. ఆయనకు ఎడమవైపు ఊపిరితిత్తిలో బుల్లెట్ దిగడంతో మేజర్ సర్జరీ చేసి తొలగించారని వెల్లడించారు. ఇక దేవాశిష్ ఛాతీలో రెండు సర్జరీలు జరిగాయని, అతను అడ్వొకేట్ క్రైస్ట్ మెడికల్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నాడని వివరించారు. మూడో యువకుడు లక్ష్మణ్‌కు ఎలాంటి గాయాలూ కాలేదని, పోలీసులు అతడి నుంచి ఘటన వివరాలు తెలుసుకుని స్నేహితుల అపార్ట్‌మెంట్లో వదిలిపెట్టారని తెలిపారు.

పులి దాడిలో ఆవులు మృతి

కాగజ్‌నగర్ రూరల్: కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం కోసిని బేస్‌క్యాంప్ వద్ద పులి దాడి చేసి రెండు ఆవులను చంపేసింది. ఆదివారం పశువులను మేపేందుకు అటవీ ప్రాంతానికి కాపరి ఆవులను తీసుకెళ్లగా రెండు ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం వాటి యజమానులు, గ్రామస్తులు గాలించారు. పులి దాడిలో ఈ రెండు పశువులు మృతిచెందినట్లు ఆనవాళ్లను కనుగొన్నారు.

జల రవాణా | ప్రాజెక్టు పట్టాలెక్కేనా?

గోదావరి–బకింగ్‌హామ్ కెనాల్
అనుసంధానం హుళక్కేనా?

- మహారాష్ట్ర నుంచి తెలంగాణ, ఆంధ్ర మీదుగా చెన్నైకి సరుకులు తరలించే యోచన
- సరుకు రవాణా వ్యయం గణనీయంగా తగ్గిపోయే అవకాశం
- డీపీఆర్‌పై కసరత్తుతోనే ఆగిపోయిన కేంద్రం ప్రతిపాదన..
- ప్రత్యేక డిజైన్‌ను పట్టించుకోకుండా పలుచోట్ల వంతెనల నిర్మాణం



బకింగ్ హామ్ కాలువ

సాక్షి, హైదరాబాద్: గోదావరి నదితో బకింగ్ హామ్ కాలువను పునరుద్ధరించటం ద్వారా అనుసంధానించి జల రవాణా చేపట్టాలన్న ప్రణాళిక పట్టాలెక్కేలా లేదు. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు.. నాలుగు రాష్ట్రాలతో ముడిపడిన ఈ అద్భుత ప్రాజెక్టు ద్వారా సరుకు రవాణా ఖర్చును నాలుగో వంతుకు తగ్గించే గొప్ప అవకాశం చేజారిపోయే పరిస్థితులు కన్పిస్తున్నాయి. నదుల అనుసంధానం ద్వారా జల రవాణాకు ఊతమివ్వనున్నట్టు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, ఆ తర్వాతి క్రమంలో దీనిపై మౌనం దాల్చడమే ఇందుకు కారణం. డీపీఆర్ తయారీ కసరత్తు వరకు హడావుడిగా జరిగినా, ఆ తర్వాత ప్రాజెక్టు విషయంలో అడుగు ముందుకు పడలేదు. జలరవాణాకు, ముఖ్యంగా గోదావరి నదిలో కారిడార్ ఏర్పాటుకు విఘాతం లేని విధంగా, నదిపై నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా.. ఇప్పుడు దానితో ప్రమేయం లేకుండా పనులు జరుగుతున్నాయి. వీటివల్ల భవిష్యత్తులో ప్రాజెక్టు చేపడితే ఇబ్బందులెదురయ్యే అవకాశం ఉంది. అయినప్పటికీ కేంద్రం జోక్యం చేసుకోకపోవడంతో ఊరించిన జలరవాణా ప్రాజెక్టు అటకెక్కినట్టేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏంటీ ప్రాజెక్టు..

గోదావరి నదిలో సరుకు రవాణాకు వీలుగా ప్రత్యేక కారిడార్ ఏర్పాటును 2015లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రతిపాదించారు. తన సొంత రాష్ట్రం మహారాష్ట్ర నుంచి తెలంగాణ, ఆంధ్ర మీదుగా చెన్నై వరకు సరుకులు తరలించేలా ఓ బృహత్తర ప్రణాళికను రూపొందించారు. మహారాష్ట్ర నుంచి ఆంధ్రప్రదేశ్ వరకు గోదావరి ప్రవహిస్తోంది. దీనిని అతిపురాతన బకింగ్‌హామ్ కెనాల్ ద్వారా అతిపెద్ద ఓడ రేవు ఉన్న చెన్నైతో అనుసంధానిస్తే సరుకు రవాణాలో సరికొత్త విప్లవం వస్తుందని గడ్కరీ యోచించారు. నిపుణులతో సర్వే చేయించారు. బ్రిటిష్ పాలనలో కాకినాడ నుంచి తమిళనాడులోని విల్లుపురం వరకు 796 కి.మీ. మేర బకింగ్‌హామ్ కెనాల్‌ను నిర్మించారు. అప్పట్లో ఈ కాలువను సరుకు రవాణాకు ముమ్మరంగా వాడారు. స్వాతంత్ర్యానంతరం దీని ప్రాభవం క్రమంగా తగ్గిపోయింది. తాజాగా దీన్ని పునరుద్ధరించటం ద్వారా పులికాట్ సరస్సుకు అనుసంధానించి పుదుచ్చేరి వరకు విస్తరించాలన్న ప్రణాళిక రూపుదిద్దుకుంది. గోదావరిని ఆంధ్రప్రదేశ్‌లోని ధవళేశ్వరం (గోదావరి చివరి బ్యారేజీ) నుంచి కృష్ణా కెనాల్ ద్వారా కృష్ణా నదికి, అక్కడి నుంచి కొమ్మమూరు కెనాల్ (గుంటూరు జిల్లా దుగ్గిరాల) ద్వారా (ప్రకాశం జిల్లా పెదగంజాం వద్ద) బకింగ్‌హామ్ కెనాల్‌కు అనుసంధానించాలన్నది ప్రతిపాదన. ఈ మేరకు ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రణాళిక సిద్ధం చేసింది. ఎక్కడ ఎలా అనుసంధానించాలో వివరిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల అధికారులతో సమావేశాలు కూడా నిర్వహించింది. కానీ ఇప్పుడు ఆ అంశం మరుగున పడిపోవడం సందేహాలకు తావిస్తోంది.

జల రవాణాతో ఎంతో ఆదా..

ప్రస్తుతం సరుకు రవాణా సింహభాగం రోడ్డు మార్గాన జరుగుతోంది. రైల్వే లైన్ అందుబాటులో ఉన్న చోట ఎక్కువగా రైళ్ల ద్వారా సాగుతోంది. రోడ్డు మార్గాన సరుకు రవాణాకు నాలుగు రూపాయలు ఖర్చయితే, రైలు మార్గాన తరలించేందుకు మూడు రూపాయలు వ్యయం అవుతుంది. అదే జల రవాణా ద్వారా అయితే అర్ధ రూపాయితో సరిపోతుందన్నది నిపుణుల మాట.

సందేహాలకు తావిస్తున్న వంతెనల నిర్మాణం

పడవలు నడవాలంటే నదిలో ఎప్పుడూ నీటి నిల్వ ఉండాలి. కానీ గోదావరిలో భద్రాచలం సహా చాలా ప్రాంతాల్లో వేసవిలో నీళ్లు ఇంకిపోతుంటాయి. అందువల్ల జల రవాణాకు వీలుగా ప్రత్యేకంగా కారిడార్‌ను నిర్ధారించి ఛానెల్ ఏర్పాటు ద్వారా అన్ని సమయాల్లో నిర్ధారిత పరిమాణంలో నీటి నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. మరోవైపు నది దాటేందుకు నిర్మించే వంతెనలు పడవల రాకపోకలకు ఆటంకం కలిగించకుండా ప్రత్యేక డిజైన్‌ను ప్రతిపాదించారు. కానీ ఇప్పుడు ఆ డిజైన్‌తో సంబంధం లేకుండా పలుచోట్ల వంతెనల పనులు జరుగుతుండటం ఈ ప్రాజెక్టుపై అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

ఇటీవల ఆ ఊసెత్తని గడ్కరీ..

గతంలో జాతీయ రహదారుల విస్తరణ పనుల ప్రారంభం కోసం తెలంగాణకు వచ్చిన సందర్భంలో గడ్కరీ గోదావరి ఇన్‌లాండ్ వాటర్ వే గురించి మాట్లాడారు. నాటి తెలంగాణ రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో దీనిపై చర్చించారు. కానీ ఇటీవల రాష్ట్రానికి వచ్చినప్పుడు మాత్రం దీని ప్రస్తావన తేకపోవడం గమనార్హం. 'గతంలో ప్రాజెక్టు డీపీఆర్ రూపొందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు ప్రచారం జరిగింది. కానీ గత నాలుగైదేళ్లుగా దీనిపై ఎలాంటి ఆదేశాలు, సూచనలు లేవు. మేం మా పని చేసుకుపోతున్నాం. వంతెనలకు ప్రత్యేక డిజైన్ విషయంలో కూడా ఎలాంటి సూచనలు అందలేదు..' అని జాతీయ రహదారుల విభాగం ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

కామినేని పుష్ప కన్నుమూత



దోమకొండ: కామారెడ్డి జిల్లాలోని దోమకొండ గడికోట వారసురాలైన దివంగత రిటైర్డు ఐఏఎస్ అధికారి కామినేని ఉమాపతిరావు సతీమణి పుష్ప (71) సోమవారం హైదరాబాద్‌లోని స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతదేహానికి జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలను నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె కుమారుడు, జాతీయ ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ కుమార్తె ఉపాసనను ప్రముఖ సినీ నటుడు చిరంజీవి కుమారుడు రాంచరణ్‌తో దోమ కొండలో వివాహం జరిపించిన విషయం తెలిసిందే. పుష్ప ప్రతి మహా శివరాత్రి నాడు గడికోటలోని మహాదేవుని ఆలయానికి వచ్చి పూజల్లో పాల్గొనేవారు. ఆమె గడికోటకు వచ్చిన ప్రతిసారీ అందరితో కలుపుగోలుగా ఉండేవారని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు.

అమరావతిలో భూములు అమ్మారు..

ఆ డబ్బును ఆదిలాబాద్‌లో పత్తి వ్యాపారికి వడ్డీకిచ్చారు

- రూ.6 కోట్లు అప్పు తీసుకొని ఇవ్వడం లేదంటూ రైతుల ఆందోళన
- వ్యాపారి ఇంటి ఎదుట బైఠాయింపు



పత్తి వ్యాపారి ఇంటి ఎదుట బైఠాయించిన రైతులు

ఆదిలాబాద్ టౌన్: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా అమరావతి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన రైతులు ఆదిలాబాద్‌లోని రాణిసతీజి కాలనీలో ఉన్న పత్తి వ్యాపారి సచిన్ ఇంటి ఎదుట సోమవారం ఉదయం నుంచి బైఠాయించారు. మధ్యాహ్న భోజనం అక్కడే చేసి గేటు ఎదుట పడుకున్నారు. బాధితుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన 32మంది రైతులు అమరావతి రాజధానిగా ఏర్పడిన సమయంలో తమ భూములను విక్రయించారు. వచ్చిన డబ్బులను బ్యాంకులో జమ చేశారు. బ్యాంకులో తక్కువ వడ్డీ వస్తుండటంతో స్థానిక వ్యాపారి లిల్లి మధ్యవర్తిత్వంతో ఆదిలాబాద్‌కు చెందిన సచిన్‌కు రెండున్నర రూపాయల వడ్డీతో రూ.6కోట్లు అప్పు ఇచ్చారు. ఈ మేరకు రూ.2కోట్ల నగదు చేతికివ్వగా రూ.4కోట్లు బ్యాంక్ అకౌంట్‌కు బదిలీ చేశారు. రెండు నెలల్లోనే అప్పు తీర్చేస్తానని సచిన్ హామీ ఇచ్చి దాదాపు ఏడాదిన్నరవుతున్నా స్పందించడం లేదు. 2021 ఆగస్టులో డబ్బులు ఇచ్చామని, పలుమార్లు కలువగా రేపు మాపు అంటూ తిప్పించుకుంటున్నాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు ఇవ్వకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని కన్నీరుమున్నీరయ్యారు.

అందుబాటులో లేని వ్యాపారి..

కాగా సదరు వ్యాపారి అందుబాటులో లేరని కుటుంబీకులు తెలిపారు. ఓ న్యాయవాదితో మధ్యవర్తిత్వం చేయించినట్లు రైతులు చెబుతున్నారు. 45 రోజుల్లో డబ్బులు తిరిగి ఇచ్చేలా చూస్తానని న్యాయవాది వారికి చెప్పగా.. చెక్కులు, నోట్‌లు ఇస్తే ఇక్కడి నుంచి వెళ్తామని తెలిపారు. అందుకు న్యాయవాది ఒప్పుకోలేదని అంటున్నారు. రైతులకు సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్, రైతు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. వ్యాపారి డబ్బులు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో రైతులతోపాటు ఇక్కడే బైఠాయించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

27 నుంచి షురూ.. మార్చి 4న ముగింపు

▶ మొదటి పేజీ తరువాయి

ఖాళీల ప్రకటన.

- 16, 17, 18 తేదీల్లో అర్హత ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పదోన్నతుల కౌన్సెలింగ్ జరుగుతుంది.
- 19, 20 తేదీల్లో సబ్జెక్ట్ వారీగా స్కూల్ అసిస్టెంట్స్ ఖాళీల ప్రకటన, బదిలీ ఆప్షన్స్ నమోదు.
- 21న ఆప్షన్ల సవరణ, పునఃపరిశీలనకు అవకాశం.
- 22, 23 తేదీల్లో డీఈఓలచే స్కూల్ అసిస్టెంట్స్ బదిలీ ఉత్తర్వులు విడుదల.
- 24న స్కూల్ అసిస్టెంట్ల బదిలీల అనంతరం ఏర్పడిన ఖాళీల ప్రకటన.
- 25, 26, 27 తేదీల్లో ఎస్జీటీ తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులకు (కోర్టు కేసులు లేని సబ్జెక్టులకు) మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు.
- ఫిబ్రవరి 28, మార్చి 1, 2 తేదీల్లో ఎస్జీటీ తత్సమాన పోస్టుల ఖాళీల ప్రకటన, వెబ్ ఆప్షన్ల నమోదు.
- 3న ఆప్షన్ల సవరణ, పునఃపరిశీలన.
- 4న ఎస్జీటీ తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు విడుదల.
- 5 నుండి 19 వరకు డీఈఓలు ఇచ్చిన బదిలీ ఉత్తర్వులపై అప్పీళ్లు, అభ్యంతరాలను ఆర్జేడీకి, ఆర్జేడీ ఉత్తర్వులపై అప్పీళ్లు/అభ్యంతరాలను పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌కు పంపవచ్చు.

డైరెక్టర్ ఆగ్రహం: టీచర్ల బదిలీల షెడ్యూల్ బయటకు రావడంపై పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన డీఈవోల సమావేశంలో విద్యాశాఖ బదిలీల షెడ్యూల్‌పై చర్చించారు. సమావేశం జరుగుతుండగానే షెడ్యూల్ లీకయ్యింది. ఈ నేపథ్యంలో డీఈవోల ఫోన్లు స్వాధీనం చేసుకుని పరిశీలించినట్లు తెలిసింది.

నెల క్రితమే నిందితుడి రెక్కీ

- ప్లజెంట్ వ్యాలీలో కరువైన నిఘా

బంజారాహిల్స్: తెలంగాణ సీఎం కార్యాలయ అధికారిణి, సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ ఇంట్లోకి గురువారం అర్ధరాత్రి మేడ్చల్ జిల్లా పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ చెరుకు ఆనంద్ కుమార్‌రెడ్డి చొరబడిన వ్యవహారంలో తవ్విన కొద్దీ అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. నిందితుడు నెల క్రితమే యూసుఫ్‌గూడ పోలీస్ లైన్స్‌లో ఉన్న ప్లజెంట్ వ్యాలీలో స్మితా సబర్వాల్ ఇంటికి వచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. అయితే ఆ రోజు ఇంట్లో ఆమె లేకపోవడంతో తిరిగి వెళ్లినట్లుగా గుర్తించారు. ఈ ఘటనలో మరో నిందితుడు బాబును జూబ్లీహిల్స్ వైపు వెళ్దామంటూ తీసుకొచ్చిన నిందితుడు స్మితా సబర్వాల్ ఇంటిదాకా తీసుకొచ్చి ఆయనను కూడా ఈ కేసులో అడ్డంగా ఇరికించినట్లయింది. ఇదిలా ఉండగా బాబు బయట కారులో కూర్చోగా నిందితుడు ఆనంద్ కుమార్ రెడ్డి నేరుగా ఆమె ఇంట్లోకి వెళ్ళాడు. కారులో కూర్చున్న బాబు బయటికి దిగి తన సెల్‌ఫోన్‌లో అక్కడి క్వార్టర్లు అన్నింటిని దర్జాగా వీడియో తీస్తున్నా ఏ ఒక్కరూ గుర్తించలేకపోయారు.

సీసీ కెమెరాలు ఉండవా..?: స్మితా సబర్వాల్ ఉంటున్న ప్లజెంట్ వ్యాలీలో మొత్తం 23 క్వార్టర్స్ ఉన్నాయి. ఆమెది బి–11వ నెంబర్‌క్వార్టర్. తెలంగాణకు చెందిన ప్రముఖ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ క్వార్టర్లలో ఉంటున్నారు. అయితే ప్రధాన గేటు వద్ద జూబ్లీహిల్స్ పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఒకటి మాత్రమే రోడ్డు వైపు పని చేస్తోంది. లోనికి వెళ్ళిన తర్వాత ఒక్క కెమెరా కూడా లేకపోవడాన్ని పోలీసులు గుర్తించారు. ఈ ఘటన అనంతరం నిందితుడికి సంబంధించిన రాకపోకలకు దృష్టిపెట్టిన పోలీసులు నిఘా నేత్రాల కోసం ఆరా తీయగా ఒక్క చోట కూడా వాటి జాడ లేకుండా పోయింది. కమ్యూనిటీ పోలీసింగ్, నేనుసైతం అంటూ బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార సంస్థల్లో సీసీ కెమెరాలు పెట్టుకోవాలంటూ ఆదేశాలు జారీ చేసే అధికార యంత్రాంగానికి తాము ఉంటున్న ప్రాంతంలో మాత్రం ఒక్క సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలన్న ఆలోచన లేకుండా పోయింది. ఈ క్వార్టర్లలోకి ఎవరు వస్తున్నారు, ఎవరు పోతున్నారన్నది కూడా నిఘా గాలికి వదిలేసినట్లుగా గత మూడు రోజుల నుంచి పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసింది. ఎవరిని కదిపితే ఏం సమస్యలొస్తాయోనని ఇక్కడి నిఘా విషయంలో పోలీసులు నోరు మెదపడం లేదు. ఇప్పటికైనా ఈ క్వార్టర్స్ వద్ద నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకుంటారో లేదో చూడాల్సి ఉంది. ఇదిలా ఉండగా నిందితుల కస్టడీ కోసం పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

డిప్యూటీ తహసీల్దార్ సస్పెన్షన్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించిన డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌రెడ్డిపై వేటు పడింది. జిల్లా పౌర సరఫరాల శాఖలో పనిచేస్తున్న ఆనంద్‌కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తనుజా చంచల్‌గూడ జైలులో నిందితుడు ఆనంద్‌కుమార్‌రెడ్డికి సోమవారం సిబ్బంది ద్వారా సస్పెన్షన్ ఉత్తర్వులను అందజేశారు.

క్లుప్తంగా

దక్షిణాదికి మరో మూడు వందే భారత్ రైళ్లు

న్యూఢిల్లీ: దక్షిణాది రాష్ట్రాల్లో త్వరలోనే మరో మూడు వందే భారత్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయని రైల్వే శాఖ సోమవారం తెలిపింది. ప్రస్తుతానికైతే, కాచిగూడ- బెంగళూరు, సికింద్రాబాద్- తిరుపతి, సికింద్రాబాద్-పుణె మార్గాల్లో సర్వీసులు నడిపేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. చెన్నై-బెంగళూరు, సికింద్రాబాద్-విశాఖ మార్గాల్లో వందే భారత్ రైళ్లు మొదలవడం తెలిసిందే.

కొత్త బెంచ్‌కు హిజాబ్ కేసు

న్యూఢిల్లీ: కర్నాటకలో పాఠశాలు, కళాశాలల్లో హిజాబ్ ధారణపై గత అక్టోబర్‌లో సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ఇద్దరు జడ్జీలు భిన్న తీర్పులిచ్చిన నేపథ్యంలో స్పష్టత కోసం కర్నాటక ముస్లిం విద్యార్థినులు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. విచారణ కోసం త్వరలో మరో బెంచి ఏర్పాటుచేస్తామని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం సోమవారం తెలిపింది.

ఢిల్లీలో ఆయుధ రాకెట్ భగ్నం

న్యూఢిల్లీ: గణతంత్ర వేడుకల నేపథ్యంలో ఢిల్లీలో కలకలం రేగింది. ఆయుధ సిండికేట్‌కు చెందిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి 34 పిస్టళ్లు స్వాధీనం చేసుకున్నారు. గోగీ గ్యాంగ్‌కు ఇచ్చేందుకు యూపీ నుంచి ఆయుధాలు తెస్తున్నారనే సమాచారంతో పోలీసులు సోదాలుచేసి వీరిని అరెస్ట్‌చేశారు. వీరి సమాచారం మేరకు యూపీలోని షామలీ జిల్లా కంధ్లా గ్రామంలో చెరకుతోటలో నిర్వహిస్తున్న ఆయుధ తయారీ కేంద్రాన్ని గుర్తించారు.

రాజ్యాంగమే సర్వోన్నతం

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లోకూర్

సాక్షి, న్యూఢిల్లీ: న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు, పార్లమెంట్ కంటే రాజ్యాంగమే సర్వోన్నతమైనదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకూర్ అన్నారు. ఓ లీగల్ వెబ్‌సైట్ ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. ''పార్లమెంటు చట్టాలు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నాయా, ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయా అనే తనిఖీ బాధ్యతను రాజ్యాంగం న్యాయ వ్యవస్థకు అప్పగించింది. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ వల్ల న్యాయవ్యవస్థకు స్వతంత్రత పోతుందనే భావనతో దాన్ని రాజ్యాంగ విరుద్ధంగా సుప్రీంకోర్టు ప్రకటించారని భావించరాదు'' అని చెప్పారు. నిర్దిష్ట చట్టం, లేదా రాజ్యాంగ సవరణ రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘిస్తున్నాయా, లేదా అనేది న్యాయ వ్యవస్థ నిర్ణయించాలని జస్టిస్ లోకూర్ అభిప్రాయపడ్డారు. వ్యవస్థలన్నింటిలోనూ పార్లమెంటే అత్యున్నతమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఇటీవల పేర్కొన్న నేపథ్యంలో జస్టిస్ లోకూర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఆ లాటిన్ అమెరికా దేశాల్లో... లావొక్కింతయు లేదు!

ఆందోళనలతో అట్టుడుకుతున్న బ్రెజిల్, పెరు



ఇది పెరు రాజధాని లిమాలో ఓ నిరసనకారుడి శవయాత్ర. '(అధ్యక్షురాలు) దినా నన్ను తూటాలతో బలి తీసుకుంది' అని మృతుడు చెబుతున్నట్టుగా శవపేటికపై రాసి ఆందోళనకారులు నగరమంతా ప్రదర్శనగా తీసుకెళ్లారు

దక్షిణ అమెరికాలో ముఖ్య దేశాలైన బ్రెజిల్, పెరు ఆందోళనలతో అట్టుడుకుతున్నాయి. బ్రెజిల్లో మాజీ అధ్యక్షుడే తన మద్దతుదారులను రెచ్చగొడుతూ దేశాన్ని రావణకాష్టం చేస్తుండగా, పెరులో పదవీచ్యుతుడైన అధ్యక్షునికి మద్దతుగా ప్రజలే దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో రోడ్లెక్కుతున్నారు! బ్రెజిల్లో నిరసనకారులు అధ్యక్ష భవనంతో పాటు ఏకంగా పార్లమెంటు, సుప్రీంకోర్టు వంటి రాజ్యాంగ సంస్థల భవనాలపైనే దాడికి దిగి విధ్వంసం సృష్టించారు. పెరులోనూ జనం రాజధానితో పాటు దేశమంతటా భారీగా ఆందోళనలకు దిగుతూ అట్టుడికిస్తున్నారు. వీటికి సమీప భవిష్యత్తులో కూడా తెర పడే సూచనలు కన్పించడం లేదు!

\- సాక్షి, నేషనల్ డెస్క్

బ్రెజిల్ బేజారు

బోల్సొనారో అనుయాయుల అరాచకం

కొత్త అధ్యక్షుడు డ సిల్వా ఆపసోపాలు

దక్షిణ అమెరికాలో కొంతకాలంగా 'గులాబి గాలి' వీస్తోంది. చాలా దేశాల్లో ప్రధానంగా వామపక్ష భావజాలమున్న పార్టీలే అధికారంలోకి వస్తున్నాయి. ఈ ఖండంలోని అతి పెద్ద దేశమైన బ్రెజిల్లోనూ అదే జరిగింది. గత అక్టోబర్లో జరిగిన ఎన్నికల్లో రైట్ వింగ్ నాయకుడైన జెయిర్ బోల్సొనారో వెంట్రుకవాసి తేడాలో ఓటమి చవిచూశారు. 51 శాతం ఓట్లతో వామపక్ష నేత లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా నెగ్గారు. కానీ ఈ ఫలితాలను ఒప్పుకుని గద్దె దిగేందుకు బోల్సొనారో ససేమిరా అన్నారు. తనకు వ్యతిరేకంగా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, వాటికి సుప్రీంకోర్టు మద్దతూ ఉందని ఆరోపణలు గుప్పించారు. ఈవీఎంలపైనా అనుమానాలు వ్యక్తం చేశారు. తర్వాతి పరిణామాల్లో అజ్ఞాతంలోకి వెళ్లిన ఆయన, అవినీతి ఆరోపణలపై విచారణను తప్పించుకునేందుకు అంతిమంగా అమెరికాలో తేలారు! కానీ, ''అధికారం మీ చేతుల్లోనే ఉంది. సైన్యం ఇప్పటికీ నా మాటే వింటుంది. దొంగల పాలనను కూలదోయండి'' అంటూ అక్కడినుంచే తన మద్దతుదారులను రెచ్చగొడుతూ వస్తున్నారు. ఫలితంగా కొంతకాలంగా బ్రెజిల్ అల్లర్లు, ఆందోళనలు, గొడవలతో అట్టుడుకుతోంది.



అధ్యక్షుడు డ సిల్వా



బోల్సొనారో

పార్లమెంటుపై దాడులు

ముఖ్యంగా జనవరి 8న కరడుగట్టిన బోల్సొనారో మద్దతుదారులు ఉన్నట్టుండి వేల సంఖ్యలో అధ్యక్ష భవనం, పార్లమెంటు, సుప్రీంకోర్టు భవనాల్లోకి చొరబడి విధ్వంసం సృష్టించారు. సైన్యం తిరగబడి ఎన్నికల ఫలితాలను రద్దు చేసి బోల్సొనారోను తిరిగి అధ్యక్షున్ని చేయాలనే డిమాండ్‌తో అరాచకానికి దిగారు. ఆ సమయంలో భద్రతా దళాలు చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయాయి. పైగా ఆందోళనలు జరుగుతుండగానే పలువురు నేతలు, అధికారులు నవ్వుతూ ఫొటోలు తీసుకుంటూ కన్పించారు! నిజానికి అప్పటికి పది వారాలుగా నిరసనకారులు ఏకంగా ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ ముందే టెంట్లు వేసుకుని మరీ ఆందోళనలు చేస్తున్నా వాటిని ఆదిలోనే తుంచేసేందుకు డ సిల్వా పెద్దగా ప్రయత్నాలు చేయలేదు. తిరుగులేని ప్రజాదరణ లులా డ సిల్వా సొంతమైనా కీలక సైన్యం మద్దతు ఆయనకు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమన్న వ్యాఖ్యలు వినిపించాయి. దాంతో పరిస్థితిని ఏదోలా అదుపులోకి తెచ్చేందుకు డ సిల్వా కిందామీదా పడుతున్నారు.

- మాజీ న్యాయ మంత్రి ఆండెర్సన్ టోరెస్‌తో పాటు పలువురు బోల్సొనారో సన్నిహితులను అరెస్టు చేశారు.
- సైన్యం తిరుగుబాటుకు ప్రయత్నిస్తోందన్న వార్త నేపథ్యంలో జనవరి 8 ఆందోళనలకు బాధ్యున్ని చేస్తూ ఆర్మీ చీఫ్‌ను తాజాగా తొలగించారు.
- అల్లర్ల వెనక బోల్సొనారో హస్తంపై విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు ప్రకటించింది.

ఏం జరగనుంది...

పరిస్థితులను చూస్తుంటే దేశంలో అల్లర్లకు ఇప్పట్లో అడ్డుకట్ట పడే సూచనలు కన్పించడం లేదు. అవినీతి ఆరోపణలపై ఇటీవలే ఏడాదిన్నర పాటు ఊచలు లెక్కించిన డ సిల్వాకు దేశాన్ని పాలించే అర్హత లేదంటూ బోల్సొనారో మద్దతుదారులు ఇప్పటికీ దేశవ్యాప్తంగా చెలరేగిపోతూనే ఉన్నారు. సైన్యం పూర్తి మద్దతు లేకపోతే వాటికి డ సిల్వా ఏ మేరకు అడ్డుకట్ట వేయగలరన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే పలుమార్లు సైనిక కుట్రలను, నియంతల పాలనలను చవిచూసిన బ్రెజిల్లో మరోసారి అలాంటి పరిస్థితులు తలెత్తుతాయో, ప్రశాంత పరిస్థితులు నెలకొంటాయో వేచి చూడాల్సిందే.

పెరు.. పేదల తిరుగుబాటు

అధ్యక్షురాలు బొలార్టేపై వెల్లువెత్తిన వ్యతిరేకత

మాజీ అధ్యక్షుడు కాస్టిలోకు మద్దతుగా ఆందోళనలు

ఆమె పేరు మార్గరిటా కొండొరీ. పెరులో ఆండీస్ పర్వత శ్రేణుల్లోని అత్యంత వెనకబడ్డ పునో ప్రావిన్స్‌లో స్థానిక అయ్మారా తెగకు చెందిన వృద్ధురాలు. వయోభారాన్ని కూడా లెక్క చేయకుండా రెండు రోజుల పాటు అత్యంత కఠినమైన బస్సు ప్రయాణం చేసి మరీ రాజధాని లిమా చేరుకుంది. ''మేమంతా పేదరికంలో మగ్గుతున్నాం. మాపై ఉగ్రవాద ముద్ర వేసినా పర్లేదు. బొలార్టే రాజీనామా చేసేదాకా రాజధాని నుంచి కదిలే ప్రసక్తే లేదు'' అంటూ సహచర ఆందోళనకారులతో కలిసి పెద్దపెట్టున నినదిస్తోంది. పెరులో దాదాపు ఆరు వారాలుగా ఇదే పరిస్థితి! స్థానిక తెగలకు చెందిన వామపక్ష ఫైర్ బ్రాండ్ నాయకుడు కాస్టిలోను అధ్యక్ష పదవి నుంచి కూలదోసి జైలుపాలు చేసి ఉపాధ్యక్షురాలు దినా బొలార్టే గత డిసెంబర్ 7న అధికారాన్ని చేజిక్కించుకున్నారు. అప్పటినుంచీ ఆమెకు వ్యతిరేకంగా మొదలైన ప్రజాందోళనలు నానాటికీ తీవ్ర రూపు దాలుస్తున్నాయి. దేశమంతటికీ వ్యాపించడమే గాక హింసాత్మకంగా మారుతున్నాయి. మార్గరిటా మాదిరిగా అత్యంత మారుమూల ప్రాంతాల నుంచి కూడా జనం అత్యంత వ్యయ ప్రయాసలకోర్చి మరీ లిమాకు ప్రవాహంలా వచ్చి పడుతున్నారు. బొలార్టే తప్పుకుని ఎన్నికలు ప్రకటించేదాకా దాకా ఇంచు కూడా కదిలేది లేదని భీష్మిస్తున్నారు. భద్రతా దళాలపైకి రాళ్లు రువ్వుతూ ఢీ అంటే ఢీ అంటున్నారు.

ఏమిటి సమస్య?

ప్రపంచంలో రెండో అతి పెద్ద రాగి ఉత్పత్తిదారు అయిన పెరులో 1990 నుంచి దశాబ్దకాలపు నియంతృత్వ పాలన అనంతరం 2000లో ప్రజాస్వామ్య పవనాలు వీచాయి. 2001 నుంచి 2014 దాకా జోరుగా సాగిన ఖనిజ నిల్వల ఎగుమతితో జీడీపీ రెట్టింపు వృద్ధి రేటుతో దూసుకుపోయింది. కార్మికుల వేతనాలూ ఇతోధికంగా పెరిగాయి. కానీ గ్రామీణ ప్రాంతాలు మాత్రం బాగా నిర్లక్ష్యానికి గురవుతూ వచ్చాయి. సంపదంతా ప్రధానంగా నగర ప్రాంతాల్లో కేంద్రీకృతమైంది. మరోవైపు అవినీతి, అవ్యవస్థ నానాటికీ పెచ్చరిల్లాయి. స్థానిక ప్రభుత్వ పెద్దలు బడ్జెట్ కేటాయింపులను ఇష్టారాజ్యంగా భోంచేయడం ప్రారంభించారు. దాంతో కొన్నేళ్లుగా దేశంలో రాజకీయ అస్థిరత రాజ్యమేలుతోంది. గత రెండేళ్లలోనే ఏకంగా ఐదుగురు అధ్యక్షులు మారారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో లెఫ్టిస్టు అయిన కాస్టిలోపైనా పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. విచారణల దాకా వెళ్లడమే గాక రెండుసార్లు అభిశంసన ప్రయయత్నాలూ జరిగాయి. గత డిసెంబర్లో మరోసారి అభిశంసనకు రంగం సిద్ధమవడంతో కాంగ్రెస్‌ను రద్దు చేసి డిక్రీ ద్వారా పాలించేందుకు కాస్టిలో విఫలయత్నం చేశారు. అదే అభియోగంపై చివరికి ఆయన్ను పదవి నుంచి దింపి ఖైదు చేసి బొలార్టే పదవిలోకి వచ్చారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో, ముఖ్యంగా పేదల్లో కాస్టిలోకు విపరీతమైన ఆదరణ ఉండటంతో ఈ పరిణామాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు మిన్నంటాయి. ఆందోళనలకు ఇప్పటిదాకా దేశవ్యాప్తంగా 50 మందికి పైగా బలయ్యారు.

అల్లకల్లోలం

- ఆందోళనల దెబ్బకు దేశంలో అవ్యవస్థ రాజ్యమేలుతోంది. ఇప్పటికే ఎమర్జెన్సీ విధించారు. రోడ్డు, రైలు, విమాన తదితర రవాణా సేవలన్నీ స్తంభించాయి.
- మైనింగ్ తదితర కార్యకలాపాలకూ తీవ్ర విఘాతం కలిగింది.
- అపారమైన ఖనిజ నిల్వలున్నా పేదరికంలో మగ్గుతున్న దక్షిణ ప్రాంతాల్లో నిరసనలు బాగా జరుగుతున్నాయి.
- వీటిపై బొలార్టే బలప్రయోగానికి దిగుతున్నారు. అవసరమైతే ఉక్కుపాదం మోపుతామని ప్రకటిస్తున్నారు. ఇది మరింత అస్థిరతకు, సామాజిక విభజనకు దారితీస్తుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



అధ్యక్షురాలు దినా బొలార్టే

ఇప్పుడేం జరగనుంది?

- చట్టసభ అయిన కాంగ్రెస్ సభ్యులపై జనంలో విపరీతమైన వ్యతిరేకత నెలకొని ఉంది. ఇది ఏకంగా 88 శాతాన్ని చేరినట్టు ఇటీవలి అభిప్రాయ సేకరణలో తేలింది!
- ఇక అధ్యక్షురాలు బొలార్టేను 71 శాతం మంది ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.
- అయితే అధ్యక్షునిగా ఉండగా కాస్టిలోపైనా ఇదే స్థాయిలో వ్యతిరేకత వ్యక్తం కావడం విశేషం!
- 2026లో జరగాల్సిన ఎన్నిలను 2024 ఏప్రిల్లోనే జరిపేందుకు కాస్టిలో ప్రయత్నించారు. ఈ ప్రతిపాదనపై త్వరలో మరోసారి ఓటింగ్ జరగనుంది.
- కానీ రెండేళ్ల ముందుగా పదవులు వదులుకునేందుకు కాంగ్రెస్ సభ్యుల్లో అత్యధికులు సిద్ధంగా లేరు.
- 1993లో నియంత ఆల్బర్టో ఫుజిమోరీ హయాంలో రాసిన రాజ్యాంగం అధ్యక్షునికి అపరిమితమైన అధికారాలు కట్టబెట్టింది. అధ్యక్షునిపై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా కాంగ్రెస్‌లో మెజారిటీ సభ్యులు ఓటేసినా అధ్యక్షుడు దాన్ని తోసిపుచ్చవచ్చు!
- దాంతో బొలార్టే తప్పుకోవడంతో పాటు ఏకంగా రద్దు చేసి నూతన రాజ్యాంగాన్ని రచించుకోవాలంటూ డిమాండ్లు ఊపందుకున్నాయి!
- ఫిబ్రవరిలో మరోసారి దేశవ్యాప్త సమ్మెకు పలు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.
- ఈ పరిస్థితుల్లో పెరులో సంక్షోభానికి, రాజకీయ అస్థిరతకు సమీప భవిష్యత్తులో తెర పడే సూచనలు కన్పించడం లేదు.



మాజీ అధ్యక్షుడు కాస్టిలో



నేవీ అమ్ములపొదిలోకి వాగీర్

ముంబై: అత్యాధునిక ఆయుధ వ్యవస్థ, వేగంగా దూసుకెళ్లే సామర్థ్యం, గుట్టుగా మోహరించే దమ్ము ఉన్న నూతన జలాంతర్గామి ఐఎన్ఎస్ వాగీర్ లాంఛనంగా భారత నావికాదళంలో చేరింది. సోమవారం ముంబైలోని నావల్ డాక్‌యార్డ్ ఇందుకు వేదికైంది. కల్వరీ శ్రేణి జలాంతర్గాముల్లో చివరిది, ఐదవది అయిన వాగీర్‌ను నావికా దళ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ లాంఛనంగా భారత నేవీలోకి ప్రవేశపెట్టారు. 'వాగీర్ రాకతో సముద్రజలాల్లో శత్రువుల బారి నుంచి దేశ ప్రయోజనాలను మరింతగా సంరక్షించవచ్చు. ఇంటెలిజెన్స్, నిఘా, మొహరింపు విభాగాల్లో నేవీ సామర్థ్యాన్ని వగర్ పరిపుష్టంచేస్తుంది' అని ఈ సందర్భంగా భారత నేవీ ప్రకటించింది. ఎలాంటి జంకు లేకుండా దాడి చేసే ఇసుక షార్క్ చేప(వాగీర్) పేరును దీనికి పెట్టారు. 24 నెలల వ్యవధిలో నేవీ చేరిన మూడో సబ్‌మరైన్ ఇది. మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ సంస్థ దీనిని తయారుచేసింది. ఫ్రాన్స్ నుంచి బదిలీచేసిన సాంకేతికతను ఇందులో వినియోగించారు. 11 నెలలపాటు సముద్రంలో పలు రకాల ప్రయోగ పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాక సోమవారం నేవీలోకి తీసుకున్నారు.

జలాంతర్గామి విశేషాలు

- ప్రపంచంలోనే అత్యుత్తమ సెన్సార్‌లను దీనిలో అమర్చారు.
- వైర్ ఆధారిత టోర్పెడోలున్నాయి.
- దీని ద్వారా సముద్ర అంతర్భాగం నుంచి క్షిపణులను సముద్రజలాల మీది లక్ష్యాలపైకి ప్రయోగించవచ్చు
- స్పెషల్ ఆపరేషన్స్‌లో మెరైన్ కమెండోలను శత్రు స్థావరాలలోకి చడీచప్పుడుకాకుండా తరలించగలదు.
- శక్తివంత డీజిల్ ఇంజిన్‌తో పనిచేస్తుంది.
- శత్రు టోర్పెడోలను ఏమార్చే నూతన స్వీయ రక్షణ వ్యవస్థతో దీనిని బలోపేతం చేశారు

మహా యోధుడు బోస్

126వ జయంతి సందర్భంగా ప్రధాని ఘన నివాళులు

- స్మారక నమూనా ఆవిష్కరణ
- అండమాన్‌లో 21 దీవులకు 'పరమ వీరచక్ర'ల పేర్లు



పార్లమెంట్‌లో నేతాజీకి నివాళులర్పించాక మోదీ, ఖర్గే సరదా సంభాషణ

పోర్ట్‌బ్లెయిర్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ మహా యోధుడని, ఆయన స్మారకం ప్రజల్లో దేశభక్తిని పెంపొందిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నేతాజీ 126వ జయంతిని పురస్కరించుకొని సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ప్రతిపాదిత నేతాజీ స్మారకం నమూనాను వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఈ స్మారకాన్ని కేంద్ర పాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవుల్లోని రాస్ ఐలాండ్‌లో ఏర్పాటు చేయనున్నారు. నేతాజీ జయంతి సందర్భంగా అండమాన్‌లోని 21 దీవులకు పరమ వీరచక్ర పురస్కార గ్రహీతల పేర్లను పెట్టారు. సుభాష్‌చంద్రబోస్ 1943లో తొలిసారిగా అండమాన్ గడ్డపైనే జాతీయ జెండాను ఎగురవేశారని మోదీ గుర్తుచేశారు. అండమాన్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం రావడం గర్వకారణంగా భావిస్తున్నానని చెప్పారు. దీవులకు వీర సైనికుల పేర్లు పెట్టామని, ఈ దీవులు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినందిస్తాయని తెలిపారు. మేజర్ సోమనాథ్ శర్మ, లెఫ్టినెంట్ కల్నల్(అనంతరం మేజర్) ధన్‌సింగ్ థాపా, సుబేదార్ జోగీందర్ సింగ్, మేజర్ షైతాన్ సింగ్, కంపెనీ క్వార్టర్ మాస్టర్ హవల్దార్ అబ్దుల్ హమీద్, సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ క్షేత్రపాల్, ఫ్లైట్ ఆఫీసర్ నిర్మల్జిత్ సింగ్ షెఖాన్ తదితర వీర జవాన్ల పేర్లను అండమాన్ దీవులకు పెట్టినట్లు వెల్లడించారు. ఈ దీవులు బానిసత్వానికి గుర్తులుగా ఉండేవని, దాన్ని మార్చేందుకే జవాన్ల పేరిట నామకరణం చేసినట్లు వివరించారు.

నేతాజీ పత్రాలను బహిర్గతం చేశాం

స్వాతంత్య్ర ఉద్యమంలో నేతాజీ పాత్రను తగ్గించి చూపేందుకు ప్రయత్నాలు జరిగాయని మోదీ ఆరోపించారు. ''కానీ ఈ రోజు ఢిల్లీ నుంచి అండమాన్ దాకా ఈ రోజు దేశం మొత్తం ఆ మహావీరుడికి ఘనంగా నివాళులర్పిస్తోంది. పరాక్రమ్ దివస్ నిర్వహించుకుంటోంది. నేతాజీ చరిత్రను, వారసత్వాన్ని పరిరక్షించుకొంటున్నాం. ఆయనకు సంబంధించిన పత్రాలను మా ప్రభుత్వం బయట పెట్టింది'' అన్నారు. కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడారు. 21 దీవులకు పరమవీర చక్ర అవార్డు గ్రహీతల పేర్లు పెట్టడం హర్షణీయమన్నారు. అండమాన్‌లోని ప్రఖ్యాత సెల్యూలార్ జైల్ తీర్థయాత్ర క్షేత్రం కంటే ఎంతమాత్రం తక్కువ కాదని వ్యాఖ్యానించారు. రాస్ ఐలాండ్‌లో నేతాజీ స్మారకంలో మ్యూజియం, కేబుల్ కార్ రోప్‌వే, లేజర్-సౌండ్ షో, చిల్డ్రన్స్ అమ్యూజ్‌మెంట్ పార్కు, రెస్టో లాంజ్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. బ్రిటిష్ వలస పాలనపై వీరోచితంగా పోరాడిన గొప్ప నాయకుడిగా నేతాజీ ఎప్పటికీ గుర్తుండిపోతారంటూ మోదీ ట్వీట్ చేశారు.

మహనీయుల చరిత్రలు చదవండి

న్యూఢిల్లీ: చరిత్రకెక్కిన మహనీయుల జీవిత చరిత్రలను విస్తృతంగా చదవాలని యువతీ యువకులకు మోదీ సూచించారు. ''సవాళ్లను వారెలా ఎదుర్కొన్నారో తెలుసుకోవాలి. వారి జీవితాల నుంచి ఎంతో నేర్చుకోవాలి'' అన్నారు. నేతాజీ జయంతి సందర్భంగా 80 మంది యువతీ యువకులతో ఆయన తన నివాసంలో సంభాషించారు.

పవర్ గ్రిడ్ వైఫల్యంతో పాక్‌లో చీకట్లు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో సోమవారం చీకట్లు అలుముకున్నాయి. నేషనల్ పవర్ గ్రిడ్ వైఫల్యంతో రాజధాని ఇస్లామాబాద్, ఆర్థిక నాడి కరాచీ సహా దేశంలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత అక్టోబర్‌లోనూ విద్యుత్ పంపిణీ వ్యవస్థలో లోపాలతో ఇలాగే 12 గంటలు కరెంటు బంద్దైంది.

అమెరికా కాల్పుల అనుమానితుని ఆత్మహత్య

మాంటెరీ: లాస్‌ఏంజెలెస్‌లో చైనా న్యూ ఇయర్ వేడుకల కాల్పుల ఘటనలో అనుమానితుడు తుపాకీతో కాల్చుకుని చనిపోయాడు. అతన్ని ఆసియా సంతతికి చెందిన హు కాన్ ట్రాన్ (72)గా గుర్తించారు. కాల్పులకు ఇతడొక్కడే కారణమని భావిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

ఆర్ఎస్ఎస్, నేతాజీ లక్ష్యం ఒక్కటే: భగవత్

కోల్‌కతా: భారత్‌ను సమున్నత దేశంగా తీర్చిదిద్దడమే ఆర్ఎస్ఎస్, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ల లక్ష్యమని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ చెప్పారు. పరిస్థితులు, దారులు వేరైనా ఇద్దరి లక్ష్యమూ ఒక్కటేనన్నారు. సోమవారం నేతాజీ 126వ జయంతి సందర్భంగా కోల్‌కతాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. స్వాతంత్య్రం కోసం నేతాజీ ఎన్నో త్యాగాలు చేశారన్నారు. ఆయన ఆశయాలను, బోధనలను ఆచరించి భారత్‌ను విశ్వగురువుగా మార్చాలని పిలుపునిచ్చారు.

సర్జికల్ స్ట్రయిక్స్‌కు ఆధారాలేవి: దిగ్విజయ్

జమ్మూ/న్యూఢిల్లీ: పాక్ భూభాగంలో సర్జికల్ స్ట్రయిక్స్‌కు మోదీ సర్కారు ఏ ఆధారమూ కూడా చూపలేకపోయిందని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ అన్నారు. అబద్ధాల సాయంతో పాలన సాగిస్తోందని విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. రాహుల్ భారత్ జోడో అంటూ యాత్ర చేస్తుంటే కాంగ్రెస్ నేతలు 'భారత్ తోడో' అంటున్నారని పేర్కొంది.

కొలువుపోయి కొత్త కష్టాలు!

- అమెరికాలో వేలాది భారత టెకీల పరిస్థితి అగమ్యగోచరం
- 60 రోజుల్లోపు కొత్త కొలువు వెతుక్కోకుంటే స్వదేశానికే!

వాషింగ్టన్: అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి దెబ్బకు దిగ్గజ టెక్ సంస్థలు భారీగా తీసివేతలకు దిగడంతో భారత టెకీల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గత నవంబర్ నుంచి ఏకంగా 2 లక్షల మంది ఐటీ ఉద్యోగులను తొలగించినట్లు 'ది వాషింగ్టన్ పోస్ట్' పేర్కొంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, అమెజాన్ సహా ఐటీ, సోషల్ మీడియా, ఆర్థిక సేవల సంస్థలు ఉద్యోగులను భారీగా తీసేస్తున్నాయి. వీరిలో 30 నుంచి 40 శాతం భారత టెకీలేనని పరిశ్రమల వర్గాలు వెల్లడించాయి. వీరంతా హెచ్-1బీ, ఎల్1 వీసాల మీద అమెరికాలో పని చేస్తున్నావారే. 60 రోజుల్లోపు మరో ఉద్యోగం వెతుక్కోకుంటే వీరిని స్వదేశానికి పంపించేస్తారు. లేదంటే హెచ్-1బీ, ఎల్1 నుంచి వేరే కేటగిరీకి మార్చుకోక తప్పని పరిస్థితి! ''మూణ్నెల్ల కింద అమెరికా వచ్చా. మార్చి 20న తప్పుకోవాలని చెప్పేశారు. నేను సింగిల్ పేరెంట్‌ను. నా పరిస్థితేమిటి?'' అంటూ అమెజాన్ ఉద్యోగి ఒకామె వాపోయారు. వీరికి మరింత గడువివ్వాలని సిలికాన్ వ్యాలీ కమ్యూనిటీ లీడర్ భుతోరియా అన్నారు.

పరస్పర సాయం...

ఉన్నపళాన ఉద్యోగం కోల్పోయిన వారికి సాయపడేందుకు గ్లోబల్ ఇండియన్ టెక్నాలజీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అండ్ ఫౌండేషన్ ఫర్ ఇండియా, ఇండియన్ డయాస్పోరా స్టడీస్ (జీఐటీపీఆర్ఓ) ముందుకొచ్చింది. వారికి, సంస్థలకు అనుసంధానకర్తగా ఉంటోంది. ఉద్యోగ ఖాళీల ప్రకటనలను షేర్ చేసుకుంటున్న వాట్సాప్ గ్రూప్‌లో వందలాది భారత టెకీలు సభ్యులుగా ఉన్నారు. తొలి అమెరికాకు వచ్చిన వారి వీసా స్టేటస్ మార్చేందుకు సాయపడుతూ కొందరు వాట్సాప్ గ్రూప్‌లను నిర్వహిస్తున్నారు. మరోవైపు పులి మీద పుట్రలా తమ ఉద్యోగుల గ్రీన్‌కార్డు ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు గూగుల్ ప్రకటించింది. ఇతర కంపెనీలూ ఇదే బాట పట్టేలా కన్పిస్తున్నాయి. ఈ టెకీలను మోదీ సర్కార్ తక్షణం ఆదుకోవాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. దీనిపై సమీక్ష నిర్వహించాలంటూ సోమవారం హిందీలో ట్వీట్‌చేశారు.

సరైన అమ్మాయి దొరికితే పెళ్లి చేసుకుంటా

తెలంగాణ వంటలకు ఘాటెక్కువ • ప్రధానినైతే విద్యా సంస్కరణలు • యూట్యూబ్ ఇంటర్వ్యూలో రాహుల్

న్యూఢిల్లీ: పెళ్లికి తాను వ్యతిరేకం కాదని, సరైన అమ్మాయి దొరికితే కచ్చితంగా చేసుకుంటానని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా ఇటీవల రాజస్తాన్‌లో 'కర్లీ టేల్స్' యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు. రాత్రిపూట తన కంటైనర్ బయట భోంచేస్తూ సరదాగా సంభాషించారు. తన తల్లిదండ్రులు సోనియా, రాజీవ్ గాంధీ పరస్పరం ప్రేమించుకొని చక్కగా పెళ్లి చేసుకున్నారని గుర్తుచేశారు. ''వారికి ఒకరిపై ఒకరికి అంతులేని ప్రేమ ఉండేది. నేనూ వారిలాగే పెళ్లి చేసుకోవాలని భావిస్తున్నా. సరైన అమ్మాయి ఎదురైతే సంతోషిస్తా. తెలివైన చక్కటి అమ్మాయిని కోరుకుంటున్నా. నేను భోజన ప్రియున్ని కాను. ఆకలైనప్పుడు అందుబాటులో ఉన్నది తినేస్తా. బఠాణీలు, పనసకాయ అస్సలు ఇష్టముండవు. తెలంగాణ వంటలు కాస్త ఘాటుగా ఉంటాయి. నాకు ఎక్కువ కారం ఇష్టముండదు. జోడో యాత్రలో ఎక్కువ సంఖ్యలో వంటకాలు దొరకడం లేదు. ఇంట్లో మధ్యాహ్నం పూట దేశీయ, రాత్రి విదేశీ వంటకాలు తింటా. మిఠాయిలకు దూరంగా ఉంటా. మాంసాహార వంటలిష్టం. చికెన్, మటన్, సీఫుడ్ తీసుకుంటా. చికెన్ టిక్కా, సీఖ్ కబాబ్‌లు, ఆమ్లెట్లు అభిమాన వంటకాలు. ఉదయం కప్పు కాఫీ తాగుతా. ఢిల్లీలో మోతీ మహల్, సాగర్, స్వాగత్, శరవణ భవన్‌కు ఎక్కువగా వెళ్తుంటా'' అని చెప్పారు.

తొలి జీతం 2,500–3,000 పౌండ్లు

తమది అలహాబాద్‌లో స్థిరపడ్డ కాశ్మీరీ పండిట్ కుటుంబమని రాహుల్ గుర్తు చేశారు. ''మా తాత ఫిరోజ్ గాంధీ పార్సీ మతస్థుడు. అందుకే నేను పూర్తిస్థాయిలో 'మిక్స్‌డ్'! నాన్నమ్మ ఇందిరా గాంధీ హత్య తర్వాత నేను ఇంట్లోనే చదువుకోవాల్సి వచ్చింది. తర్వాత హార్వర్డ్‌లో అంతర్జాతీయ సంబంధాలు, రాజకీయాలు చదివా. కేంబ్రిడ్జి నుంచి డెవలప్‌మెంట్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశా. పాతికేళ్ల వయసులో లండన్‌లో ఓ కార్పొరేట్ కంపెనీలో తొలి ఉద్యోగం చేశా. మొదటి జీతంగా 2,500–3,000 పౌండ్ల చెక్కు అందుకున్నా. నేను ప్రధాని అయితే విద్యా వ్యవస్థను మారుస్తా. మధ్య తరహా వ్యాపారాలకు సాయమందిస్తా. రైతులు, నిరుద్యోగ యువతను ఆదుకుంటా. విద్వేషం, హింసలపై పోరాడాలన్న ఆలోచనే జోడో యాత్రకు పురిగొల్పింది'' అన్నారు.

కశ్మీరీ పండిట్లకు ఎల్జీ సారీ చెప్పాలి

జమ్మూ: న్యాయ సాధనకు పోరాడుతున్న కశ్మీరీ పండిట్లనుద్దేశించి అనుచితంగా మాట్లాడిన జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) మనోజ్ సిన్హా వారికి క్షమాపణ చెప్పాలని జమ్మూలో జోడో యాత్ర సందర్భంగా రాహుల్ డిమాండ్ చేశారు. ''దానం కోసం ప్రాధేయపడాల్సిన అగత్యం లేదు. మీ కోసమే ప్రధాని ప్యాకేజీ ప్రకటించారు' అంటూ ఎల్జీ మాట్లాడటం దారుణం. పండిట్లు హక్కుల కోసం పోరాడుతున్నారు'' అంటూ మండిపడ్డారు. పండిట్ల ప్రతినిధుల బృందం ఆయన్ను కలిసి ఈ విషయమై వినతిపత్రం సమర్పించింది.



సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 24 । జనవరి । 2023

అలరించిన 'జలతరంగ్'



హుస్సేన్ సాగర్ బుద్ధ విగ్రహం ఎదుట తత్వ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సోమవారం జలతరంగ్ సంగీత కచేరి నిర్వహించారు. అరుదైన సంగీత వాయిద్యమైన జల్-తరంగ్‌ను ప్రముఖ వాయిద్యకారులు మిలింద్ ప్రదర్శించారు. సంగీత ప్రియులు పాల్గొన్నారు.



వరుసబెట్టి దోచేశారు..

తాళం వేసిన ఇళ్లపై రెక్కీ నిర్వహించిన దొంగలు అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి ఏకంగా 13 ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పరిధిలో సోమవారం జరిగింది. -8లో

ఓయూ చీఫ్ వార్డెన్ పదవీ కాలం పొడిగింపు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్‌రావు పదవీ కాలాన్ని ఏడాది కాలం పొడిగించారు. సోమవారం సంబంధిత లేఖను చీఫ్ వార్డెన్‌కు వీసీ ప్రొ.రవీందర్ అందజేశారు.

న్యూస్‌రీల్

పేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

- రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ



గోల్కొండ: పేదల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ వినూత్న సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. సోమవారం కార్వాన్ పన్నిపురాలోని కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కంటి వెలుగులో భాగంగా ఇప్పటి వరకు వైద్య పరీక్షలు ఎన్ని జరిగాయి? ఎంతమందికి కళ్లద్దాలు ఇచ్చారు? అనే వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమైనవారికి సరోజిని ఆస్పత్రికి పంపాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్, కార్వాన్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి జీవన్ సింగ్‌తో కలిసి పలువురికి కంటి అద్దాలు అందించారు. కార్యక్రమంలో కంటి వెలుగు కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ మల్లీశ్వరి, సాయి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ కొంటానంటూ బురిడీ

- రూ.3.12 లక్షలు కాజేసిన సైబర్ నేరగాడు

హిమాయత్‌నగర్: అప్పుల్లో కూరుకుపోయిన ఓ వ్యక్తి తన కిడ్నీని అమ్మేందుకు ప్రయత్నించాడు. ఇందుకోసం గూగుల్‌లో సెర్చ్ చేశాడు. దీనిని ఓ సైబర్ నేరగాడు క్యాష్ చేసుకున్నాడు. వాట్సప్ కాల్ ద్వారా నమ్మించి కోట్లాది రూపాయలు ఇప్పిస్తానంటూ రూ.3.12 లక్షలు కాజేశాడు. బాధితుడు రెండురోజుల క్రితం సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌కు ఫిర్యాదు చేశాడు. బంజారాహిల్స్‌కు చెందిన 55 ఏళ్ల వ్యక్తి భారీగా అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో తన కిడ్నీని అమ్మి అప్పులు తీర్చాలనుకున్నాడు. గూగుల్‌లో సెర్చ్ చేశాడు. కిడ్నీని రూ.6 కోట్లకు కొంటానంటూ సైబర్ నేరగాడు ఆఫర్ చేశాడు. కొన్ని డాక్యుమెంట్లు, టిస్యులు, బ్యాంకు లావాదేవీలకు సంబంధించి కొంత ఖర్చు పెట్టుకోవాలని సూచించాడు. దీంతో బాధితుడు పది నెలల వ్యవధిలో రూ.3.12 లక్షలు సమర్పించాడు. సైబర్ నేరగాడు మరిన్ని డబ్బులు కావాలంటూ వేధించడంతో బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

రామ జన్మభూమి మందిర్ 3డీ ఫ్రేమ్ ఆవిష్కరణ




సాక్షి, సిటీబ్యూరో: చారిత్రక ఆధ్యాత్మిక విశేషాలను చిత్రాలుగా మలిచి అందించే నగరానికి చెందిన గిఫ్ట్స్ తయారీ కంపెనీ సువా (ఎస్‌యూఏ) గిఫ్ట్స్ రామ జన్మభూమి మందిర్ 3డీ ఫ్రేమ్‌ను రూపొందించింది. దీనిని సోమవారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. గత కొంతకాలంగా పలు ఆలయాలు, ఆధ్యాత్మిక విశేషాలను అపురూపమైన ఫ్రేమ్స్‌గా మలచడంలో పేరొందిన తాము అదే క్రమంలో రామ జన్మభూమి మందిర్‌ను కూడా రూపొందించామని ఈ సందర్భంగా సువా గిఫ్ట్స్ డైరెక్టర్ సిద్ధార్థ్ జైన్ తెలిపారు.

29 నుంచి సరికొత్తగా 'సరిగమప'

సాక్షి, సిటీబ్యూరో: లక్ష్యాన్ని చేరుకోగానే విజయం సంపూర్ణం కాదు. లక్ష్యాలను మళ్లీ మళ్లీ చేరినప్పుడే అసలైన విజయం సాకారమవుతుందని సినీ గేయ రచయిత అనంత శ్రీరాం అన్నారు. సోమవారం బంజారాహిల్స్ వేదికగా జీ తెలుగు సరికొత్త సీజన్ సరిగమప చాంపియన్‌షిప్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సినీ నేపథ్య గాయకులు ఎస్పీ శైలజ, మనో, రచయిత అనంత శ్రీరాం, యాంకర్ ప్రదీప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గాయని శైలజ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జరిగిన చాంపియన్‌షిప్ సీజన్లలోని అత్యుత్తమ గాయకులతో ప్రత్యేకంగా సరికొత్త సరిగమప సీజన్‌ను ఈ నెల 29 నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మెంటార్స్ సాకేత్, పృథ్వీ, చంద్ర, రమ్య బెహరాతో పాటు చాంపియన్‌షిప్‌లో పోటీ పడుతున్న సింగర్స్ సందడి చేశారు.



పచ్చజెండా ఊపేనా?



రైల్వే ప్రాజెక్టులకు ఏటా రెడ్ సిగ్నలే

- నిధులు లేమితో నిలిచిపోయిన పనులు
- ఫిబ్రవరి బడ్జెట్ కోసం ద.మ.రైల్వే ఎదురుచూపులు
- ఇంటర్ సిటీ రైళ్లు లేవు.. ప్యాసింజర్‌లు పట్టాలెక్కవు
- సామాన్యులకు అందని వందే భారత్

సాక్షి, సిటీబ్యూరో: సుమారు పన్నెండేళ్ల క్రితం ప్రారంభించిన ఎంఎంటీఎస్ రెండో దశ ఇప్పటికీ పూర్తి కాలేదు, లింగంపల్లి నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు ఆరు కిలోమీటర్ల మేర అదనపు సదుపాయం అందుబాటులోకి వచ్చినా రైళ్లు పట్టాలెక్కలేదు. ప్రతి ఏటా ఫిబ్రవరి నెలలో ఠంచన్‌గా కేంద్ర బడ్జెట్ మాత్రం వచ్చిపోతూనే ఉంది. కానీ జంటనగరాల్లోని ప్రాజెక్టులకు మాత్రం రెడ్ సిగ్నలే పడడం గమనార్హం. రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాల ప్రైవేటీకరణలో భాగంగా స్టేషన్ల ఆధునికీకరణ వంటి కొన్ని లాభదాయకమైన ప్రాజెక్టులు మినహాయించి లక్షలాది మంది ప్రయాణికులు ఆధారపడిన కొత్త రైళ్లు, లైన్‌ల విస్తరణకు మాత్రం నిధులు లభించడం లేదు. మరో వారం పది రోజుల్లో కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ప్రతి సంవత్సరం పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా ప్రజల అవసరాలను గుర్తించేందుకు ఏర్పాటు చేసే ఎంపీల సమావేశం కూడా ఈసారి ఏర్పాటు చేయలేదు. ఈ క్రమంలో ప్రవేశపెట్టనున్న కేంద్రబడ్జెట్‌లో హైదరాబాద్ ప్రజల రైల్వే ప్రయాణ అవసరాలు ఏ మేరకు ప్రతిబింబిస్తాయనే సందేహంగా మారింది. మరోవైపు గతంలో ప్రారంభించిన పనులు నిధుల కొరత కారణంగా నిలిచిపోయాయి. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే తప్ప పనులు ముందుకు సాగే అవకాశం లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి, రైల్వే శాఖకు మధ్య ఏర్పడిన పీటముడి కారణంగా మరికొన్ని ప్రాజెక్టులు ఆగిపోయాయి.

వందే భారత్ సరే...ఇంటర్‌సిటీ ఏదీ...

- సికింద్రాబాద్ నుంచి కాజీపేట్, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, డోర్నకల్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు సాధారణ ప్యాసింజర్ రైళ్లు, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రూ.100 నుంచి రూ.150 వరకు చార్జీ ఉంటుంది. కొత్తగా వచ్చిన వందేభారత్‌లో ప్రయాణం చేయాలంటే వరంగల్ వరకు కనీసం రూ.450 చెల్లించాలి. సికింద్రాబాద్ నుంచి నేరుగా విశాఖకు వెళ్లే ప్రయాణికులకు కూడా చార్జీలు భారమే అయినా సమయాభావాన్ని దృష్టిలో ఉంచుకొంటే వందే భారత్ ప్రయోజనకరమే.
- నాంపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్ల నుంచి 200 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాంతాలకు రైళ్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. గతంలో ప్యాసింజర్‌లుగా నడిచిన రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా పేరు మార్చి చార్జీలు పెంచారు. అదే సమయంలో హాల్టింగ్ స్టేషన్‌లను తగ్గించారు. దీంతో ఉద్యోగ, ఉపాధి అవసరాల కోసం నగరానికి రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటర్‌సిటీ రైళ్లను పెంచాలనే ప్రతిపాదన ఆచరణకు నోచడం లేదు. వందేభారత్ కంటే సామాన్యులకు ఎంతో ముఖ్యమైన ఇంటర్‌సిటీ, ప్యాసింజర్ రైళ్లను ఈ బడ్జెట్‌లోనైనా ప్రవేశపెట్టాలని ప్రయాణికుల సంక్షేమ సంఘాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి.

రెండో దశకు పన్నెండేళ్లు ....

- రాజధాని, శతాబ్ది వంటి సూపర్‌ఫాస్ట్ రైళ్ల కంటే నగరంలో లోకల్ రైళ్లకు ప్రాధాన్యతనివ్వాలని అప్పట్లో కేంద్రం భావించింది, ఈ మేరకు ఎంఎంటీఎస్ రైళ్లను ప్రవేశపెట్టింది. మొదటిదశలో పట్టాలెక్కిన రైళ్లు తప్ప కొత్తగా ఒక్క రైలు కూడా అందుబాటులోకి రాలేదు. పైగా గతంలో రోజుకు 121 సర్వీసులు నడిస్తే ఇప్పుడు వాటిని 78కి తగ్గించారు. ఎంఎంటీఎస్ స్టేషన్‌ల ఆధునికీకరణ ఇంకా ప్రతిపాదనల దశలోనే ఉంది. తాజాగా భారత్ అమృత్ స్టేషన్స్ పథకం కింద హైటెక్ సిటీ, హఫీజ్‌పేట్, లింగంపల్లి స్టేషన్‌లను గుర్తించారు. మిగతా 23 స్టేషన్‌లలో కనీస సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు వంటివి కూడా తగినన్ని లేకపోవడం గమనార్హం.
- సుమారు 12 సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఎంఎంటీఎస్ రెండో దశ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఔటర్‌రింగ్‌రోడ్డుకు ఆనుకొని ఉన్న పలు స్టేషన్‌లతో అనుసంధానమయ్యే రెండో దశ వల్ల రవాణా సదుపాయాలు బాగా విస్తరించే అవకాశం ఉంది. ఆరు మార్గాల్లో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటి వరకు మూడు లైన్‌లు మాత్రం పూర్తయ్యాయి. ఈ మార్గాల్లో నడిపేందుకు రైళ్లు లేక నిరుపయోగంగా ఉన్నాయి.
- నగరంలో నాలుగో టర్మినల్‌గా భావించే చర్లపల్లి స్టేషన్ అభివృద్ధి ఇప్పటి వరకు పూర్తి కాలేదు. పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఇది వినియోగంలోకి వస్తే సికింద్రాబాద్‌పైన ఒత్తిడి తగ్గుతుంది. ప్రస్తుతం ఈ ఒక్క స్టేషన్ నుంచే రోజుకు 200 రైళ్లు నడుస్తున్నాయి.

పుణ్యక్షేత్రాలకు రైళ్లు లేవు..

నగరం నుంచి యాదాద్రికి వెళ్లేందుకు ప్రతిపాదించిన ఎంఎంటీఎస్‌కు ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. రాయగిరి స్టేషన్ అభివృద్ధికి మాత్రం రైల్వేశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్రానికి మధ్య సమన్వయం లేకపోవడంతో ఈ ప్రాజెక్టు అటకెక్కింది. లక్షలాది మంది భక్తులు సందర్శించే యాదాద్రికి ఎంఎంటీఎస్ లేకుండా కేవలం స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే అది అలంకార ప్రాయమే కానుంది.


ఓ మనిషీ.. స్పందించి చూడు!

అద్దం పట్టిన జియాగూడ హత్యోదంతం

- ఘోరాన్ని సెల్‌ఫోన్లలో చిత్రీకరణ
- కళ్లెదుటే దారుణంపై స్పందించని వైనం
- ఈ పరిస్థితికి అనేక కారణాలున్నాయన్న ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం ప్రొఫెసర్ అనిత



వ్యసనంగా మారిన 'వీడియోల వైరల్ కిక్'



సాక్షి, సిటీబ్యూరో: 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు.. మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు' అంటూ ప్రముఖ కవి, వాగ్గేయకారుడు అందెశ్రీ రాసిన గీతం సమాజంలో నానాటికీ అడుగంటుతున్న మానవవతా విలువలకు అద్దం పడుతుంది. ఆదివారం జియాగూడలో జరిగిన దారుణ ఉదంతాన్ని కళ్లకు కడుతుంది. పురానాపూల్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అంబర్‌పేట వాసి జంగం సాయినాథ్‌ను అడ్డగించిన ముగ్గురు దుండగులు దారుణంగా హత్య చేశారు. పట్టపగలు, నడిరోడ్డుపై నరికి చంపుతున్నా స్థానికులు చూస్తూ ఊర్కుకున్నారే తప్ప అడ్డుకోవడానికి ముందుకు రాలేదు. జరుగుతున్న ఘోరాన్ని అనేక మంది వీడియో చిత్రీకరించి వైరల్ చేశారు. ఇటీవల కాలంలో ఇలాంటి ఉదంతాలు అనేక చోటు చేసుకున్నాయి. మనుషుల్లో పెరిగిపోతున్న ఈ ధోరణికి కారణాలపై ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం ప్రొఫెసర్ డాక్టర్ అనిత రాయిరాలను 'సాక్షి' అభిప్రాయం కోరగా.. సమాజంలో ఈ పరిస్థితులు తలెత్తడానికి అనేక కారణాలు ఉన్నాయని ఆమె అన్నారు. తాజా పరిస్థితులపై డాక్టర్ అనిత తన అభిప్రాయాన్ని ఇలా వెలిబుచ్చారు.

సెన్సేషనలిజాన్ని ఆస్వాదించడానికే...

- కళ్లెదుటే జరుగుతున్న ఘోరాన్ని ఆపడానికి బదులు దాన్ని తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించే ధోరణి పెరిగిపోయింది. ఆ వీడియో వైరల్ కావడం వల్ల వచ్చే కిక్, ఆ సెన్సేషనలిజాన్ని ఆస్వాదించడానికి కొందరు ఇలా చిత్రీకరిస్తున్నారు. ఈ వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ లైక్స్, కామెంట్స్, ఫార్వర్డ్స్‌లో తమ సక్సెస్ వెతుక్కునే వాళ్లు పెరిగిపోయారు. స్మార్ట్ ఫోన్ సామాన్యుడి చేతికి రావడంతో ఈ మీడియా పరిధి పెరిగిపోవడం, ఇందులోని అంశాలు వేగంగా విస్తరించడం తదితర కారణాలతో తమ వీడియో వైరల్ కావడం ఓ కిక్‌గా భావిస్తున్నారు. కొన్నింటిని వైరల్ చేస్తూ అందులో ఆనందాన్ని వెతుక్కుంటున్నారు.
- సోషల్‌మీడియాలో ట్రోలర్స్ ఎవరనేది ఎదుటి వారికి తెలీదు. దీంతో వాళ్లు చేసే కామెంట్స్, పోస్టులు నేరుగా వీళ్లపై ప్రభావం చూపదు. ఈ కారణంగానూ ఘోరాలను వీడియో తీసి వైరల్ చేయడం అనే ధోరణి పెరిగిపోయింది. ప్రస్తుత విద్యా వ్యవస్థ మార్కులు, ర్యాంకుల ఆధారితంగా మారిపోయింది. ఈ పరిస్థితులు మారాలంటే కుటుంబ వ్యవస్థ బలంగా ఉండాలి. తల్లిదండ్రులు, చదువు చెప్పే గురువులు ఆ కోణంలో కృషి చేయాల్సిన అవసరం ఉంది. సామాజిక బాధ్యతలు, విలువలు విద్యలో భాగంగా మారాలి. ప్రతి వ్యక్తి జీవితంలో రోల్ మోడల్స్‌ను ఎంచుకునే విధానం మారాలి. అలా ప్రతి ఒక్కరూ కృషి చేస్తేనే ఫలితాలు ఉంటాయి.

హీరోయిజానికి అర్థం మారిపోయింది..

- ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలు, వాటి విలువలు తగ్గాయి. మనుషులను బట్టే సమాజం కూడా ఉంటుంది. అనేక మంది ఇళ్లల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి ఒక్కరిలో స్వార్థం పెరిగిపోవడంతో ఎదుటి వారికి సహాయం చేస్తే నాకేంటి లాభం అని ఆలోచిస్తున్నారు. గతంలో వీరికి సహాయం అవసరమైనప్పుడు ఎవరూ ముందుకు రాకపోవడమూ ఈ ధోరణికి ఓ కారణమే.
- సినిమాలు, మీడియా తదితరాలను కూడా సక్సెస్ అంటే ఉన్నత స్థితికి చేరడం, డబ్బు సంపాదించడం అంటూ.. హీరోయిజమంటే ఎదుటి వారిని కొట్టడం అన్నట్లు చూపిస్తున్నాయి. ఇలాంటి వారికి లభిస్తున్న ప్రచారం పది మందికి సహాయపడిన, పడుతున్న వారికి లభించట్లేదు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దెబ్బతినడం కూడా మానవ సంబంధాలు, అనుబంధాలు, ఆప్యాయతలు తగ్గిపోవడానికి కారణమైంది. వీటితో పాటు సమాజంలో నిత్యం జరుగుతున్న నేరాలు చూడటం అలవాటు పడిన వాళ్లు తమ కళ్ల ముందే ఘోరం జరుగుతున్నా స్పందించట్లేదు.



నిలిచిపోయిన సెర్చ్ ఆపరేషన్

సికింద్రాబాద్ 'డెక్కన్' భవనంలో అగ్ని ప్రమాద ఘటన

- శిథిలాలను తొలగించే పరిస్థితి లేక సందిగ్ధావస్థ
- ఎఫ్ఎస్ఎల్‌కు మృతుల బంధువుల రక్త నమూనాలు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్‌లో అగ్ని ప్రమాదం జరిగిన డెక్కన్ భవనంలో సెర్చ్ ఆపరేషన్ నిలిచిపోయింది. ఈ నెల 19వ తేదీన ఆరు అంతస్తుల ఈ భవనంలో అగ్ని ప్రమాదం జరిగిన విషయం విదితమే. అదే రోజు డెక్కన్ నిట్‌వేర్‌లో పనిచేసే జునైద్, జహీర్, వాసిం భవనంలోకి వెళ్లి కనిపించకుండా పోయారు. మూడు రోజులుగా పాటు ఫైర్, డీఆర్‌ఎఫ్, పోలీసులు భవనం మొత్తం జల్లెడ పట్టి గాలించారు. ఈ నెల 21వ తేదీన భవనంలోని మొదటి అంతస్తులో ఒకరి మృతదేహం ఆనవాళ్లు మాత్రమే బయటపడ్డాయి. ఆదివారం కూడా అధికారులు గల్లంతైన వారి కోసం భవనం మొత్తం గాలించారు. కానీ ఎవరి ఆచూకీ లభించడలేదు.

- భవనం వెనుక వైపు గ్రౌండ్ నుంచి మూడో అంతస్తు వరకు శ్లాబులు కూలిపోయి శిథిలాలు మొత్తం మొదటి సెల్లార్‌లో పడ్డాయి. వాటి కిందే మృతదేహాలు ఉంటాయనే అనుమానాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పెద్ద శిథిలాలను కదిలించే పరిస్థితి లేకపోవడంతో ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. జేసీబీ లాంటి యంత్రాలను తీసుకుని వెళ్లే పరిస్థితి కూడా లేదు. దీంతో సోమవారం కూడా అధికారులు భవనం లోపలికి వెళ్లలేదు.
- భవనం లోపల సెర్చ్ ఆపరేషన్ చేసేందుకు ఫైర్, పోలీసు అధికారులు భయపడుతున్నారు. దీంతో ఇప్పుడు ఉన్నతాధికారుల ఆదేశాల కోసం వేచిచూస్తున్నారు. కానీ గల్లంతైన వారి బంధువులు మాత్రం తమవారి ఆచూకీ తెలిసేంత వరకు భవనం కూల్చివేయవద్దని అంటున్నారు. దీంతో అధికారులు సందిగ్ధావస్థలో పడ్డారు.
- ఆచూకీ దొరకని జునైద్, వాసీం, జహీర్‌ల బంధువులను సోమవారం రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్‌రావు పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. వారి రక్త నమూనాల కోసం వివరాలు సేకరించి వారిని ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. ఎఫ్ఎస్ఎల్‌లో డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి ఇటీవల దొరికిన మృతదేహం ఎవరిది అనే విషయాన్ని నిర్ధారించనున్నారు.

పురసారథులకు 'పరీక్ష'

- ఎల్లుండితో ముగియనున్న పదవీ కాలం
- మున్సిపల్ చట్టంలో మూడేళ్ల తర్వాతే అవిశ్వాసం
- నాలుగేళ్లకు సవరిస్తూ బిల్లు చేసిన ప్రభుత్వం
- గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఫైల్



సాక్షి, రంగారెడ్డిజిల్లా/ మేడ్చల్‌జిల్లా: నగర/పురపాలికల్లో క్యాంపు రాజకీయాలకు తెరలేస్తోంది. మూడేళ్ల పదవీకాలం ముగియనుండటంతో అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టే దిశగా పావులు కదులుతున్నాయి. ఇందుకు వ్యూహరచన చేస్తుండటంతో ప్రస్తుత పాలక వర్గాలు పదవిని కాపాడుకునేందుకు.. వైరి వర్గం కుర్చీ దక్కించుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. నగర, పురపాలక సంఘాల్లో అవిశ్వాస పరీక్షలకు మూడేళ్ల కాల పరిమితిని విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పురపాలక చట్టంలో పొందుపర్చింది. దీన్ని నాలుగేళ్లకు సవరిస్తూ గత ఏడాది అసెంబ్లీలో బిల్లును ఆమోదించింది. గవర్నర్ తమిళిసై పరిశీలనకు వెళ్లిన ఈ బిల్లుకు ఇప్పటికీ మోక్షం లభించలేదు. దీంతో పాత చట్టమే మనుగడలో ఉందని భావిస్తున్న అసంతృప్తి నేతలు, అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టేందుకు పావులు కదుపుతున్నారు. నగర/పురపాలక సంఘాలు పగ్గాలు చేపట్టి ఈ నెల 26 నాటికి మూడేళ్లు ముగుస్తున్నందున ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని పురపాలికలపై కన్నేసిన ఆశావహులు ఎత్తులు వేస్తున్నారు. గడువు సమీపిస్తుండటంతో కొంతకాలంగా విందు, విహార యాత్రలతో బిజీగా ఉన్న ఈ నేతలు మరిన్ని వ్యూహాలు రచిస్తున్నారు. నగర శివారులోని దాదాపు మెజారిటీ మున్సిపాలిటీల్లో అవిశ్వాస పరీక్షలు పెట్టే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

రంగారెడ్డి జిల్లాలో..

- ఆదిబట్ల, తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల్లో అవిశ్వాస పరీక్షలు పెట్టేందుకు అసంతృప్తి నేతలు పావులు కదుపుతున్నారు. గతంలో పదవీ కాలం ఒప్పందాలు కుదుర్చుకున్న సభ్యులు కూడా పట్టు వీడకపోవడంతో కొన్ని చోట్ల విశ్వాస పరీక్షలకు దారితీస్తోంది. ఇంకొన్ని చోట్ల పదవీ నుంచి దిగేందుకు ససేమిరా అనడం కూడా ఈ పరిస్థితులకు కారణంగా మారుతోంది.
- తుర్కయంజాల్‌లో మెజార్టీ కౌన్సిలర్లను గెలుచుకున్న కాంగ్రెస్.. రెండు వర్గాలుగా విడిపోయింది. పదవుల పంపకంపై ఇరుపక్షాలు బెట్టు దిగకపోవడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. ఇదే సీను ఇబ్రహీంపట్నం పురపాలికలోనూ కనిపిస్తోంది. గులాబీ శిబిరంలో కీచులాటలతో చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్లు ఏకంగా కలెక్టర్‌కే ఫిర్యాదు చేశారు. అవినీతి ఆరోపణలు సంధిస్తూ ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. తాజాగా మూడేళ్ల కాలపరిమితి ముగియడంతో ఇదే అదనుగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అంశంపై మంతనాలు సాగిస్తున్నారు.
- మరోవైపు ఆదిబట్ల మున్సిపాలిటీలో అధికార పార్టీలో చేరి చైర్‌పర్సన్ పదవిని కాంగ్రెస్ కౌన్సిలర్ దక్కించుకున్నారు. అనంతరం జరిగిన పరిణామాలతో స్థానిక ఎమ్మెల్యేలతో చైర్‌పర్సన్‌కు పొసగడంలేదు. దీంతో ఆమెను గద్దె దింపే దిశగా ఎమ్మెల్యే వర్గీయులు చక్రం తిప్పుతున్నారు. నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలు.. బండ్లగూడ నగర పాలక సంస్థలోనూ చైర్మన్‌గిరీ విషయంలో మడతపేచీ నెలకొంది. ఇక్కడ కూడా రెండున్నరేళ్ల చొప్పున పదవిని పంచుకోవాలనే ఒప్పందానికి వచ్చారు. తాజా పరిణామాలతో పోస్టు నుంచి తప్పుకొనేందుకు నో చెబుతుండడంతో రాజకీయం ఉత్కంఠగా మారింది.

మేడ్చల్ జిల్లాలో..

- మేడ్చల్ జిల్లాలో నిజాంపేట్, బోడుప్పల్, జవహర్‌నగర్, పీర్జాదిగూడ, మున్సిపల్ కార్పొరేషన్లలో అధికార పార్టీ సభ్యులే వైరి వర్గాలుగా విడిపోయారు. ప్రస్తుత పాలక వర్గాలకు మూడేళ్లు పూర్తి కావడంతో పీఠం దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.
- బోడుప్పల్ కార్పొరేషన్‌లోనూ అవిశ్వాస పరీక్షకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. మేడ్చల్ మున్సిపాలిటీలో కొంత కాలంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తీరుపై అధికార పార్టీ కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోనూ అధికార పార్టీలోని ఇరు వర్గాలు నువ్వా నేనా అన్నట్లుగా అవిశ్వాసానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. నాగారం మున్సిపాలిటీలో చైర్మన్‌పై అవిశ్వాసానికి అంతర్గతంగా పావులు కదుపుతున్నట్లు అధికార పార్టీ కౌన్సిలర్లలోనే చర్చ జరుగుతోంది. దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దుండిగల్, కొంపెల్లి మున్సిపాలిటీల్లోని బీఆర్‌ఎస్‌లో విబేధాలు భగ్గుమంటున్నాయి.

పదే పదే టెండర్లు

- స్ట్రీట్ సైనేజ్ పోల్స్ కోసం ముందుకు రాని ఏజెన్సీలు
- పట్టువీడని ప్రకటనల విభాగం
- ఈసారి 5 వేల జంక్షన్లలో ఏర్పాటుకు సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ప్రకటనల విభాగం స్ట్రీట్ సైనేజ్‌పోల్స్ ఏర్పాటు కోసం డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్ఓటీ) విధానంలో కాంట్రాక్టు ఏజెన్సీల నుంచి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజనల్ (ఆర్ఎఫ్‌పీ) రూపంలో టెండర్లు కోరుతున్నప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదు. కేవలం దుకాణానికి దారి చూపే బాణం గుర్తుగా మాత్రమే పనికి వచ్చే ఈ సైనేజీలతో ప్రకటనల ఆదాయం రాదనే అవగాహనతో వీటి ఏర్పాటుకు కాంట్రాక్టు ఏజెన్సీలు ముందుకు రావడం లేదు. పట్టిన పట్టు వీడనన్నట్లు జీహెచ్‌ఎంసీ ప్రకటనల విభాగం మాత్రం ఏడాదికోసారి వీటి ఏర్పాటుకు ఆర్ఎఫ్‌పీల పేరిట టెండర్లు పిలుస్తోంది. గడచిన రెండేళ్లలో ఒకసారి 3 వేల జంక్షన్లలో ఏర్పాటు చేయాలనుకున్నారు. రెండోసారి కనీసం అయిదొందల ప్రాంతాల్లో ఏర్పాటు చేసి చూద్దామనుకున్నారు. ప్రస్తుతం ఏకంగా 5 వేల జంక్షన్లలో ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ఈ స్ట్రీట్‌సైనేజీ పోల్స్‌ను ఏర్పాటుచేసే కాంట్రాక్టు ఏజెన్సీలు దగ్గరలోని వారసత్వ భవనానికో, ప్రభుత్వ కార్యాయానికో దారి చూపుతూ జంక్షన్‌లో ఏర్పాటు చేసే పోల్ పైభాగంలో బాణం గుర్తుతో ఒక సైనేజీని ఉంచుతుంది. దానికి దిగువన తక్కువ సైజులో దగ్గర్లోని అయిదారు వ్యాపార సంస్థలకు దారిచూపేలా సైనేజీలు ఏర్పాటు చేసుకోవచ్చు. అందుకుగాను ఏజెన్సీలు వాటి నుంచి ప్రకటల అద్దె వసూలు చేసుకోవచ్చు. చిన్న సైజులో బాణం గుర్తుగా మాత్రమే ఉపకరించే ఈ సైనేజీల వల్ల పెద్ద వ్యాపార సంస్థలకు ప్రయోజనం ఉండదు. పెద్ద వ్యాపార సంస్థలకు బాణం గుర్తుతో దారి చూపాల్సిన పనిలేదు. అవే ల్యాండ్‌మార్క్‌గా ఉన్నాయి. తమ దుకాణాలు కనిపించకుండా ఉండే, తమ దుకాణానికి పెద్ద బోర్డులు లేని చిన్న వ్యాపారులకు ఈ స్ట్రీట్‌సైనేజ్ పోల్స్ కొంత వరకు ఉపయోగపడవచ్చు కానీ వారు ప్రకటనల ఫీజులు చెల్లించే స్థాయిలో ఉండరని కాంట్రాక్టు ఏజెన్సీలు భావిస్తున్నాయి. అందువల్లే గతంలో ఏర్పాటుకు ఏజెన్సీలు ముందుకురాలేదు. ఈసారి ప్రీబిడ్ సమావేశం కూడా నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నా, ఈసారైనా వారి ప్రయత్నం ఫలిస్తుందో, లేదో వేచి చూడాల్సిందే. ఏదో ఒక విధంగా ఆదాయం పొందుదామనే తలంపుతోనే పదేపదే టెండర్లు ఆహ్వానిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

12 ప్యాకేజీలుగా..

జీహెచ్‌ఎంసీలో ఆరు జోన్లుండగా, జోన్‌కు రెండు ప్యాకేజీల వంతున ఆర్ఎఫ్‌పీలు ఆహ్వానించారు. ఒక్కో జోన్‌లో దాదాపు 460 పోల్స్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. కాంట్రాక్టు ఒప్పందం పదేళ్లు అమల్లో ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

సెర్బియా జైల్లో సిటీ వ్యాపారి

- 2020లో బిజినెస్ వీసాపై వలసవెళ్లిన ఫెరోజ్ ఖాన్
- పది నెలల క్రితం అరెస్టు చేసిన అక్కడి పోలీసులు
- నగరంలోని తల్లిదండ్రులకూ సమాచారం లేదు
- విదేశాంగ శాఖ జోక్యం చేసుకోవాలంటున్న సోదరుడు
- ఆరా తీస్తున్న హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు



సాక్షి, సిటీబ్యూరో: నగరం నుంచి వ్యాపార నిమిత్తం సెర్బియాకు వలసవెళ్లిన ఫెరోజ్ ఖాన్ అక్కడి జైల్లో మగ్గుతున్నాడు. పది నెలలుగా ఆయన విషయంపై సిటీలో ఉంటున్న తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారం లేదు. సెర్బియాలోనే స్థిరపడిన ఫెరోజ్ సోదరి ఆరా తీయగా జైల్లో ఉన్న విషయం బయట పడింది. నేరుగా జోక్యం చేసుకోవడానికి అక్కడి భారత రాయబార కార్యాలయం నిరాకరించడంతో సహాయం చేయాల్సిందిగా కోరుతూ ఫెరోజ్ సోదరుడు నూమన్ హుస్సేన్ జునైదీ విదేశాంగ శాఖకు లేఖ రాశాడు. హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన అధికారులు సోమవారం ఫెరోజ్ ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు.

బెల్గ్రేడ్‌లో రెస్టారెంట్ ఏర్పాటు చేసి..

ఫస్ట్ లాన్సర్‌లోని ఖాజానగర్ ప్రాంతానికి చెందిన ఫెరోజ్ ఖాన్ (44) తండ్రి మాజీ ప్రభుత్వ ఉద్యోగి. ప్రస్తుతం తండ్రి, తల్లి కూడా అనారోగ్య కారణాలతో మంచానికే పరిమితయ్యారు. పదిహేనేళ్ల క్రితం భార్య నుంచి విడాకులు తీసుకున్న ఫెరోజ్ అప్పటి నుంచి ఒంటరిగానే జీవిస్తున్నారు. సెర్బియాలో రెస్టారెంట్ ఏర్పాటు చేయాలని భావించిన ఫెరోజ్ బిజినెస్ వీసాపై 2020లో అక్కడికి వలస వెళ్లాడు. బెల్గ్రేడ్‌లో ఉన్న బ్రాంకోవా-19లో ఇండో-అరబ్ పేరుతో రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. భారత్‌తో పాటు బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల నుంచి వెళ్లి సెర్బియాలో స్థిరపడిన వారు ఫెరోజ్ రెస్టారెంట్‌కు రెగ్యులర్ కస్టమర్లుగా ఉండే వాళ్లు.

నాటకీయ పరిణామాల మధ్య మిస్సింగ్...

సెర్బియా నుంచి అనునిత్యం నగరంలో ఉన్న తల్లిదండ్రులతో మాట్లాడే ఫెరోజ్ ఆఖరుసారిగా గతేడాది మార్చి 10న కాల్ చేశాడు. అప్పటి నుంచి ఆయన ఫోన్లు పని చేయకపోవడంతోపాటు ఆచూకీ లేదు. దీంతో ఇక్కడ ఉన్న తల్లిదండ్రులు కొన్నాళ్లు ఎదురుచూశారు. చివరకు సెర్బియాలో ఉన్న ఫెరోజ్‌కు సోదరి వరుసయ్యే మహిళను సంప్రదించారు. బ్రాంకోవాలోని ఇండో-అరబ్ రెస్టారెంట్ వద్దకు వెళ్లిన ఆమె అది చాన్నాళ్ల క్రితమే మూతపడినట్లు గుర్తించింది. చుట్టుపక్కల ఆరా తీయగా గతేడాది మార్చి 9న రెస్టారెంట్‌లో కొందరు భారతీయులు-బంగ్లాదేశీయుల మధ్య గొడవ జరిగిందని, వారికి ఫెరోజ్ సర్దిచెప్పాడని, ఆ మర్నాడే అక్కడి పోలీసులు అతడిని అరెస్టు చేశారని తెలిసింది. ఈ విషయం నగరంలో ఉన్న ఫెరోజ్ తల్లిదండ్రులకు చెప్పిన ఆమె... సెర్బియాలో ఉన్న భారత రాయబార కార్యాలయాన్నీ సంప్రదించింది.

ఢిల్లీ నుంచి ఉత్తర్వులు రావాలనడంతో...

అక్కడి జైల్లో మగ్గుతున్న ఫెరోజ్ వివరాలు ఆరా తీయడానికి నిరాకరించిన రాయబార కార్యాలయం తాము జోక్యం చేసుకోవాలంటే ఢిల్లీలోని భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) నుంచి ఆదేశాలు రావాలని స్పష్టం చేసింది. ఈ విషయం తెలుసుకున్న ఫెరోజ్ సోదరుడు, ఆలియాబాద్ వాసి నూమన్ శుక్రవారం భారత విదేశాంగ శాఖకు లేఖ రాశారు. దీనికి సంబంధించి ఎంబీటీ పార్టీ నేత అమ్జదుల్లా ఖాన్ ఎంఈఏకు ట్వీట్ చేస్తూ ఫెరోజ్‌పై సెర్బియాలో నమోదైన కేసు వివరాలు తెలుసుకోవాలని కోరారు. ఆయనకు న్యాయం చేయడంతో పాటు భారత్‌కు రప్పించడానికి ప్రయత్నించాలని విజ్ఞప్తి చేశారు. నూమన్ 'సాక్షి'తో మాట్లాడుతూ... 'ఫెరోజ్ జైల్లో ఎందుకు ఉన్నాడో తెలీదు. దీనిపై అక్కడి పోలీసులు కనీసం అతడి తల్లిదండ్రులకూ సమాచారం ఇవ్వలేదు. విదేశాంగ శాఖకు ఫిర్యాదు చేసిన తర్వాత స్పందన మొదలైంది. హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు వచ్చి పూర్తి వివరాలు తీసుకున్నారు. ప్రభుత్వం స్పందించి ఫెరోజ్‌కు న్యాయం చేయాలని కోరుతున్నా' అన్నారు.

నగరంలో నేడు

- సీల్‌వెల్ సినీ సన్వరాలు-29లో భాగంగా యుగపురుషుడు ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు, ఎన్టీఆర్ సిల్వర్ క్రౌన్ అవార్డ్స్-2023 కార్యక్రమం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రవీంద్రభారతిలో జరుగుతుంది.
- ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సామాజిక న్యాయం అంశంపై ఉదయం 10.30 గంటలకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సమావేశం జరుగుతుంది.
- వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటలకు లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో సమావేశం జరుగుతుంది.

హత్య కేసులో నిందితుడి రిమాండ్



నిందితుడు శ్రీకాంత్‌రెడ్డి

మేడిపల్లి: హత్య కేసులో నిందితుడిని సోమవారం మేడిపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్‌గిరి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లాకు చెందిన లోక వెంకటరమణ మూర్తి పీర్జాదిగూడ, బీబీ సాహెబ్ మక్త అమృత కాలనీలో ఓల్డ్ ఏజ్ కేర్ టేకర్‌గా పని చేస్తున్నాడు. కొన్నేళ్లుగా ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న అతను గత కొంత కాలంగా ఆమెతో కలిసి ఉంటున్నాడు. కాగా తల్లి కోసం అన్వేషిస్తున్న సదరు మహిళ కుమారుడు కొండ శ్రీకాంత్‌రెడ్డి ఫేస్ బుక్ ద్వారా తల్లి ఆచూకీ తెలుసుకుని నగరానికి వచ్చాడు. ఆమెను ఒప్పించి విశాఖపట్నం తీసుకెళ్లాడు. అయితే వెంకట రమణ మూర్తి ఆమె తనతోనే ఉండాలని తరచూ ఫోన్ చేసి వేధిస్తున్నాడు. అతను తన తల్లిని వదిలేలా లేడని భావించిన శ్రీకాంత్‌రెడ్డి పథకం ప్రకారం వైజాగ్‌లో కత్తి కొనుగోలు చేసి బ్యాగ్‌లో పెట్టుకుని రమణమూర్తి ఇంటికి వచ్చాడు. అమ్మని రమ్మని చెబుతానని అతడిని నమ్మించాడు. అనంతరం ఇద్దరు కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులో ఉన్న వెంకట రమణమూర్తిని సిలిండర్‌తో మోది, కత్తితో పొడవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందడంతో మేడిపల్లి పోలీసులు శ్రీకాంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. తన తల్లితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఆమెను తమ కుటుంబానికి దూరం చేసినందుకే హత్య చేసినట్లు అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

వరుసబెట్టి దోచేశారు..

- అర్ధరాత్రి 13 ఇళ్లలో దొంగతనాలు
- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- అందినకాడికి దోచుకుని పరారీ



చెల్లాచెదురైన వస్తువులు

భాగ్యనగర్‌కాలనీ: తాళం వేసిన ఇళ్లపై రెక్కీ నిర్వహించిన దొంగలు అర్ధరాత్రి తాళాలు పగలగొట్టి ఏకంగా 13 ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి ఓ దొంగల ముఠా విడిపోయి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దయార్‌గూడ, కేరళబస్తీ, దేవీనగర్ ప్రాంతాల్లో తాళాలు పగలగొట్టి ఇళ్లలోకి చొరబడ్డారు. ఇళ్లలోని వస్తువులను చిందరవందర చేసి అందినకాడికి దోచుకెళ్లారు. ఓ ఇంట్లో గల్లాపెట్టెలో ఉన్న రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లగా మరో ఇంటిలో వెండి పట్టా గొలుసులు, ఒక ఇంట్లో ల్యాప్‌టాప్ ఇలా దొరికిన వస్తువును ఎత్తుకెళ్లారు. చోరీలు జరిగిన ఇళ్ల యజమానులు అందుబాటులో లేకపోవటంతో ఎవరింట్లో ఎంత సొత్తు అపహరణకు గురైందో వివరాలు తెలియలేదు. యజమానులు ఊళ్ల నుంచి తిరిగి వస్తేనే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పోలీసులు మాత్రం 9 ఇళ్లల్లో తాళాలు పగలగొట్టినట్లు తమకు సమాచారం అందినట్లు తెలిపారు. పోలీసులు, క్లూస్ టీం సిబ్బంది దొంగతనాలు జరిగిన ఇళ్లను పరిశీలించి ఆధారాలు సేకరించారు. సీసీ పుటేజీల ఆధారంగా అర్ధరాత్రి 2 నుంచి 4 గంటల సమయంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడిన ట్లు నిర్ధారణకు వచ్చారు. ముందుగానే రెక్కీ నిర్వహించి దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సీసీ కెమెరాలో నిందితుల చిత్రాలు

కార్పొరేటర్ పరిశీలన

దయార్‌గూడ, కేరళబస్తీ, దేవీనగర్‌లలో దొంగతనాలు జరిగిన ఇళ్లను సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా దొంగలను పట్టుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, సీఐ నర్సింగ్‌రావు, నాయకులు బొట్టు విష్ణు, సంతోష్, రాము, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుమారుడి మరణాన్ని తట్టుకోలేక..

ఉరి వేసుకుని తల్లి ఆత్మహత్య



కలమ్మ మృతదేహం

మైలార్‌దేవ్‌పల్లి: కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేని ఓ తల్లి మనస్తాపంలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నయీం కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కొత్త కలమ్మ(39), సత్తయ్య దంపతులు మైలార్‌దేవ్‌పల్లి రాజీవ్‌గృహకల్పలో నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు లక్ష్మణ్ గత సంవత్సరం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పటినుంచి మనోవేదనకు లోనైన కలమ్మ సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

తండ్రే బాధ్యుడంటూ బాలుడి ఫిర్యాదు



మృతురాలు సబిత

కంటోన్మెంట్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సబిత, సుదర్శన్ యాదవ్ దంపతులు ఓల్డ్ బోయిన్‌పల్లి మణికంఠ కాలనీలో నివాసముంటున్నారు. వీరికి గౌతమ్ యాదవ్ (15), లోకేశ్ (13) ఇద్దరు కుమారులు. వీరి సమీప బంధువు నవీన్ కూడా వీరితో పాటే ఉండేవాడు. మద్యానికి బానిసైన సుదర్శన్ యాదవ్ ఆవారాగా తిరిగేవాడు. సబిత టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. సుదర్శన్ తరచూ తాగి వచ్చి భార్య వేధించేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికొచ్చిన సుదర్శన్ భార్యతో గొడవ పెట్టుకున్నాడు. ఒడి బియ్యం కోసం ఆమె సోదరుడి ఇంటికెళ్లొద్దని హెచ్చరించాడు. భోజనం అనంతరం సబిత, సుదర్శన్ దంపతులు చిన్న కుమారుడు లోకేశ్‌తో కలిసి బెడ్‌రూమ్‌లో నిద్రపోయారు. పెద్ద కుమారుడు గౌతమ్, బంధువు నవీన్ హాల్‌లో నిద్రించారు. తెల్లవారుజామున లోకేశ్ ఏడుపుతో మెలకువ వచ్చిన నవీన్, గౌతమ్ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా సబితను కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. దీంతో ఆమెను స్థానిక రమ్య ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే సబిత మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన తల్లి సబిత మృతికి కారకుడైన తండ్రి సుదర్శన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గౌతమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం



రోహిత్ మనోజ్

లక్డీకాపూల్ : సాయంత్రం సరదాగా బయటికి వెళ్లి వస్తానని చెప్పిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. యువకుడి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామంతాపూర్ ప్రాంతానికి చెందిన రోహిత్ మనోజ్ (19)(బబ్లూ) ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు అతడి కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో అతడి మేనమామ బోడపాటి శ్రీనివాసరావు ఉప్పల్ పోలీసులను ఆశ్రయించాడు. ఇంటినుంచి బయటికి వెళ్లిన సమయంలో రోహిత్ మనోజ్ నలుపు రంగు దుస్తులు ధరించి ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అతని వద్ద ఫోన్ కూడా లేదని ,కేవలం స్టూడెంట్ బస్ పాస్ మాత్రమే ఉందన్నారు. అతడి ఆచూకీ తెలిస్తే 9493106929, 9912199554, 98661311010 నంబర్లకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక కోర్సు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వేదికగా సోమవారం రియల్టర్ ఆక్సిజన్, మలేషియన్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ బిజినెస్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో రియల్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ కోర్సుల అభివృద్ధి కోసం భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీ నటుడు మురళీ మోహన్, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, రియల్టర్ ఆక్సిజన్ సీఈఓ నంది రామేశ్వరరావు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ.కే.సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంచుల గోదాంలో అగ్ని ప్రమాదం..

కుత్బుల్లాపూర్ : ప్లాస్టిక్ సంచుల గోదాంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంఘటన సోమవారం దూలపల్లిలో జరిగింది. పేట్‌బషీరాబాద్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దూలపల్లిలోని బీఎస్ఆర్ పాలిమర్స్‌లో ప్లాస్టిక్ సంచులు తయారు చేస్తున్నారు. సోమవారం రాత్రి ఒక్కసారిగా పరిశ్రమలో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు రెండు ఫైర్ ఇంజన్లతో మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. జీడిమెట్ల ఫైర్ అధికారి సుభాష్ రెడ్డి, పేట్ బషీరాబాద్ సీఐ ప్రశాంత్, ఎస్సై రామనారాయణ సిబ్బంది పరిస్థితిని సమీక్షించారు. కంపెనీ నిర్వాహకులు బ్రహ్మారెడ్డి, సుదర్శన్‌లపై కేసు నమోదు చేశామని, పరిశ్రమల అనుమతులను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భారీగా నగదు స్వాధీనం

- రెండు కార్లలో తరలిస్తుండగా పట్టివేత
- ఆధారాలు లేకపోవడంతో ఐటీ అధికారులకు అప్పగింత

సనత్‌నగర్: రెండు కార్లలో పెద్ద మొత్తంలో నగదును తరలిస్తుండగా బేగంపేట పోలీసులు పట్టుకున్నారు. సోమవారం మధ్యాహ్నం గ్రీన్‌ల్యాండ్ వైపు నుంచి బేగంపేట మీదుగా సికింద్రాబాద్ వైపు భారీగా నగదుతో రెండు కార్లు వెళ్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ప్రకాష్‌నగర్ వద్ద కాపు కాసిన పోలీసులు తనిఖీలు నిర్వహించగా రెండు కార్లలో నగదు వెలుగుచూసింది. పట్టుబడిన నగదు దాదాపు రూ. 4 కోట్ల వరకు ఉండవచ్చునని అంచనా. ఈ డబ్బు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తుందనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇందుకు సంబంధించి వెంకటేశ్వర్లు, ప్రశాంత్, విపులచౌదరిలను అదుపులోకి తీసుకుని విచారించగా నగదు రుతుప్రియ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించినదిగా చెప్పినట్లు సమాచారం. నగదు లావాదేవీలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో హవాలా డబ్బుగా పోలీసులు నిందితులతో సహా నగదును ఐటీ అధికారులకు అప్పగించారు.

మోడలింగ్‌లో అవకాశాలు ఇప్పిస్తానంటూ..

- రూ. 14 లక్షలు టోకరా
- ఘరానా మోసగాడి అరెస్ట్



అపూర్వ అశ్విన్ దొడ

సాక్షి,సిటీబ్యూరో: మోడలింగ్ పేరుతో ప్రముఖ మాల్స్‌లో ర్యాంప్ షోలు నిర్వహించి, ప్రముఖ యాడ్స్‌లో సినీ తారలు, క్రికెటర్లతో కలిసి నటించే అవకాశాలు కల్పిస్తానని అమాయకులకు టోకరా వేస్తున్న ఘరానా మోసగాడిని సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ర్యాంప్ షోలో పాల్గొనే వారితో మేకప్ ఛార్జీలు, కాస్ట్యూమ్స్ ఇతర ఉపకరణాల పేరుతో ఖాతాలలో డబ్బు జమ చేయించుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముంబైకి చెందిన అపూర్వ అశ్విన్ దొడ అలియాస్ అర్మాన్ అర్జున్ కపూర్ గతంలో రెండు బాలీవుడ్ సినిమాల్లో నటించాడు. కాస్మోపాలిటన్ మోడల్స్ ఏజెన్సీ ఏర్పాటు చేసిన అతను చైల్డ్ మోడలింగ్ షోలు నిర్వహించేవాడు. ఈ నేపథ్యంలో మదీనా గూడకు చెందిన గోపాలకృష్ణన్ కృష్ణానంద్ కుమార్తెను తాను నిర్వహించిన షోలో ఎంపిక చేశాడు. అనంతరం ఆమెకు ప్రముఖ టాలీవుడ్ హీరోయిన్‌తో కలిసి యాడ్‌లో నటించే అవకాశం కల్పిస్తానని నమ్మించాడు. ఇందుకుగాను క్యాస్టూమ్స్, షూటింగ్ పేరుతో పలు దఫాలుగా రూ.14 లక్షలు తన ఖాతాలో జమచేయించుకున్నాడు. అయితే తన కుమార్తెకు అవకాశం కల్పించకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం నిందితుడిని అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.15.60 లక్షల నగదు, 4 యాపిల్ ఫోన్లు, ల్యాప్‌ట్యాప్, 3 సిమ్ కార్డులు, 2 ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఇప్పటికే ముంబైలోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు.

స్నేహితులే ప్రాణం తీశారు..

- జియాగూడ హత్య కేసులో నిందితుల అరెస్ట్
- ఆర్థిక విబేధాలే కారణంగా గుర్తింపు



పోలీసుల అదుపులో నిందితులు

జియాగూడ,అఫ్జల్‌గంజ్: నగరంలో సంచలనం సృష్టించిన దారుణ హత్య కేసును పోలీసులు చేధించారు. చిన్ననాటి స్నేహితులే పథకం ప్రకారం కత్తులు, కొడవలి, రాడ్‌తో విచక్షణా రహితంగా దాడి చేసి అంతమొందించినట్లు గుర్తించారు. కుల్సుంపురా పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.

డబ్బుల విషయంలో గొడవ..

కోఠి ఇసామియా బజార్‌కు చెందిన జంగం సాయినాథ్, జియాగూడ డబల్ బెడ్‌రూంలకు చెందిన ఆకాష్ 6 నుంచి 10వ తరగతి వరకు కలిసి చదువుకున్నారు. వీరు ప్రాణ స్నేహితులు కూడా. అలాగే ఆకాష్ స్నేహితులు సంజయ్ నగర్‌కు చెందిన టిల్లు అలియాస్ సాయికుమార్ యాదవ్, ఇంద్రనగర్‌కు చెందిన సోనూ కూడా వీరికి స్నేహితులు. ఇటీవల డబ్బుల విషయంలో తలెత్తిన వివాదం వారి మధ్య గొడవకు దారితీసింది. ఈ నేపథ్యంలో పథకం ప్రకారం ఆకాష్, టిల్లు, సోనూ ఆదివారం సాయంత్రం అంబర్‌పేట్‌లో ఉంటున్న సాయినాథ్‌ను మాట్లాడేందుకు రావాలని పిలిచారు. బైక్‌పై వస్తున్న సాయినాథ్‌ను జాతీయ రహదారిపై అడ్డగించి అతడితో గొడవపెట్టుకుని విచక్షణ రహితంగా కొడవలి, రాడ్లతో దాడి చేసి హత్య చేశారు.

సీసీ పుటేజీ ఆధారంగా నిందితుల గుర్తింపు

హత్య సంఘటనను కొందరు వ్యక్తులు సెల్‌ఫోన్లలో చిత్రీకరించడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ దృశ్యాలను వీక్షించిన జియాగూడ వాసులు నిందితులు ఆకాష్, టిల్లు, సోనులుగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పారిపోతున్న నిందితులను సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

భాగ్యనగర్‌కాలనీ: గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేయగా ఇద్దరు పరారైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ నర్సింగరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇంద్రారెడ్డినగర్, కొల్లూరులో ఉంటున్న నూక దీపక్ క్యాటరింగ్ పనిచేస్తున్నాడు. ప్రకాష్‌నగర్‌కు చెందిన నరేష్ ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తుండగా, బోయ మల్లేష్ కూలీ పని చేస్తున్నాడు. వీరి ముగ్గురితో పాటు జగద్గిరిగుట్టకు చెందిన అజయ్, సాయిలు ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వ్యక్తి నుంచి 5 కిలోల గంజాయిని కొనుగోలు చేసి నగరానికి తీసుకువచ్చారు. సికింద్రాబాద్ నుంచి బస్సులో కూకట్‌పల్లి బస్‌స్టాప్‌కు చేరుకున్నారు. వీరి వద్ద ఉన్న ప్లాస్టిక్ బ్యాగు అనుమానాస్పదంగా కనిపించటంతో పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. నిందితుల నుంచి 5 కేజీల గంజాయి, మూడు ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

రెండో విడత సీడీపీ నిధులు మంజూరు

- ప్రతి నియోజకవర్గానికి రూ. 1.5 కోట్లు విడుదల
- నిధుల్లో రూ. 2 కోట్ల చొప్పున మన బస్తీ-మన బడి పనులకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభివృద్ధి పనుల ప్రతిపాధనలు

సాక్షి,సిటీబ్యూరో: నగరంలో నియోజకవర్గ అభివృద్ధి పనులకు మోక్షం లభించనుంది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సంబంధించి 2022-23 ఆర్థిక సంవత్సరం రెండో విడత సీడీపీ నిధులు మంజూరయ్యాయి. తొలి సీడీపీ నిధులు గత ఏడాది జూలైలో విడుదల కాగా, ప్రస్తుతం రెండో విడత నిధులకు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి నియోజకవర్గానికి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం(సీడీపీ) కింద ప్రభుత్వం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఏటా రూ. 5 కోట్ల చొప్పున నిధులు కేటాయిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మన బస్తీ-మన బడి కార్యక్రమం అమలు తలపెట్టడంతో ఈ ఏడాది సీడీపీ నిధుల్లో నుంచి రూ.2 కోట్ల చొప్పున ప్రభుత్వం వినియోగించుకోవాలని నిర్ణయించింది. దీంతో ప్రతి నియోజకవర్గానికి ఏడాదికి రూ. 3 కోట్లు మాత్రమే దక్కనున్నాయి. కాగా, వీటిలో రెండో విడత కింద రూ.1.5 కోట్ల చొప్పున విడుదలయ్యాయి.

నిధులు పెరిగినా...

నియోజకవర్గ నిధులు పెరిగినా...మన బస్తీ-మన పనులతో పాత పరిస్థితే పునరావృత్తమైంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ. 3 కోట్లు మాత్రమే ఉండగా 2021-22 నుంచి రూ.5 కోట్లకు పెంచారు. కానీ గతేడాది నుంచి 'మన బస్తీ- మన బడి' కోసం రూ.2 కోట్ల చొప్పున మళ్లిస్తుండటంతో తిరిగి రూ. 3 కోట్లకే పరిమితమయ్యాయి. మంజూరైన నిధులు కాస్తా జనరల్, ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన ఖర్చు చేయాల్సి ఉంది.

బడీడు పిల్లల సర్వే పూర్తి

పిల్లల వివరాలు ప్రబంద్ పోర్టల్‌లో నమోదు

- ఈ నెల 30లోపు జిల్లా విద్యాశాఖకు అందజేత
- గుర్తించిన పిల్లలను బడిలో చేర్పిన అధికారులు

బంజారాహిల్స్: బడీడు పిల్లలు పాఠశాలకు వెళ్తేనే వారికి అద్భుతమైన భవిష్యత్ ఉంటుంది. అయితే బస్తీలు, మురికివాడల్లో చాలా మంది తల్లిదండ్రులు తాము పనులకు వెళ్తూ.. పిల్లలను చూసుకోవడానికి బడీడు పిల్లలను ఇంట్లోనే ఉంచుతున్నారు. మరి కొంతమంది కుటుంబ పోషణ కోసం కొంత మేర అవసరం అవుతుందని పనులకు పంపుతున్నారు. ఎంతో మంది చిన్నారులు వివిధ కారణాలతో చదువుకు దూరమవ్వడమే కాకుండా బాల కార్మికులుగా మిగిలిపోతున్నారు.

- బడీఈ పిల్లలు పనుల్లో కాదు.... బడిలో ఉండాలన్న లక్ష్యంతో విద్యాశాఖాధికారులు బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బడీడు పిల్లల సర్వే చేపట్టారు.
- విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, సనత్‌నగర్, ఎర్రగడ్డ, అమీర్‌పేట, బోరబండ, రహ్మత్‌నగర్, వెంగల్‌రావునగర్, యూసుఫ్‌గూడ డివిజన్ల పరిధిలోని 17 ప్రభుత్వ ఉన్నత, 47 ప్రాథమిక పాఠశాలల పరిధిలో ఈ నెల 6వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఈ సర్వే నిర్వహించారు.



సర్వే చేస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్

- ఈ సర్వేలో జోన్ పరిధిలో మొత్తం 96 మంది బడీడు పిల్లలను గుర్తించి వారిని ఆయా ప్రాంతాల్లో సర్కారు బడుల్లో చేర్చారు.
- బడి బయట పిల్లలను గుర్తించేందుకు అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఖైరతాబాద్, షేక్‌పేట మండలాల పరిధిలో ప్రత్యేకంగా క్లస్టర్ రిసోర్స్ పర్సన్లను ఇందుకోసం కేటాయించారు.
- పాఠశాల మానేసి చదువులకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించడానికి సీఆర్‌సీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికీ తిరిగారు.
- గత విద్యాసంవత్సరంలో ఈ సర్వేలో 89 మందిని గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించారు. వారి వయసు ప్రకారం అర్హతకు తగిన తరగతిలో చేర్పించారు. కొంత మంది వలస వచ్చిన వారు ఉండగా వారిని స్వస్థలాలకు పంపించారు.
- ప్రస్తుతం గుర్తించిన వారందరినీ కేవలం బడిలో చేర్పించి ఊరుకోకుండా వారు రోజూ వస్తున్నారా లేదా పరిశీలిస్తున్నారు.
- పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారి ఈ సర్వేను పరిశీలించడమే కాకుండా పాఠశాలలో చేరిన పిల్లలను పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా బస్తీల్లోనే చాలా మంది పిల్లలు అర్హత ఉండి కూడా పాఠశాలల్లో చేరలేదని తేలింది.

ఇవీ మార్గదర్శకాలు:

- గతంలో 6–14 ఏళ్లలోపు వారిని నమోదు చేయగా, ఈ ఏడాది ప్రత్యేకంగా 15–19 ఏళ్ల వయసు ఉండి ఉన్నత విద్య ఆపేసిన వారిని సైతం ఇందులో చేర్చారు.
- వీరితో పాటు దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారు, 0–18 ఏళ్లలోపు పిల్లల వివరాలు గుర్తించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు 6–14, 15–19 ఏళ్లలోపు, దివ్యాంగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.
- ఈ నెల 19 నుంచి 25వ తేదీలోపు ప్రబంద్ పోర్టల్‌లో ఈ వివరాలను నమోదుచేసి ఈ నెల 30లోపు జిల్లా విద్యాశాఖకు అందించనుంది.

కంటి పరీక్షలకు జనం బారులు



కంటి వెలుగు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వెంకటేశ్వరకాలనీ: కంటి వెలుగు శిబిరాలకు మూడో రోజైన సోమవారం కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం నుంచే కంటి పరీక్షల కోసం ఆయా శిబిరాల వద్ద జనం బారులు తీరారు. బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని గౌరీశంకర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరానికి ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేయగా ఇక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. ఫిలింనగర్ గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో, బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎన్బీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో సైతం పరీక్షల కోసం స్థానికులు భారీగా విచ్చేశారు. అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేయడమే కాకుండా శస్త్ర చికిత్సలు కావాల్సిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

584 మందికి అద్దాలు పంపిణీ...

- జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలోకి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో మొత్తం ఆరు చోట్ల కంటి వెలుగు శిబిరాలు ఏర్పాటు చేయగా సోమవారం 759 మంది పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 270 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా, 35 మందిని శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. ఇక జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో ఆరు శిబిరాలు ఏర్పాటు చేయగా, సోమవారం 810 మంది పరీక్షలు నిర్వహించుకున్నారు. ఇందులో 314 మందికి కళ్లద్దాలు పంపిణీ చేయగా, 121 మందిని శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేసినట్లు జోనల్ కమిషనర్ రవి కిరణ్ తెలిపారు.

అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్



ఏసీ గార్డ్స్ జామా మసీద్ సభ్యులకు చాదర్ అందజేస్తున్న ఎమ్మెల్యే దానం

ఫిలింనగర్: రాజస్తాన్‌లోని ఖాజా గరీబ్ నవాజ్ అజ్మీర్ షరీఫ్ దర్గాకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చాదర్‌ను పంపించారు. సోమవారం ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీ గార్డ్స్‌లోని బిస్తీవాడ జామసీద్ కమిటీ సభ్యులకు ఆయన చాదర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నాగేందర్ మాట్లాడుతూ, ఇదే మాసంలో చాదర్‌కు సంప్రదాయ పూజలు నిర్వహించి పంపిస్తుంటామన్నారు. అన్ని కులాలు, మతాలు ఐకమత్యంగా ఉండాలన్నదే సీఎం కేసీఆర్ ముఖ్య ఉద్దేశమని, ఆయన సుదీర్ఘ కాలం ప్రజాసేవలో ఉండాలని కోరుకుంటూ ఈ చాదర్‌ను సమర్పిస్తున్నామన్నారు. ఈ చాదర్‌ను తీసుకొని మసీద్ కమిటీకి చెందిన 275 మంది వెళ్తారని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అఫ్సర్ బిన్ మోహిసిన్, షేక్ జావెద్, మహేందర్, నాగేష్, సంతోష్, అనిల్, సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు, వహీద్, బషీర్, అహ్మద్, మహ్మద్ గని పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డుకు అడ్డుగా ఉన్న డివైడర్ల తొలగింపు



డివైడర్లను సరి చేస్తున్న బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి జంక్షన్‌లో అనునిత్యం ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. నిర్మాత సురేష్ బాబు గెస్ట్‌హౌస్ వద్ద అడ్డదిడ్డంగా డివైడర్లు ఉండటంతో ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంది. సమస్యను గుర్తించిన బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు సోమవారం అడ్డదిడ్డంగా ఉన్న డివైడర్లను సరి చేశారు. దీంతో ట్రాఫిక్ సజావుగా ముందుకు కదిలింది.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న ఎంఎస్‌పీ నేత రామకృష్ణ తదితరులు

శ్రీనగర్‌కాలనీ: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు బీజేపీ మద్దతు ప్రకటించడంతో పాటు బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లంకల దీపక్‌రెడ్డిని ఎర్రగడ్డలో సోమవారం ఎంఎస్‌పీ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జ్ ఎం.రామకృష్ణ మాదిగ కలిసి వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలోఎంఎస్‌పీ నేతలు గాంధీకుమార్, కె.శివమాదిగ, రాంకుమార్, శ్రీధర్, కృష్ణ, ఆదిత్య, రాజు, ప్రవీణ్, సుధాకర్, సుమిత్ర, శ్రీహరి, గోపాల్, మౌనిక, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా సోమవారం సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్ర నామార్చన, యజ్ఞం, అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్యాం రావు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తాటి కొండ కృష్ణమూర్తి గుప్తా, ప్రధాన కార్యదర్శి నిజామాబాద్ శ్రీను గుప్తా, కోశాధికారి బ్రహ్మానందం గుప్తా, రాజేష్ గుప్తా, శ్రీనివాస్ గుప్తా, నవీన్ గుప్తా, ఆలయ ధర్మకర్త పాక కుమారస్వామి పాల్గొన్నారు.

నేతాజీ ఆశయ సాధనకు కృషి

లిబర్టీ: బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుంచి దేశానికి విముక్తి కలిగించడానికి జరిగిన పోరాటంలో సుభాష్ చంద్రబోస్ ప్రధాన భూమిక పోషించారని లోక్‌దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పీవీ రాజేశ్వరరావు అన్నారు. స్వతంత్ర పోరాటానికి భారత జాతిని సమాయత్తం చేసి వారిలో నేతాజీ చైతన్య స్ఫూర్తిని నింపారన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సోమవారం లోక్‌దళ్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుంచి దేశ ప్రజలకు విముక్తి కలిగించేందుకు ఆజాద్ హిందూ ఫౌజ్‌ను స్థాపించి పోరు సాగించిన యోధుడని కొనియాడారు. దేశ యువత సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సంకీర్త జయంతి తదితరులు పాల్గొన్నారు.

బాబాకు ఆవు పెరుగుతో అభిషేకం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని విశ్వ సాయి మందిరంలో కొలువు దీరిన శ్రీ సాయిబాబా వారి మాఘమాస మహోత్సవంలో భాగంగా సోమవారం బాబాకు ఆవు పెరుగుతో అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి బాబాను దర్శించుకున్నారు. నక్షత్ర హారతి, కాగడ హారతి, సంధ్యా హారతి, సేజ్ హారతి వైభవంగా జరిగాయి.



కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

బంజారాహిల్స్: సోమాజిగూడ డివిజన్ ఎంఎస్ మక్తాలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకురాలు, కార్పొరేటర్ పి.విజయారెడ్డి ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్ ఎస్‌కే షరీఫ్‌తో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్‌పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని ప్రజలకు మరింత చేరువ కావడానికి పార్టీ కార్యాలయం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. డివిజన్‌లో పార్టీ బలంగా ఉందని నేతలు, కార్యకర్తల సమన్వయంతో మరింత బలోపేతం చేస్తామన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాబోయే రోజుల్లో ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రహమత్‌నగర్: అక్బరి వెల్ఫేర్ సొసైటీ, సన్‌రైజ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల ఆధ్వర్యంలో జయశంకర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఎముకలు, మధుమేహ, మానసిక, గుండె రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. బోరబండ, రహమత్ నగర్, అల్లాపూర్ డివిజన్లకు చెందిన రోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 18 మంది వైద్య నిపుణులు దాదాపు 500 మంది రోగులకు వివిధ రకాలైన వైద్య సేవలు అందించారు. అక్బరి వెల్ఫేర్ ప్రతినిధులు విజ్ఞప్తి మేరకు పేద రోగులకు సీజీహెచ్‌ఎస్ రేటుకే వైద్య సేవలు అందిస్తామని సన్‌రైజ్ ఆసుపత్రి నిర్వాహకులు హామీ ఇచ్చారు. ఏడబ్ల్యూఎస్ అధ్యక్షుడు మహ్మద్ జహంగీర్, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు ఏంఏ సత్తార్, ఏడబ్ల్యూఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చాంద్ పాషా, ఉపాధ్యక్షుడు జుబైర్, డాక్టర్ సన్నిడేవిస్, సురేష్, కృష్ణారెడ్డి, బోరబండ బీఆర్‌ఎస్ కో ఆర్డినేటర్ విజయసింహ, విజయ్‌కుమార్, సైట్– 3 బస్తీ అధ్యక్షుడు గౌస్, సైట్5 అధ్యక్షుడు ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ సెలెక్టెడ్ అభ్యర్థుల వెబ్‌నోట్‌ను ప్రకటించాలి



ఆందోళన చేస్తున్న గురుకుల పీఈటీలు

బంజారాహిల్స్: గురుకుల పీఈటీ సెలెక్టెడ్ అభ్యర్థుల మెరిట్ లిస్ట్ వెబ్‌నోట్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పీఈటీలు సోమవారం బంజారాహిల్స్ రోడ్ నం.12లోని శ్మశాన వాటిక ముందు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నాకు దిగారు. ఆందోళనకారులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. హైకోర్టు ఆదేశానుసారం మూడు కేటగిరీలుగా పీఈటీ పోస్టులను విభజిస్తూ 5 నుంచి 8 తరగతులకు జీరో పోస్టులను, 6 నుంచి 8 తరగతులకు 588 పోస్టులను 9,10 తరగతులకు 28 పీఈటీ పోస్టులను కేటాయిస్తూ గురుకుల సొసైటీలు తయారు చేసిన ఇండెంట్లను టీఎస్‌ఎస్‌పీకి పంపించారని, సొసైటీ వారు ఇచ్చిన ఇండెంట్ల ప్రకారం సదరు చైర్మన్ వెబ్‌నోట్ ప్రకటించి సెలెక్టెడ్ క్యాండెట్లకు ఆర్డర్లు ఇవ్వాల్సి ఉండగా అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. గురుకుల సెక్రటరీలు పంపించిన ఇండెంట్లకు విరుద్ధంగా టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ వ్యవహరిస్తూ మెరిట్ మార్కులు సాధించిన సెలెక్టెడ్ క్యాండెట్లకు జాయినింగ్ ఆర్డర్లు ఇవ్వడం లేదన్నారు. హైకోర్టు తీర్పును, సొసైటీలో ఇచ్చిన ఇండెంట్లను సదరు చైర్మన్ పక్కనపెడుతూ వ్యక్తిగత నిర్ణయాలు తీసుకుంటూ తక్కువ మార్కులు సాధించిన డిప్లొమా వారికి పీఈటీ పోస్టులు కట్టబెట్టాలని ఉద్దేశపూర్వకంగా తమకు అన్యాయం చేస్తున్నారని వారు ఆరోపించారు.

500 మంది విద్యార్థులకు వినికిడి పరీక్షలు



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం. 7లోని గతి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఆశ్రయ్–ఆకృతి బధిరుల పాఠశాల ఆధ్వర్యంలో సోమ వారం పాఠశాల ఆవరణలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులకు వినికిడి, గొంతు సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించామని డాక్టర్ నరహరి తెలిపారు. ఎవరికైనా శస్త్ర చికిత్సలు అవసరమైతే వారికి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా చేయిస్తామని ఆయన పేర్కొన్నారు.

బంజారాహిల్స్‌లో సీలీ మ్యాట్రెస్ గ్యాలరీ



సీలీ మ్యాట్రెస్ గ్యాలరీని ప్రారంభిస్తున్న డైరెక్టర్ జీఎస్ఎస్ జగన్నాథ్

బంజారాహిల్స్: అమెరికాకు చెందిన ప్రముఖ మ్యాట్రెస్ కంపెనీ సీలీ బంజారాహిల్స్ రోడ్ నం. 1లో నూతనంగా మ్యాట్రెస్ గ్యాలరీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇండియాలో ఇది రెండోస్టోర్ కాగా సోమవారం సీలీ ఇండియా డైరెక్టర్ జీఎస్ఎస్ జగన్నాథ్ ఈ స్టోర్‌ను ప్రారంభించారు. రూ. 68 వేల నుంచి రూ. 8 లక్షల ధరలు నాణ్యమైన మ్యాటెసెస్ ఇక్కడ లభ్యమవుతాయని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఒక స్టోర్ ఉండగా నగరవాసుల నుంచి వస్తున్న స్పందనను దృష్టిలో పెట్టుకొని మరో స్టోర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. భారతీయుల జీవన విధానం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వీటిని రూపొందించినట్లు తెలిపారు. భారతీయ మార్కెట్‌లో మ్యాట్రెసెస్ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 15 వేల కోట్లకుపైగా ఉందని లగ్జరీ సెగ్మెంట్ ప్రతియేటా 50 శాతం వృద్ధితో గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నదని తెలిపారు. త్వరలోనే హైదరాబాద్‌లో తొలి ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నామన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన అవసరం

హిమాయత్‌నగర్: ట్రాఫిక్ రూల్స్‌పై యువతకు అవగాహన ఎంతో అవసరమని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు అన్నారు. రూల్స్ తెలిసిన వారు రోడ్లపై సక్రమంగా వెళ్తున్నారన్నారు. సోమవారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ కాలేజీలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, రోడ్డు భద్రత తదితర అంశాలపై టీటీఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించడం వల్ల వచ్చే అనర్థాలు, ప్రమాదాలపై లఘు చిత్రాలను ప్రదర్శించారు. అనంతరం ఏసీపీ జి.శంకర్‌రాజు మాట్లాడుతూ.. రూల్స్‌ని అతిక్రమించడం వల్ల బంగారు భవిష్యత్ విచ్ఛిన్నమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇంట్లో వారు ద్విచక్ర వాహనాలపై బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరింపజేయాలన్నారు. 18 ఏళ్ల వయస్సు పైబడిన వారు మాత్రమే వాహనాలను నడపాలని, మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. వైస్ ప్రిన్సిపల్స్ సత్యనారాయణరెడ్డి, సూర్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐస్‌క్రీమ్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం

శ్రీనగర్‌కాలనీ: వెంగళరావునగర్‌లోని ఓ ఐస్‌క్రీమ్ గోడౌన్‌లో సోమవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికుల సమాచారం మేరకు సనత్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పేశారు. దీంతో ఎలాంటి ఆస్తినష్టం జరుగలేదని తెలిసింది. షార్ట్ సర్క్యూట్‌కు గల కారణాలను అధికారులు తెలుసుకుంటున్నారు. గోడౌన్‌లో ఉన్న ఫైర్ సేఫ్టీ పరికరాలు, ఎలాంటి అనుమతులు ఉన్నాయన్న వాటిపై జీహెచ్ఎంసీ అధికారులు ఆరా తీస్తున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి



సీఎస్‌ను కలిసిన టూరిజం అభివృద్ధి సంస్థ కాంట్రాక్ట్ ఉద్యోగులు

లిబర్టీ: టూరిజం అభివృద్ధి సంస్థలో అనేక ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతికుమారికి టూరిజం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించింది. తాము ఎదుర్కొంటున్న సమస్యలను యూనియన్ ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి సీఎస్‌కు వివరించారు. రాష్ట్రంలోని 33 జిల్లాలో టూరిజం అభివృద్ధి సంస్థలో వివిధ విభాగాల్లో 25 సంవత్సరాలుగా పని చేస్తున్నప్పటికి కనీస వేతనాలు లేక ఉద్యోగాలు పర్మినెంట్ కాక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారన్నారు. ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని సీఎస్ భరోసా ఇచ్చారన్నారు.

మాంజాకు చిక్కుకున్న గద్ద

సనత్‌నగర్: మాంజాకు చిక్కుకుని విలవిల లాడుతున్న ఓ గద్దను సనత్‌నగర్ ఫైర్ సిబ్బంది కాపాడారు. సనత్‌నగర్ అల్లావుద్దీన్ కోఠిలోని చెట్ల కొమ్మలపై వాలిన గద్ద అక్కడి మాంజాకు చిక్కుకుని అరుస్తుండగా స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ ప్రదీప్ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకుని దాదాపు గంట పాటు రెస్క్యూ చేసి గద్ద ప్రాణాలను కాపాడారు.



గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం

లిబర్టీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26న రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరిస్తామని జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి జాతీయ కన్వీనర్ వి.కృష్ణస్వరూప్ వెల్లడించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమ కూటమి ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్ మోదీ హటావో– దేశ్ సంవిధాన్ బచావో' పేరుతో పోరాటాలు సాగిస్తామన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం, మోదీ కేసీఆర్ పాలన నుంచి ప్రజలను రక్షించేందుకు తిరుగుబాటు పోరాటాలు చేస్తామన్నారు, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కార్పొరేటర్ వర్గాల ప్రతినిధులను ఆరోపించారు. దేశ సంపదను మోదీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు దోచిపెడుతోందని విమర్శించారు. పీడిత శ్రామిక సమాజానికి తమ కూటమి ప్రత్యేకమని స్పష్టం చేశారు.

రూ.10కే వైద్యం అభినందనీయం



హీల్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్ ప్రారంభిస్తున్న దృశ్యం

పంజగుట్ట: ప్రస్తుతం వైద్యం ఖరీదైన నేపథ్యంలో కేవలం రూ.10 కే వైద్య సేవలు అందించడం అభినందనీయమని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, పోలీస్ అడిషనల్ కమిషనర్ ఏఆర్ శ్రీనివాస్ అన్నారు. పంజగుట్ట ద్వారకాపురి కాలనీలో హీల్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను సోమవారం వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్ మాట్లాడుతూ ... పేద, ధనిక అనే తేడా లేకుండా ఎవ్వరికైనా రూ. 10 లకే నాణ్యమైన వైద్యం అందిస్తామన్నారు. గైనకాలజీ, పిడియాట్రిక్, డెర్మటాలజీ, ఫ్యామిలీ మెడిసిన్‌తో పాటు పది విభాగాలకు చెందిన వైద్యులు వచ్చే నెల 27 నుంచి ఇక్కడ సేవలందిస్తారన్నారు. ఇదే కార్యాలయంలో విద్యార్థుల కోసం ఎడ్యుకేషన్ సెంటర్‌ను అందుబాటులో ఉంచినట్లు డైరెక్టర్ మణిమాల తెలిపారు. వైద్యులు గీతిక, సబితాదేవి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పోలీసులమని బెదిరించి..

బైక్, 2 సెల్‌ఫోన్లు, రూ.2 వేలు దోచేశారు!

హిమాయత్‌నగర్: పోలీసులమని ఓ వ్యక్తిని భయపెట్టి బైక్, రెండు సెల్‌ఫోన్లు, రూ. 2 వేలు దోచుకున్న ఘటన నారాయణగూడ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు.. చాంద్రాయణగుట్టకు చెందిన అల్మాస్‌అహ్మద్ తన యాక్టివా బైక్ రిపేర్ కోసం సమీపంలోని ఓ మెకానిక్ షాప్‌కు వెళ్లాడు. బైక్ పార్ట్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, అవి తక్కువ ధరకు రాంకోఠిలో దొరుకుతాయని మెకానిక్ చెప్పాడు. మెకానిక్ షాప్ దగ్గర ఉన్న ఓ వ్యక్తి అల్మాస్‌తో తనకు రాంకోఠిలోని ఆటో మొబైల్ షాప్‌లు తెలుసని, తనతో వస్తే తక్కువ ధరకు బైక్ సామగ్రి ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఇద్దరూ కలిసి రాంకోఠిలోని ఓ షాప్ వద్దకు వెళ్లగా.. అక్కడ మరో ఇద్దరు వచ్చి తాము పోలీసులమని బైక్‌ను అడ్డగించారు. లైసెన్సు, ఆర్సీ, ఇన్సురెన్స్ పత్రాలు చూపించమని డిమాండ్ చేశారు. దీంతో అల్మాస్ అహ్మద్ తాను మెకానిక్‌షాప్ నుంచి వచ్చానని, పేపర్లు ఇంట్లో ఉన్నాయని చెప్పాడు. వారు అతడి జేబులోని పర్సులోంచి రూ.2 వేలు, రెండు సెల్‌ఫోన్లు లాక్కున్నారు. బైక్ పేపర్లు తెచ్చి వీటిని తీసుకెళ్లమన్నారు. దీంతో అతను చాంద్రాయణగుట్టలోని ఇంటికి తిరిగి వెళ్లాడు. లోపలికి వెళ్లి పేపర్లు తీసుకొని రా.. బైక్ వద్ద నేను ఉంటానని వెంట వచ్చిన వ్యక్తి చెప్పాడు. అల్మాస్ అహ్మద్ లోపలికి వెళ్లిన మరుక్షణం ఆ బైక్‌తో అతను కూడా పరారయ్యాడు. దీంతో బాధితుడు పోలీసుల్ని ఆశ్రయించగా సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈవ్యవహారం అంతా చాంద్రాయణగుట్టలోని మెకానిక్ షాప్ యజమాని, అక్కడ పరిచయమైన వ్యక్తి కలిసి చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ గేమ్స్ పేరిట రూ. 14 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడి భారీ మొత్తంలో అప్పుల పాలయ్యాడో వ్యక్తి.. తనకు వచ్చిన లాభాలు ఇవ్వకుండా మళ్లీ మళ్లీ ఆడిస్తూ తనను మోసం చేశారంటూ అతను సోమవారం సిటీ సైబర్‌క్రైం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పురానాపుల్‌కు చెందిన ఓ వ్యక్తి చైనీస్ గేమింగ్ యాప్ డఫాబెట్‌లో ఆన్‌లైన్‌లో గేమ్ ఆడాడు. తొలుత రూ.లక్ష లాభం వచ్చిందన్నారు. మళ్లీ ఆడితే ఈ లక్షకు పది రెట్లు లాభం వస్తుందన్నారు. ఈ పదిరెట్లు తీసుకోవాలంటే మళ్లీ మళ్లీ ఆడాల్సిందేనని నమ్మించారు. ఇలా మూడు నెలల వ్యవధిలో రూ.14 లక్షలు గేమింగ్‌లో పెట్టించారు. ఆ డబ్బు ఇవ్వకుండా తిరిగి ఆడాలని ఒత్తిడి చేయడంతో పోలీసుల్ని ఆశ్రయించాడు.

సిమ్ బ్లాక్ అవుతుందని చెప్పి...

టోలిచౌక్‌కు చెందిన ఓ వ్యక్తి తన భార్య అకౌంట్‌లో నుంచి రూ.8 లక్షలు మాయమైనట్లు ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి కాల్ చేసి సిమ్ బ్లాక్ అవుతుందని చెప్పడంతో.. తన భార్య ఓటీపీ చెప్పిందన్నాడు. అంతే క్షణాల వ్యవధిలో రూ.8 లక్షలు కొట్టేశారన్నాడు. వీరిద్దరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ కేవీఎం ప్రసాద్ చెప్పారు.

నగరంలో కానరాని అభివృద్ధి: కిషన్ రెడ్డి



బాపూనగర్‌లో పాదయాత్ర చేస్తున్న కేంద్ర మంత్రికిషన్‌రెడ్డి

అమీర్‌పేట: మహానగరంలోని ప్రజా సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో సోమవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. బాపూనగర్, ఎస్ఆర్‌టీ, బల్కంపేటలో పాదయాత్ర చేస్తూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.నగరంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆదాయం వస్తున్నా నిధులను పక్కదోవ పట్టిస్తున్న కారణంగా జీహెచ్ఎంసీ, జలమండలి విభాగంలో అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. కార్పొరేటర్ కేతినేని సరళ, నాయకులు శ్యామ్‌సుందర్‌గౌడ్, పురుషోత్తమ రెడ్డి, సారంగపాణి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సినీ నటుడు సుధీర్‌వర్మ ఆత్మహత్య



దొండపర్తి (విశాఖ దక్షిణ): వర్ధమాన తెలుగు సినీ నటుడు కలిదిండి సుధీర్‌వర్మ (34) బలవన్మరణానికి పాల్పడ్డారు. 2013లో 'సెకండ్ హ్యాండ్' సినిమాతో సుధీర్‌వర్మ టాలీవుడ్‌లోకి హీరోగా ఎంట్రీ ఇచ్చారు. 2016లో దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు సమర్పణలో రిలీజైన కుందనపు బొమ్మ సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. మెగాస్టార్ చిరంజీవి కుమార్తె సుస్మిత నిర్మించిన 'షూటౌట్ ఎట్ ఆలేరు' వెబ్ సిరీస్‌లోనూ నటించారు. సుధీర్‌వర్మ కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. ఈ కారణంగానే గత వారంలో హైదరాబాద్‌లో విషం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆరోగ్య క్షీణించడంతో తన బంధువుకు ఫోన్‌చేసిన సుధీర్ ఆరోగ్య సమస్యల కారణంగా మానసిక పరిస్థితి బాగోలేకపోవడంతో పురుగు మందు తాగినట్టు చెప్పగా.. అతడు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించాడు. కాగా, సుధీర్‌వర్మను ఆస్పత్రిలో ఎవరికీ చెప్పకుండా, డిశ్చార్జ్ తీసుకోకుండా ఈ నెల 21న విశాఖ తీసుకువచ్చి మహారాణిపేట ప్రాంతంలోని ఎల్‌జీ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స అందించి, సుధీర్ ఆత్మహత్య యత్నం చేసిన విషయాన్ని మహారాణిపేట పోలీసులకు తెలియజేశారు. దీంతో పోలీసులు ఆస్పత్రికి వెళ్లి సుధీర్ నుంచి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో సుధీర్ తాను ఓ వాటర్‌ప్లాంట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్టు పోలీసులకు చెప్పాడు. సోమవారం వేకువజామున 4.18 గంటలకు సుధీర్‌వర్మ చనిపోయినట్టు ఆస్పత్రి వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయమై ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా.. పోస్టుమార్టం చేయకుండానే వారు దహన సంస్కారాలు పూర్తి చేశారు.

మూడో రోజు 2.16 లక్షల మందికి కంటి పరీక్షలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మూడో రోజు సోమవారం 2.16 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడించింది. 49,807 మందికి రీడింగ్ గ్లాసెస్ పంపిణీ చేశారు. 33,804 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ కోసం రెఫర్ చేశారు. 1.32 లక్షల మందికి కంటి సమస్యలు లేనట్లు గుర్తించారు. కాగా, కంటి వెలుగులో మొత్తం ఇప్పటివరకు 6.22 లక్షల మందికి కంటి పరీక్షలు చేసినట్లు వైద్య, ఆరోగ్య శాఖ తెలిపింది.

సీజే స్థానాన్ని కించపరిచింది!

▶ మొదటి పేజీ తరువాయి

విచారించడం ద్వారా సీజే స్థానాన్ని వెకేషన్ బెంచ్ కించపరిచిందని ఘాటుగా వ్యాఖ్యానించింది. ప్రతి వెకేషన్ జడ్జి ఇలాగే వ్యవహరిస్తే వ్యవస్థ ఏమవుతుందంటూ ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి వాటిని అనుమతిస్తే రేపు ప్రతి వెకేషన్ జడ్జి ప్రధాన న్యాయమూర్తిలా వ్యవహరిస్తారని వ్యాఖ్యానించింది. ఇది తేలిగ్గా తీసుకునే విషయం ఎంత మాత్రం కాదని, మూలాల్లోకి వెళ్లి ఈ వ్యవహారాన్ని తేలుస్తామని సీజే ధర్మాసనం తేల్చి చెప్పింది. వెకేషన్ కోర్టులో ఏం జరిగిందో తనకు ప్రతిదీ తెలుసని సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. హైకోర్టు రిజిస్ట్రీ తనకు ఎప్పటికప్పుడు ప్రతి విషయాన్ని నివేదించిందన్నారు. తనకు ఏమీ తెలియదనుకుంటే అది పెద్ద పొరపాటే అవుతుందని స్పష్టం చేశారు. ప్రధాన న్యాయమూర్తికి మాత్రమే సొంతమైన అధికారాల విషయంలో తాను నిక్కచ్చిగా వ్యవహరించి తీరుతానన్నారు. ఇదే సమయంలో జీవో 1పై వెకేషన్ బెంచ్ ముందు పిల్ దాఖలు చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కాకా రామకృష్ణ తీరును సైతం సీజే ధర్మాసనం తప్పుబట్టింది. ఏమంత అత్యవసరం ఉందని హడావుడిగా పిల్ దాఖలు చేశారని రామకృష్ణను నిలదీసింది. మీరేమైనా ధర్నా చేశారా? రాస్తారోకో చేశారా? సమావేశాలు పెట్టారా? ఏం చేస్తే మీకు ఇబ్బంది కలిగింది? అని ధర్మాసనం ప్రశ్నించింది. తక్షణ ఇబ్బంది లేనప్పుడు ఏం మునిగిపోయిందని సెలవుల్లో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారని ప్రశ్నించింది. మధ్యంతర ఉత్తర్వులు పొందిన తరువాత ఏమైనా కార్యక్రమాలు చేపట్టారా? అంటే అదీ లేదని, ఇలాంటి పిటిషన్ వేసి తీవ్ర గందరగోళ పరిస్థితి సృష్టించారని రామకృష్ణతో పాటు ఆయన తరఫు న్యాయవాది ఎస్.అశ్వనీ కుమార్‌ను ఉద్దేశించి ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టు నుంచి ఉత్తర్వులు పొందేందుకు ఇలాంటి పరిస్థితిని సృష్టించారని, దీనికి సమాధానం చెప్పి తీరాలంది. మీ చర్యలు ప్రధాన న్యాయమూర్తికి బాధ కలిగించాయంది. ఇలాంటి చర్యలు వ్యవస్థకు ఎంత మాత్రం మంచివి కాదంది. జీవో 1పై రామకృష్ణ దాఖలు చేసిన పిల్‌లో ఇరుపక్షాల వాదనలు ముగియడంతో పాటు ఇదే అంశంపై బీజేపీ, తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నేతలు వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై మంగళవారం విచారణ జరుపుతామని ధర్మాసనం ప్రకటించింది.

సెలవుల్లో వ్యూహాత్మకంగా పిల్..

రోడ్లు, రోడ్ మార్జిన్‌లలో బహిరంగ సభల ఏర్పాటును నియంత్రిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2న జారీ చేసిన జీవో 1ని సవాల్ చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కాకా రామకృష్ణ సంక్రాంతి సెలవుల్లో అత్యవసర కేసులను మాత్రమే విచారించే హైకోర్టు వెకేషన్ బెంచ్ ముందు వ్యూహాత్మకంగా పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తులు జస్టిస్ దేవానంద్, జస్టిస్ కృపాసాగర్ ధర్మాసనం జీవో 1 అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. రామకృష్ణ వ్యాజ్యంపై విచారణ జరపాలని సీజే ధర్మాసనానికి స్పష్టం చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం సోమవారం ఈ వ్యాజ్యంపై విచారణ జరిపింది.

ఆ విచక్షణాధికారం వెకేషన్ కోర్టుకుంది...

పిటిషనర్ రామకృష్ణ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్ వాదనలు వినిపిస్తూ వెకేషన్ కోర్టులో ఎలాంటి కేసులను విచారించాలన్న అంశంపై హైకోర్టు రిజిస్ట్రీ నోటిఫికేషన్‌ను చదివి వినిపించారు ఈ నోటిఫికేషన్ ప్రకారం పరిపాలన, విధానపరమైన నిర్ణయాలపై వెకేషన్ కోర్టు విచారణ జరపరాదన్నారు. అయితే ప్రభుత్వ చర్యలు పౌరుల ప్రాథమిక హక్కులను హరించే విధంగా ఉన్నాయని కోర్టు భావించినప్పుడు విచారణ జరిపే విచక్షణాధికారం వెకేషన్ కోర్టుకు ఉందన్నారు. ప్రస్తుత వ్యాజ్యాన్ని కూడా వెకేషన్ కోర్టు అదే తరహాలో భావించి విచారణ జరిపిందని చెప్పారు. ఫలానా తరహా వ్యాజ్యాలను మాత్రమే విచారించాలని నోటిఫికేషన్‌లో ఉందని, అదే సమయంలో ఫలానా తరహా వ్యాజ్యాలను విచారించకూడదని ఎక్కడా లేదన్నారు. ఈ సమయంలో సీజే స్పందిస్తూ.. సెలవుల్లో ప్రతి కేసునూ ముఖ్యమైనదిగానే భావించి వెకేషన్ కోర్టులు విచారణ జరుపుతూపోతే ఇక వ్యవస్థ ఏం కావాలని ప్రశ్నించారు. ఈ వ్యవహారం మీరు చెబుతున్నంత సింపుల్ విషయం కాదని స్పష్టం చేశారు. ప్రధాన న్యాయమూర్తికి మాత్రమే సొంతమైన హక్కులు ఏమిటో తనకు బాగా తెలుసని, ఇందులో ఎలాంటి సందేహానికి తావు లేదని తేల్చి చెప్పారు.

ప్రజలను కలుసుకునే హక్కు పార్టీలకు ఉంది..

అనంతరం రాజు రామచంద్రన్ వాదనలను కొనసాగిస్తూ జీవో 1లోని అంశాలను చదివి వినిపించారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై బహిరంగ సభలను నిషేధించారని పేర్కొన్నారు. సాధారణంగా పాదయాత్రలన్నీ జాతీయ రహదారుల వెంబడే సాగుతాయన్నారు. మునిసిపల్, పంచాయతీ రోడ్లు ఇరుకుగా ఉంటాయని, అక్కడ బహిరంగ సభలకు అనుమతినిస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని చెబుతున్నారన్నారు. అరుదైన, అసాధారణ పరిస్థితుల్లో మాత్రం అనుమతిస్తామని చెబుతున్నారని, అయితే ఆ పరిస్థితులు ఏమిటో నిర్దిష్టంగా చెప్పడం లేదన్నారు. అధికార పార్టీ సభలు నిర్వహించుకునేందుకు ఈ అరుదైన, అసాధారణ పరిస్థితులను కారణంగా చూపి పోలీసులు అనుమతులు ఇస్తారని, ప్రతిపక్ష పార్టీల విషయంలో భిన్న వైఖరిని అవలంబిస్తారని తెలిపారు. ప్రజలను కలుసుకునే హక్కు రాజకీయ పార్టీలకు ఉందని, దీన్ని జీవో 1 హరిస్తోందన్నారు. సభలు, యాత్రలు ఎక్కడ ఎలా నిర్వహించాలన్నది ఆయా పార్టీలు నిర్ణయిస్తాయని, షరతులతో అనుమతులు ఇవ్వడం ఇప్పటివరకు జరుగుతూ వచ్చిందన్నారు.

మా అభ్యంతరాలను సైతం వెకేషన్ బెంచ్ వినలేదు

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ వెకేషన్ కోర్టులో ఏం జరిగిందో ధర్మాసనానికి వివరించారు. పిల్‌ను విచారించే విషయంలో తన అభ్యంతరాన్ని వినేందుకు సైతం వెకేషన్ బెంచ్ నిరాకరించిందన్నారు. సాధారణంగా హౌస్‌మోషన్, లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్లు దాఖలు చేసేటప్పుడు కారణాలను స్పష్టంగా వివరిస్తారని, ప్రస్తుత వ్యాజ్యంలో మాత్రం అలాంటిది ఏమీ లేదన్నారు. ఈ వ్యాజ్యాన్ని విచారించే రోస్టర్ లేదని చెప్పినా కూడా వెకేషన్ బెంచ్ వినిపించుకోలేదన్నారు. సీజే నిర్ణయించిన రోస్టర్‌కు భిన్నంగా వెకేషన్ బెంచ్ మరో రోస్టర్‌ను నిర్ణయించిందన్నారు. వెకేషన్ కోర్టులో సాధారణంగా అత్యవసర కేసులను సీజే అనుమతి తీసుకున్న తరువాతే విచారిస్తారని, ఇది సంప్రదాయంగా వస్తోందన్నారు. పిటిషనర్ బెంచ్ హంటింగ్‌కు పాల్పడ్డారన్నారు.

రోడ్‌షోలపై ఎలాంటి నిషేధం లేదు..

రోడ్ షోలు, ఊరేగింపులను జీవో 1 నిషేధించడం లేదని ఏజీ పేర్కొన్నారు. కేవలం రోడ్లపై జరిగే సభలకు మాత్రమే ఆ జీవో ఉద్దేశించిందని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు కందుకూరులో నిర్వహించిన రోడ్‌షో కారణంగా పలువురు మరణించగా మరికొందరు గాయపడ్డారన్నారు. ఇలాంటి ఘటనలను నివారించేందుకు చట్ట నిబంధనలను అనుసరించి పోలీసులకు తగిన మార్గనిర్దేశం చేస్తూ జీవో 1 జారీ అయిందన్నారు. నిర్దిష్ట ప్రదేశం లేదా ప్రాంతంలో సభ నిర్వహించుకునేందుకు అనువైన మైదానంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాలేవీ ఆచరణ సాధ్యం కాని పరిస్థితులు ఉంటే అలాంటి సమయంలో అసాధారణ పరిస్థితుల కింద అనుమతులు ఇస్తామన్నారు. కేవలం ఊహల ఆధారంగా రామకృష్ణ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారన్నారు. కందుకూరుతో పాటు గుంటూరులో సైతం తొక్కిసలాట జరిగిందని, ఈ రెండు ఘటనలపై విచారణ కమిషన్‌ను నియమించినట్లు శ్రీరామ్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ సమయంలో సీజే జోక్యం చేసుకుంటూ.. రోడ్‌షోలు, ఊరేగింపులపై నిషేధం లేదన్న వాదనను రికార్డ్ చేయమంటారా? అని ప్రశ్నించగా నిస్సందేహంగా రికార్డ్ చేయవచ్చని ఏజీ నివేదించారు. ఈ విషయాన్ని తమ కౌంటర్‌లో సైతం స్పష్టం చేశామన్నారు. ఏజీ వాదనలు ముగియడంతో రాజు రామచంద్రన్ జోక్యం చేసుకుంటూ జీవో 1 విషయంలో మధ్యంతర ఉత్తర్వుల కోసం అభ్యర్థించారు. అయితే ఈ వ్యవహారంలో వాదనలు ఇంకా పూర్తి కాలేదని, మధ్యంతర ఉత్తర్వులు సాధ్యం కాదని ధర్మాసనం తేల్చి చెప్పింది. జీవో 1పై బీజేపీ నేత కన్నా, టీడీపీ నేత కొల్లు రవీంద్ర, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు దాఖలు చేసిన వ్యాజ్యాలపై మంగళవారం విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి

▶ మొదటి పేజీ తరువాయి

కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.

చేనేత కళాకారులను మరింత ప్రోత్సహించాలి

2014 నుంచి తెలంగాణతో అమెజాన్ అనుబంధం పెరుగుతూ వచ్చిందని, అమెరికా తరువాత అతి పెద్ద డేటా సెంటర్, ఆసియాలోనే అతిపెద్ద ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్ హైదరాబాద్‌లోనే ఉన్నాయని మంత్రి చెప్పారు. తాజాగా అమెజాన్ ఎయిర్ కూడా ఏర్పాటు కావడం ఎంతైన హర్షణీయమైన అంశం అని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి జరిగిన ప్రగతిని సోదాహరణంగా వివరించిన కేటీఆర్.. అమెజాన్ ఎయిర్ ఏర్పాటుతో తెలంగాణ వ్యాపారులకు తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు మరిన్ని అవకాశాలు దక్కడమే కాకుండా, యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు లభించనున్నాయని వివరించారు. అమెజాన్ ఇప్పటికే తెలంగాణలోని 56 గ్రామాల్లో 4,500 మంది చేనేత కళాకారులకు మద్దతిస్తోందని, వీరికి మరింత ప్రోత్సాహం ఇవ్వాలని, పోర్టల్ ద్వారా వారి ఉత్పత్తులు మరింత ఎక్కువగా అమ్ముడయ్యేలా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మరింత వేగంగా డెలివరీ: అఖిల్ సక్సేనా

సరుకుల రవాణా కోసం దేశంలోనే మొట్టమొదటిసారి విమానాలను ఉపయోగిస్తున్నామని, దీనివల్ల వినియోగదారులకు మరింత వేగంగా సరుకులు డెలివరీ అవుతాయని అమెజాన్ కస్టమర్ ఫుల్‌ఫిల్‌మెంట్ విభాగం ఉపాధ్యక్షుడు అఖిల్ సక్సేనా తెలిపారు. క్విక్ జెట్ అనే సంస్థ ద్వారా తాము ఈ సర్వీసులను నిర్వహిస్తున్నామని, విమానాల సర్వీసు, నిర్వహణ మొత్తం క్విక్ జెట్‌దేనని చెప్పారు. తొలిదశలో భాగంగా రెండు బోయింగ్ 737-800 విమానాలను ఉపయోగిస్తున్నామని, ఒకటి ఢిల్లీలో, రెండోది హైదరాబాద్‌లో ఉంటుందని చెప్పారు. ఒక్కో విమానంలో ఇరవై వేల షిప్‌మెంట్‌లను రవాణా చేయవచ్చని వివరించారు. ఢిల్లీ, హైదరాబాద్‌తో పాటు ముంబై, బెంగళూరుకు సరుకుల రవాణా జరుగుతుందని తెలిపారు.

మండపేట గేదా.. మజాకా!

రోజుకు 26.59 లీటర్ల పాలు ఇస్తున్న నాలుగేళ్ల గేదె

మండపేట: ఆ గేదె వయసు నాలుగేళ్లు. పాలదిగుబడిలో తన తల్లిని మించిపోయింది. రోజుకు 26.59 లీటర్లు పాలు ఇస్తూ రికార్డు సృష్టించింది. ఆ గేదె తల్లి రోజుకు 26.58 లీటర్లు పాలు ఇస్తూ రాష్ట్రస్థాయి పాల దిగుబడి పోటీల్లో రెండుసార్లు మొదటి స్థానంలో నిలిచింది. తల్లి గేదె ఆరో ఈతలో అత్యధిక దిగుబడి ఇస్తే... నాలుగేళ్ల వయసు కలిగిన పిల్ల గేదె రెండో ఈతలోనే తల్లిని మించి రికార్డు స్థాయిలో రోజుకు 26.59 లీటర్ల పాల దిగుబడిని నమోదు చేసింది. ఈ విషయాన్ని కేంద్రీయ పశు నమోదు పథకం ప్రతినిధి డి.రాజేశ్వరరావు ఆదివారం నిర్ధారించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన పాడి రైతు ముత్యాల సత్యనారాయణ (అబ్బు) మేలుజాతి పశు పోషణ చేస్తున్నారు. ఎనిమిదేళ్ల కిందట ఆయన తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో ముర్రా జాతి పాడి గేదెను కొనుగోలు చేశారు. ఆ గేదె గతంలో విజయవాడ, మండపేటల్లో జరిగిన రాష్ట్రస్థాయి పాల దిగుబడి పోటీల్లో రెండుసార్లు మొదటి స్థానంలో నిలిచింది. ఈ గేదె సాధించిన అత్యధిక దిగుబడి 26.58 లీటర్లు. ఇప్పటివరకూ ఆ గేదె తమ వద్ద ఆరు ఈతలు ఈనగా, నాలుగు దున్నపోతులు, రెండు పెయ్యదూడలు పుట్టాయని అబ్బు చెప్పారు. దున్నపోతుల్లో రెండింటిని సెమన్ సేకరణ కేంద్రాల వారు తీసుకువెళ్లగా, మరో రెండు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం రికార్డు స్థాయిలో పాలదిగుబడిని ఇస్తున్న పెయ్య ఆరో ఈతలో పుట్టిందని వివరించారు.



అత్యధిక పాల దిగుబడిని ఇస్తున్న గేదె

వీటికి దాణాగా రోజుకు రూ.500 ఖర్చుతో పశుగ్రాసాలు, మొక్కజొన్న, ఉలవలు, తవుడు అందిస్తున్నామని ఆయన చెప్పారు.

అధికారికంగా పాలదిగుబడి లెక్కింపు

ప్రస్తుతం కేంద్రీయ పశు నమోదు పథకం కింద మండపేట, పరిసర ప్రాంతాల్లో అత్యధిక పాల దిగుబడి ఇచ్చే పాడి పశువుల గుర్తింపు ప్రక్రియ జరుగుతోంది. కేంద్రీయ పశు నమోదు పథకం ప్రతినిధి డి.రాజేశ్వరరావు పశువుల వద్దకు వెళ్లి మేలుజాతి పాడి గేదెల పాల దిగుబడిని లెక్కిస్తున్నారు. ఇందులో భాగంగా అబ్బుకు చెందిన గేదె ఒక రోజు 26.59 లీటర్ల పాల దిగుబడిని ఇచ్చిందని రాజేశ్వరరావు తెలిపారు. రెండో ఈతలోనే ఈస్థాయిలో దిగుబడి వస్తే మున్ముందు మరింత పెరుగుతుందని ఆయన చెప్పారు. అత్యధిక దిగుబడినిచ్చే పాడి పశువుల వివరాలను సెమన్ సేకరణ కేంద్రాలకు పంపుతామని, వీటి ద్వారా మేలుజాతి పాడి పశువుల పునరుత్పత్తికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాజేశ్వరరావు తెలిపారు.

నగర వార్తలు

'కాకరాల'కు రావి కొండలరావు స్మారక పురస్కారం

ఫిబ్రవరి 12న పురస్కార ప్రదానం



లక్డీకాపూల్: ప్రముఖ రంగస్థల, చలనచిత్ర నటుడు కాకరాల (కాకరాల సత్యనారాయణ) రావి కొండలరావు స్మారక నగదు పురస్కారానికి ఎంపికయ్యారు. రావు కొండలరావు జ్ఞాపకార్థం సాహిత్య సంగీత సమాఖ్య ఆయన 90వ జయంతి సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేయనుంది. రావి కొండలరావు పేరిట ఏటా నాటక, సినిమా, సంగీత రంగంలో కృషి చేసిన కళాకారులను నగదు పురస్కారంతో సత్కరిస్తున్నారు. 2021 నుంచి ప్రవేశపెట్టిన ఈ పురస్కారాన్ని తొలుత ప్రముఖ రంగస్థల హార్మోనిస్టు తీట్ల రాజబాబుకు, 2022 సంవత్సరానికి గాను పి.వి. రమణ (కాకినాడ రమణ)కు ఈ పురస్కారాన్ని అందజేశారు. 2023 సంవత్సరానికి ప్రముఖ రంగస్థల, సినీ నటుడు కాకరాలను ఎంపిక చేసినట్లు సంస్థ అధ్యక్షులు ఆచారం షణ్ముఖాచారి తెలిపారు. రావి కొండలరావు రచించి దర్శకత్వం వహించిన కుక్కపిల్ల దొరికింది, నాలుగిళ్ల చావిడి, ప్రొఫెసర్ పరబ్రహ్మం, వైకుంఠపాళి తదితర నాటకాల్లో కాకరాల నటించడం విశేషమన్నారు. వామపక్ష భావాలను అభిమానించే కాకరాల ప్రజా నాట్యమండలి ద్వారా రంగస్థల నటుడిగా గుర్తింపుపొందారన్నారు. 1966లో ప్రముఖ దర్శక నిర్మాత బి.ఎన్. రెడ్డి నిర్మించిన 'రంగులరాట్నం' ద్వారా కామెడీ విలన్ గా చలనచిత్ర రంగప్రవేశం చేశారు. బి. నరసింగరావు నిర్మించిన 'మా భూమి', 'రంగుల కల' చిత్రాల్లో ప్రధాన పాత్ర పోషించారని ఆయన వివరించారు.

భీమ జ్యువెల్స్ బంఫర్ ఆఫర్

సాక్షి,సిటీబ్యూరో: ప్రముఖ రిటైల్ జ్యువెల్లర్ సంస్థ భీమ జ్యువెల్స్ ఆభరణాలపై బంపర్ ఆఫర్ ప్రకటించింది. బంగారు ఆభరణాల తరుగుపై 25 శాతం వరకు తగ్గింపు, సమానమైన వెండి నాణేలు, వజ్రాభరణాలపై ప్రతి క్యారెట్‌కు రూ. 12,000 తగ్గింపు, ప్రతి క్యారెట్‌కు 25 గ్రాముల వెండి నాణేలు ఉచితంగా అందజేస్తున్నట్లు జ్యువెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ అభిషేక్ బింధు మాదవ్ సోమవారం వెల్లడించారు. ప్రతి కిలో వెండి ఆభరణాలు, వస్తువులపై వినియోగదారులకు ఫ్లాట్‌రూ. 3వేలు తగ్గింపు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

డోనర్స్ @ డోర్‌స్టెప్

- రక్తదానానికి సరికొత్త యాప్
- అత్యవసరమైన రోగుల దగ్గరకే 'యు బ్లడ్'
- నగరం కేంద్రంగా దేశవ్యాప్త సేవలు



లక్డీకాపూల్ : సైన్స్ ఎంత అభివృద్ధి చెందినా రక్తాన్ని కృత్రిమంగా ఎవరూ తయారు చేయలేరు.. మనుషుల నుంచి మనిషికి అవసరమయ్యే ఒక విశ్వజనీత రక్తం. రక్తదానం ఎన్నో ప్రాణాలను నిలబెడుతుంది. ఇటీవలి కాలంలో రక్తం కొరత కారణంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని జూబ్లీహిల్స్ కేంద్రంగా 'యూ బ్లడ్' పేరిట ప్రత్యేకమైన సామాజిక వేదిక ఏర్పాటైంది. ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ నిమ్స్, ప్రభుత్వ అనుసంధానకర్త డాక్టర్ మార్త రమేష్‌తో కలిసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యాప్ రోగి, రక్తదాత మధ్య అనుసంధానకర్తగా వ్యవహరిస్తుంది. దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితుల్లో రక్త కావాల్సిన వారికి ఆన్‌లైన్‌లోనే రక్తం అందించేందుకు యూ బ్లడ్ నిర్మాణాత్మక పాత్రను పోషిస్తుంది. ముఖ్యంగా ఈ యాప్ అవసరమైన సమయాల్లో ఒక జీవితాన్ని రక్షించడానికి సిద్ధంగా ఉన్న దాతను కనెక్ట్ చేయడమే లక్ష్యంగా పని చేస్తుంది. బాధితులు చేయాల్సిందల్లా తమ తమ మొబైల్ అప్లికేషన్, వెబ్ ప్లాట్‌ఫారమ్ ద్వారా ఆన్‌లైన్‌లో రక్తదాతలను గుర్తించడమే. దేశంలో ఏ మూలన రోగి ఉన్నా సకాలంలో రక్తం అందించేందుకు 'యూ బ్లడ్' వెసులుబాటు కల్పిస్తుంది. ఈ క్రమంలో మునుపెన్నడూ లేని విధంగా అత్యవసర సమయాల్లో దాతలను కనుగొనే ప్రక్రియను యూ బ్లడ్ క్రమబద్ధీకరిస్తుంది. తమ యాప్‌కు మంచి ఆదరణ లభిస్తుందని యూ బ్లడ్ నిర్వాహకులు శంకర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన నిమ్స్ ఆస్పత్రిలో 'సాక్షి'తో యూ బ్లడ్ యాప్ ప్రయోజనాలను వివరించారు. తమ యాప్ ద్వారా ఫలానా గ్రూప్ రక్తం కావాలని ఆన్‌లైన్‌లో కోరిన మరుక్షణంలో అందుబాటులో ఉన్న రక్తదాత జాబితా ఆవిష్కృతమవుతుందన్నారు. రక్తదాతలను సైన్ అప్ చేయడంలో యు బ్లడ్ సహాయపడుతుందని, అంతే కాకుండా ఒక సాధారణ అభ్యర్థనతో కమ్యూనిటీ అందుబాటులోకి వస్తుందన్నారు. దాతల సహకారంతో 'యు బ్లడ్' వేసే అడుగు ప్రాణపాయస్థితిలో ఉన్న వారికి కొత్త జీవితాన్ని అందిస్తుందన్నారు. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని శంకర్ పేర్కొన్నారు.

బెస్ట్ ఉర్దూ టీచర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఈ నెల 31 వరకు అవకాశం

సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉర్దూ స్కూళ్లలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన టీచర్లకు ఉర్దూ అకాడమీ ద్వారా బెస్ట్ టీచర్ అవార్డు అందజేస్తున్నట్లు అకాడమీ చైర్మన్ మహ్మద్ ఖాజా ముజీదుద్దీన్ తెలిపారు. సోమవారం నాంపల్లి హజ్ హౌస్‌లోని ఉర్దూ అకాడమీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ స్కూల్, యూనివర్సిటీ విభాగంలో ఉపాధ్యాయులకు, అధ్యాపకులు ఇస్తున్న అవార్డుల వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని ఉర్దూ మీడియం స్కూల్ టీచర్లు అవార్డుల కోసం ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల పనితనంతో పాటు వారి ఆధ్వర్యంలో విద్యార్థులు సాధించిన మార్కులు పరిగణలోకి తీసుకుంటామన్నారు. ప్రతి జిల్లాకు ఐదుగురు ఉపాధ్యాయుల చొప్పున ఎంపిక చేసి 165 టీచర్లకు అవార్డులు అందజేస్తామన్నారు. అదేవిధంగా ఉర్దూ యూనివర్సిటీ విభాగంలో ఇద్దరు అధ్యాపకులకు, మెడికల్ యూనివర్సిటీ విభాగంలో ఇద్దరు అధ్యాపకులు కూడా ఈ అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఉర్దూ భాషాభివృద్ధి కోసం అకాడమీ అహర్నిశలు కృషి చేస్తుందని, ఇందులో భాగంగా ప్రభుత్వ ఉర్దూ స్కూళ్లలో మౌలిక సదుపాయలు కల్పించాలనే ఉద్దేశంతో ఉర్దూ అకాడమీ ప్రత్యేక పథకం అమలు చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఒక్కో ప్రభుత్వ ఉర్దూ స్కూలుకు రూ. 50వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నిధులను పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు వెచ్చించవచ్చునన్నారు. ఇందుకు ప్రభుత్వ ఉర్దూ మీడియం స్కూళ్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'హెర్బ్' యాప్ ఇబ్బందులను తొలగిస్తాం..

- ఏపీ ఖజానా సంచాలకుల హామీ :
- ఏపీ పెన్షన్‌దార్ల సంఘం వెల్లడి

లక్డీకాపూల్ : పెన్షన్ దార్ల సౌకర్యార్థం కొత్తగా ప్రవేశపెట్టిన 'హెర్బ్'యాప్‌లో నెలకొన్న ఇబ్బందులను తొలగిస్తామని ఆంధ్రప్రదేశ్ ఖజానా సంచాలకులు హామీ ఇచ్చారని హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఆంధ్రప్రదేశ్ పెన్షన్ దార్ల సంఘం ప్రధాన కార్యదర్శి టి.ఎం.బి.బుచ్చిరాజు తెలిపారు. ఈ విషయంలో పెన్షన్‌దారులు ఆందోళన చెందవద్దని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. హెర్బ్ యాప్‌లో ఆధార్, మొబైల్ లింకు కు సంబంధించిన సమస్యతో పాటు, ఆ యాప్‌లో ఎలాంటి డేటా లేని విషయాన్ని ఖజానా సంచాలకుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ యాప్ ద్వారా వచ్చిన పాస్‌వర్డ్ టైప్ చేసిన తర్వాత నో క్రెడిన్షియల్ అని, ఆంధ్రప్రదేశ్ పెన్షన్ దారులు వేరే ప్రాంతాల్లో ఉన్నట్లయితే ఆ ప్రాంతాలను జోడించడంలో ఏర్పడిన ఇబ్బందులను సంచాలకునికి వివరించామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన హెర్బ్ యాప్‌లో ఎదురవుతున్న ఇబ్బందులను పూర్తిలో తొలగిస్తామని హామీ ఇచ్చారన్నారు.

నాయీ బ్రాహ్మణ వృత్తిని కాపాడాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా గాయకుడు గద్దర్

అల్వాల్: అల్వాల్ కంటోన్మెంట్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం భవనానికి స్థలం కేటాయించాలని, కార్పొరేట్ సంస్థల బారి నుంచి తమ వృత్తిని కాపాడాలని నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు అన్నారు. సోమవారం అల్వాల్ కంటోన్మెంట్ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అల్వాల్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా గాయకుడు గద్దర్, సామాజిక వక్త పరమేశ్వరును సంఘం గౌరవ సలహాదారులుగా నియమించారు. వారి చేతుల మీదుగా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గద్దర్ మాట్లాడుతూ అల్వాల్‌లో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు సంఘం ప్రతినిధులు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించారని, తమ సంఘం భవనానికి స్థలం ఇప్పించాలని కోరారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లిని కలిసి విజ్ఞప్తి చేయాలని సూచించారు. కులవృత్తులను కాపాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంరావు, సుమన్ నాయక్, జాన్‌పాల్, కుమార్, లింగరాజు, అనంద్‌సాగర్, శ్రీనివాస్, అనిల్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు కాంగ్రెస్ వ్యతిరేకం



మాట్లాడుతున్న మాజీ టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దేశంలో ప్రైవేటీకరణ విధానానికి తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకమని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కొందరు బడా పారిశ్రామిక వేత్తల ప్రయోజనాల కోసమే కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను విక్రయిస్తుందని ఆరోపించారు. సోమవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో 'నేషనల్ యూనియన్ ఆఫ్ రైల్వే మేల్ సర్వీసెస్', 'మెయిల్ మోటర్ సర్వీసెస్ ఎంప్లాయీస్ యూనియన్' ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పోస్టల్ ఉద్యోగుల సమస్యలను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యలను పార్లమెంట్‌లో చర్చిస్తానన్నారు.

- ఎల్ఐసీ, రైల్వే, బీఎస్ఎన్ఎల్, పవర్ ప్రాజెక్టులు, ఎయిర్‌ఫోర్స్ తదితర పరిశ్రమలను ప్రైవేట్ పరం చేయటం దారుణమన్నారు. భారత్ దేశ నిర్మాణంలో ప్రభుత్వరంగ సంస్థలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని, వాటిని అమ్మేయడం సరికాదన్నారు.
- లక్షల కోట్ల ప్రభుత్వ ఆస్తులను అమ్ముతున్నారని సికింద్రాబాద్ లాలాగూడలోని రూ.100 కోట్ల రైల్వే ఆస్తులను అమ్మేశారని ఆరోపించారు. ఇలాంటి చర్యలు దేశానికే ప్రమాదకరమని, సమాజం మౌనంగా ఉంటే సరిపోదని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. యూనియన్ సర్కిల్ కార్యదర్శి పాండు, అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, కార్యదర్శి రమేష్‌బాబు, కె.యాదగిరి, కార్యదర్శి శ్యామ్‌సుందర్, ఫిరోజ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పురాతన తెలుగు రాతప్రతుల ప్రదర్శన

రాయదుర్గం: హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పురాతన తెలుగు రాత ప్రతుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అతి పురాతనమైన 'నీలాసుందరి పరిణయం-రుక్మంగద చరిత్ర, మహాభారతం వంటి వాటి చరిత్రల రాత ప్రతులను ప్రదర్శనలో ఉంచారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహనా కార్యక్రమంలో ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ అండ్ రీసెర్చ్ సెంటర్ ఏపీ, తెలంగాణ డైరెక్టర్ డాక్టర్ పి సుబ్బారావు మన నాగరికతకు వెన్నెముక అయిన మాన్యుస్క్రిప్ట్‌ల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వివిధ రకాల మాన్యుస్క్రిప్ట్‌లపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ పిల్లల మర్రి రాములు మాట్లాడుతూ చరిత్రను ముఖ్యంగా తెలుగు ప్రాంత చరిత్రను తెలుసుకోవడంలో రాత ప్రతుల ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. కార్యక్రమానికి సామాజిక శాస్త్రాల డీన్ ప్రొఫెసర్ వైపె సుధాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో హిస్టరీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి ఈశ్వరరావు, ఇతర ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు

అప్రెంటిస్‌షిప్ సంస్కరణలపై నేడు వర్క్‌షాప్

సాక్షి, సిటీబ్యూరో: అప్రెంటిస్‌షిప్ ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు యువత అప్రెంటిస్‌షిప్‌ను స్వీకరించేలా ప్రోత్సహించేందుకు, సంస్కరణలపై అవగాహన పెంచేందుకు నైపుణ్యాభివృద్ధి వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డీఈ) ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అంబర్‌పేట్‌లోని జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థ ప్రాంగణంలో జరిగే ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఐ రాణి కుముదిని ప్రారంభించనున్నారన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో 250కు పైగా వర్క్‌షాప్‌లను ఎంఎస్‌డీఈ నిర్వహించనుందని తొలి వర్క్‌షాప్ నగరంలో జరుగుతోందన్నారు. సంస్థలు, ఔత్సాహికులు, భాగస్వాముల మధ్య అప్రెంటిస్‌షిప్ సంస్కరణల పట్ల అవగాహన కల్పించనున్నామన్నారు.



అమ్మకు ఆరోగ్యం బాగోలేకపోతే..
కూతురు అమ్మకు అమ్మ అవుతుంది.
నాన్న మనసుకు కష్టం కలిగితే..
కూతురు చేయి ఓదార్పు అవుతుంది.
ఈ పదేళ్లలో ప్రభుత్వాలు, ప్రజలలోనూ
బాలికలకు సంబంధించిన సమస్యలపై శ్రద్ధ పెరిగింది.
ప్రపంచ వేదికపై బాలికలు తమ గళాన్ని వినిపించడానికి
మరిన్ని అవకాశాలు పెరిగాయి.
అయినప్పటికీ, బాలికల హక్కులపై
అవగాహన పరిమితంగానే ఉంది.
బాలికలు తమ సామర్థ్యాన్ని నెరవేర్చుకోవడానికి
సమాజంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు
వారి అడుగులకు మరింత ఊతాన్ని ఇవ్వాల్సిన తరుణమిది.
'నేషనల్ గర్ల్ చైల్డ్ డే' సందర్భంగా
ఈ విషయంపై దృష్టి సారిద్దాం..

నేషనల్ గర్ల్ చైల్డ్ డే

ఒక్క చిరునవ్వు... కోటి కాంతులు

'కూతుళ్ళే మన భవిష్యత్తు' అనే మాటని మన ప్రధాని నరేంద్రమోదీ వివిధ సందర్భాలలో చెప్పడం పదే పదే విన్నాం. వివిధ రంగాలలో మహిళల విజయాలను గుర్తిస్తున్నాం. ఆడపిల్లల సాధికారతకు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం. అయినా 'ఆమె' పురోగతికి కుటుంబం, సమాజం చేయాల్సిన కృషి ఎంతో ఉంది.

కుటుంబంలో స్కీమ్స్

ఒకప్పుడు కూతురు ఇంటి గుండె మీద కుంపటి. ఇప్పుడు కుటుంబ సమస్యలను ఓ దరిచేర్చగల చుక్కాని. అందుకే పుట్టేది ఆడపిల్లైనా, మగపిల్లవాడైనా 'సరే' అనే దిశకు కుటుంబం చేరుకుందనే చెప్పాలి. కానీ, 'ఆమె' పెరుగుదలలో ఇంటి నుంచే ఎన్నో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. అందుకు తల్లితండ్రులే అమ్మాయిలను ప్రోత్సహించడానికి స్కీమ్స్ పెడుతుండాలి. ఆమె కలలకు, ఆశయాలకు మద్దతునివ్వాలి. ఎలాంటి సమస్య అయినా 'పరువు' అనే భయంతో కాకుండా బలమైన వెన్నుగా నిలవాలి.

డిజిటల్ జనరేషన్, అవర్ జనరేషన్

ఈ నినాదం ఇప్పుడు బాలికలకు అత్యవసరమైనది. డిజటల్ యుగంలో 'ఆమె'కు వాటి వినియోగంలోనూ పూర్తి అవగాహన అవసరం. ఇప్పటికే అబ్బాయిలతో పోల్చితే అమ్మాయిలు డిజిటల్ పరికరాల వాడకంలో వెనకంజలో ఉన్నట్టు ప్రపంచవ్యాప్త అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. డిజిటల్ మాధ్యమం ద్వారా అమ్మాయిలను ప్రభావంతంగా మార్చే మానవ ఆసక్తి కథనాలు, బ్లాగ్‌లు, వీడియోలు, రీసోర్సింగ్ చేసే స్ఫూర్తిదాయకమైన నెట్‌వర్క్‌లు, సంస్థల గురించి తెలుసుకునే అవకాశాలను కల్పించాలి.

చట్టం.. హక్కులు

సమాజంలో ధైర్యంగా, శక్తిమంతంగా ఎదిగేందుకు ఆమె చుట్టూ ఉన్న రక్షణ, న్యాయ వ్యవస్థల గురించి తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఇందుకు కుటుంబంతోపాటు ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనది.

నాయకత్వాన్ని పెంచుదాం

అవగాహన 'ఆమె'కు అవకాశాలను విస్తృతం చేస్తుంది. నాయకత్వాన్ని ఎంచుకునేలా ఎదగాలంటే ..

- మన ప్రాంతంలోని అమ్మాయిలను వెనక్కి నెట్టివేసే అంశాల గురించి అవగాహన పెంపొందించడంలో, వాటిని పరిష్కరించడంలో ముందుండాలి.
- బాలికలకు అందాల్సిన సేవలను మరింతగా బలోపేతం చేయాలి. ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా వారి నాయకత్వం, చర్యలు, ప్రభావాన్ని సమష్టిగా విస్తరింపజేయాలి.
- ప్రపంచవ్యాప్తంగా బాలికలు లింగ అసమానత, వివక్షకు గురవుతున్నారనేది వాస్తవం. ఇవి బాలికలను ప్రతిచోటా వెనకడుగు వేయిస్తున్నాయి. అందుకే లైంగిక వేధింపులు, హింస, అసమానతలు, హక్కుల గురించి అవగాహన కల్పించడంలో వెనకంజ వేయకూడదు.
- విద్య, ఆరోగ్యం, పోషకాహార ప్రాముఖ్యతలను తెలియజేయడమే కాదు వాటిని అందించడంలోనూ ముందంజలో ఉండాలి.
- అమ్మాయిలు తమలోని ప్రతిభను కనబరచడమే కాకుండా పూర్తి స్వేచ్ఛతో జీవించే అవకాశాన్ని కల్పించాలి.
- చాలా ప్రాంతాలలో అమ్మాయిలను త్వరగా పెళ్లి చేసుకోమని బలవంతం చేయడం లేదు. అయినా, ఎలాంటి హింస జరిగినా ఆడపిల్లలకు తమ గొంతు వినిపించే హక్కు ఉంది. ఈ విషయాన్ని వారికి తప్పక తెలియజేయాలి.
- రోల్ మోడల్స్‌గా ఉన్నవారిని బాలికలకు పరిచయం చేయిస్తూ ఉండాలి. బాలికా నాయకత్వం పట్ల ప్రజలలో అవగాహనను పెంచాలి.
- అలజడులు, వలసలు, ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో సామాజిక సహాయ సేవలను పొందుతున్నప్పుడు బాలికలు అనుభవించే అసమానతలను పరిష్కరించడానికి అధికారులు, విధాన నిర్ణేతలు మరింతగా దృష్టి సారించాలి.

ఒక ఆడపిల్ల తన స్వచ్ఛమైన చిరునవ్వుతో ఇంటిని ప్రకాశవంతం చేస్తుంది. జీవితాన్ని ఎలా గడపాలో నేర్పేది ఆమె. కుటుంబంలో ప్రతి ఒక్కరినీ ప్రేమలో పడేలా చేసే స్వచ్ఛమైన ఆత్మ. కాబట్టి ప్రతి ఇంటినీ తన నిస్వార్థ ప్రేమతో, ప్రకాశంతమైన కాంతితో నింపే ఆమె భవిష్యత్తును ఉజ్వలం చేద్దాం. సమాజంలో సమానమైన అవకాశాలను కల్పించడానికి ప్రయత్నిద్దాం.

ఇందిరాగాంధీ 1966 జనవరి 24న దేశానికి మొదటి మహిళా ప్రధానమంత్రి అయ్యారు. అందుకే ప్రభుత్వం ఈ రోజుని జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకోవడానికి ప్రత్యేకంగా ఎంచుకుంది. భారత ప్రభుత్వం 2008లో ఆడపిల్ల పట్ల సమాజంలో చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జనవరి 24ని జాతీయ బాలికా దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించింది.

బాల్య ముద్రలు

ఆ నీలి రంగు గౌను

బాల్యం మళ్లీ దొరకని
సీతాకోకచిలుక.
బాల్యం మనిషికి
తన అమలిన రూపాన్ని చూపే అద్దం.
బాల్యాన్ని తలుచుకోని వారు ఉండరు.
బాల్యం ఏర్పరిచే గాఢమైన ముద్రలే
మనిషి భవిష్యత్తు ప్రయాణాన్ని
ప్రభావితం చేస్తాయి.
'నా గురించి నేను
రాసుకోవాలనుకున్నప్పుడు
ఎన్ని సినిమాలు చేశాను,
ఎవరితో సినిమాలు చేశాను
రాయాలనిపించ లేదు.
నా బాల్యం గురించే రాసుకోవాలనిపించింది'
అంది నటి దీప్తి నావల్.
'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆమె
తన పుస్తకం 'ఏ కంట్రీ కాల్డ్ చైల్డ్‌హుడ్'
గురించి మాట్లాడింది.
బాల్య జ్ఞాపకాలు పంచుకుంది.



'నాకు ఊహ తెలిశాక వచ్చే మొదటి జ్ఞాపకం... ఒక రోజు సాయంత్రం మా ఇంట్లో అమ్మ లేదు. జీజిని అడిగితే ఉత్తుత్తికే సినిమాకెళ్లిందిలే అంది. అమృత్‌సర్‌లో మా ఇల్లు హాల్ బజార్‌లో ఉండేది. సినిమా హాలు మా ఇంటి దగ్గరే. నేను ఇంట్లో నుంచి బయటకు గెంతి అమ్మ దగ్గరకు వెళతాను అని సినిమా హాలు వైపు పరిగెత్తాను. నాకు బాగా గుర్తు. అప్పుడు గాలి దుమారం రేగింది. వీధిలో చెత్త పైకి రేగింది. షాపులు దుమ్ముతో నిండిపోయాయి. నేను మాత్రం హాలు వైపు పరిగెడుతూనే ఉన్నాను. నా వెనుక మా జీజీ. ఆ గాలిలో అర్థమయ్యీ కాక ఎటు వెళ్లేదాన్నోగాని మా జీజి గబుక్కున నన్ను జవురుకొని ఇంటికి తీసుకెళ్లింది. తీసుకెళ్లాక ఆమె అన్న మాట– మంచి ఇంటి ఆడపిల్లలు సినిమా కు వెళ్లకూడదమ్మా అని. ఏ ముహూర్తాన ఆమె ఆ మాట అన్నదో (నవ్వు). నా జీవితం మొత్తం సినిమాల్లోనే గడిచింది'....

•••

'సినిమాల్లో నేను ఎన్నో కాస్ట్యూమ్స్ తొడుక్కుని ఉంటాను. రోజువారీ జీవితంలో ఫ్యాషన్లు ఫాలో అయి ఉంటాను. కాని నాకు ఇష్టమైన బట్టలు అంటే చిన్నప్పుడు నేను తొడుక్కున్న నీలి రంగు గౌనే. ఆ కథ నాకు చాలా ఇష్టం.

అప్పుడు నాకు పదేళ్లు ఉంటాయి. మా ఇంటికి ఏదో మేగజీను వచ్చేది. అందులో ఒక అడ్వర్టయిజ్‌మెంట్‌లో ఇద్దరు పాపలు ఒకే లాంటి నీలి రంగు గౌన్‌లలో నిలబడి ఉంటారు. మా అమ్మ ఆ ఫొటో చూసి' పండక్కు ఇలాంటి గౌన్లు వేయాలి మీకు' అంది నాతో మా అక్కతో. దీపావళి పండగ దగ్గర్లో ఉంది. దీపావళికి కొత్త బట్టలు తొడుక్కుని టపాకాయలు కాల్చడం ఆనవాయితీ. మా అమ్మ ఇంట్లో ఒక తెల్ల గుడ్డ ఉంటే మమ్మల్ని తీసుకుని అద్దకం దుకాణానికి తీసుకు వెళ్లింది. మేగజీన్‌లోని ఫొటో చూపించి ఆ బట్టకు అదే రంగు నీలం వేయమని చెప్పింది. అతడు తలాడించాడు. మామూలు నీలం కాదు ఇది... పర్షియన్ నీలం... అలాగే ఉండాలి అంది మా అమ్మ. అతను మళ్లీ సరే అన్నాడు. మొత్తం మీద నీలంగుడ్డ మా ఇల్లు చేరింది. ఇక గౌనుగా మారాలి.

మా అమ్మకు బట్టలు కుట్టడం ఆసక్తే అయినా పండగ బట్టలు కాబట్టి మా వీధిలో ఉండే శిక్కు దర్జీకి ఇచ్చింది. ఆయన అప్పటికే కుప్పలు తెప్పలుగా పండగ గుడ్డలు కుట్టే పనిలో ఉన్నాను. పండక్కు ఇస్తానని మాట ఇచ్చాడు. మా ఇంటి నుంచి ఆ దర్జీ షాపు కనిపిస్తుంది. నేను మా అక్క రోజూ షాపు వైపు చూసేవాళ్లం. షాపు దాకా వెళ్లి మా గుడ్డ కదిలిందో లేదో చూసేవాళ్లం.

పండగ వచ్చింది. సాయంత్రమైపోయింది. అందరూ టపాకాయలు కాల్చడం మొదలెట్టారు. మేమిద్దరం మాకు చేరని నీలి రంగు గౌన్లను తలచుకుని మొహం మాడ్చుకుని కూచున్నాం. టపాకాయలు కాల్చలేదు. ఏడూ ఎనిమిది అయిపోయింది. మా బజార్‌లో షాపులన్నీ మూత పడిపోయాయి. దర్జీ షాపు లైటు ఒక్కటే వెలుగుతూ ఉంది. ఆ తర్వాత భోజనాలు చేశాం. వీధిలో టపాకాయల మోత ఆగిపోయింది. మేము పైజామాల్లోకి మారి నిద్రపోబోతున్నాం. అప్పుడు మా ఇంటి గేటు తట్టిన చప్పుడు అయ్యింది. నేను పరిగెత్తాను ఎవరొచ్చారో అర్థమయ్యి. ఆలస్యానికి మన్నింపు కోరుతున్న ముఖంతో రెండు నీలం రంగు గౌన్లు పట్టుకుని దర్జీ.

ఓ.. మేము వెంటనే ఆ గౌన్లు తొడుక్కుని అప్పుడు పండగ మొదలెట్టాం. టపాకాయలు కాల్చి వీధి వీధంతా నిద్ర లేపాం. పదే పదే నేను ఇష్టంగా తలచుకునే జ్ఞాపకం ఇది.

•••

మా అమ్మ అప్పుడప్పుడు పొరుగునే ఉన్న పేదపిల్లల బడికి వెళ్లి పాలు పంచి వచ్చేది. ఒకరోజు అమ్మతో పాటు నేనూ వెళ్లాను. చాలా మంది చిన్న పిల్లలు అమ్మ దగ్గరకు వచ్చి ఆమె పంచుతున్న పాలు తీసుకుని తాగి సంబర పడ్డారు. మేము తిరిగి వస్తుంటే ఒక పిల్లాడు పరిగెత్తుకుంటూ గిన్నె పట్టుకుని వచ్చాడు. 'అయ్యో... నాన్నా పాలు అయిపోయాయి. ఇంత ఆలస్యం ఏంటి?' అంటే వాడు నిరాశ నిండిన ముఖంతో 'మా ఇంట్లో గిన్నె లేదు. అమ్మ వేరే ఇంటి నుంచి తెచ్చి ఇచ్చింది' అన్నాడు.

మన దేశ పేదరికం గురించి నా మనసు మీద శాశ్వత ముద్ర వేసిన సంఘటన అది.

•••

నాకు పద్నాలుగేళ్లు ఉండగా నా స్నేహితురాలికి మానసిక ఆరోగ్యం దెబ్బ తింది. ఆ రోజుల్లో పిచ్చి పట్టడం అంటే వారిని బహిష్కరించడమే. ఆ అమ్మాయికి అలా కావడంతో నేను చాలా డిస్ట్రబ్ అయ్యాను. ప్రతి వీధిలో చాలామంది ఆడవాళ్లు అలాంటి స్థితిలో కనిపించేవారు. మేము జట్కాలో స్కూలుకు వెళుతుంటే ఒకామె మా వెనుకే పరిగెత్తేది. నాకు చాలా బాధ కలిగేది. వారికి ఏదైనా చేద్దామనే నేను అమెరికాలో సైకాలజీ చదివాను. ఇప్పటికీ నేను మానసిక ఆరోగ్యం సరిగా లేని స్త్రీల గురించి ఆలోచిస్తాను. వారికి నేటికీ సరైన వైద్యం అందడం లేదు. నేను నా కవిత్వ పుస్తకంలో ఎన్నో కవితలు మానసిక ఆరోగ్యాన్ని కోల్పోయిన స్త్రీల గురించి రాశాను. రాస్తాను.

దీప్తి నావెల్ జీవితంలోని ఇలాంటి అనేక అంశాలు 'ఏ కంట్రీ కాల్డ్ చైల్డ్‌హుడ్'లో ఉన్నాయి.

– జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి

అమృత్ పత్తి అదుర్స్!





పత్తి తొలి దశలో మొక్కకు ఎక్కువగా వచ్చిన కొమ్మలు.. కాయలను చూపుతున్న రైతు విజయ్ (ఫైల్)



మొదటి రెండు వరుసల మధ్య 4 అడుగులు, తర్వాత రెండు వరుసల మధ్య 6 అడుగుల దూరం చొప్పున పాటించి సాగు చేసిన పత్తి చేను

ఎకరానికి 20 క్వింటాళ్ల పత్తి దిగుబడి సాధించిన ఆదిలాబాద్ జిల్లా రైతు

మహారాష్ట్రకు చెందిన రైతు శాస్త్రవేత్త అమృత్‌రావు దేశ్‌ముఖ్ రూపొందించిన పద్ధతి ఇది

పత్తి దిగుబడుల పరంగా ఎకరానికి 20 క్వింటాళ్లు సాధించిన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం కొల్హారికి చెందిన యువ రైతు ఫడ్ విజయ్ ఆదర్శంగా నిలుస్తున్నారు. రెట్టింపు దిగుబడి సాధించిన విషయం ఆ నోటా ఈ నోటా తెలుసుకొని పరిసర గ్రామాల రైతులు ఆసక్తిగా పొలాన్ని చూసి వెళ్తున్నారు. సాధారణ సాగులో కొంత మందికి 6 నుంచి 8 క్వింటాళ్లు, మరికొంత మందికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అయితే, ఈ రైతు ఏకంగా రెట్టింపు కంటే అధిక దిగుబడి సాధించడమే రైతులను ఆకర్షిస్తోంది.

ఫడ్ విజయ్‌కు మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా అంబోడ గ్రామంలో చుట్టాలు ఉన్నారు. ఒకసారి ఆ గ్రామానికి వెళ్లినప్పుడు అక్కడ అమృత్ ప్యాటర్న్‌లో సాగు చేయడాన్ని గమనించాడు. దిగుబడి అధికంగా వస్తుందని ఆ రైతులు చెప్పడంతో ఆ వైపు మొగ్గు చూపాడు.

అమృత్ పద్ధతి అంటే..?

యవత్‌మాల్ జిల్లా మహాగావ్ తాలూకా అంభోద గ్రామానికి చెందిన రైతు శాస్త్రవేత్త అమృత్‌రావు దేశ్‌ముఖ్ తన క్షేత్రంలో అనేక ఏళ్ల పాటు ప్రయోగాలు చేసి ఈ సాగు పద్ధతిని రూపొందించారు. అందువల్లనే అమృత్ ప్యాటర్న్ అని పేరు వచ్చింది. ఏకంగా 50 క్వింటాళ్ల వరకు ఎకరంలో పత్తి దిగుబడి సాధించిన ఘనత ఆయనిది.

ఆదిలాబాద్ జిల్లాలో సాధారణంగా పత్తి సాగులో రైతులు మొక్కల మధ్య కొంచెం అటూ ఇటుగా ఒక అడుగు, వరుసల మధ్య 3 నుంచి 4 అడుగులు లేదా 4 నుంచి 5 అడుగుల దూరం పాటిస్తారు. అమృత్ ప్యాటర్న్‌లో మొక్కల మధ్య దూరం కచ్చితంగా ఒక అడుగు ఉండే చూస్తారు. ఒక వరుస మధ్య 4 అడుగులు, ఆ పక్కన వరుస మధ్య దూరం 6 అడుగుల దూరం పాటిస్తారు. అంటే.. మొదటి రెండు వరుసల మధ్య దూరం నాలుగు అడుగులు.. రెండు, మూడు వరుసల మధ్య ఆరు అడుగుల దూరం అనుసరిస్తారు. ఇదే తీరులో చేనంతా పాటిస్తారు. ఇదే విధానాన్ని విజయ్ అవలంభించారు.



ఏడు అడుగులు పెరిగిన పత్తి చేనులో విజయ్

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

అమృత్ పద్ధతిని అవలంభించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధ్యమవుతుంది. ఎరువులు, పురుగుల మందులు ఎక్కువగా వాడే అవసరం పడదు. కలుపు తీయడంతో పాటు ఎరువులు, మందుల ఖర్చుల్లో చాలా ఆదా అవుతుంది. అధిక సాంద్రతతో పూత, కాత రావడం జరుగుతుంది.



– సాయిప్రణీత్
(96768 83233),
వ్యవసాయ విస్తరణాధికారి,
కొల్హారి గ్రామం

నెల తర్వాతే ఎరువులు..

పత్తి సాగులో మొదటి నెల రోజుల పాటు ఎలాంటి ఎరువులు, పురుగుమందులు వాడలేదు. ఇలా చేయటం వల్ల మొక్కకు కొమ్మలు ఎక్కువగా వస్తాయి. విత్తిన నెల తర్వాత ఎకరాకు ఒక బ్యాగు 10:26:26 వేశారు. ఆ తర్వాత నెలలోనూ అదే మోతాదులో అదే ఎరువుతో పాటు అతి తక్కువ ధరకు లభ్యమయ్యే పురుగుల మందు వాడినట్టు వివరించారు. మూడో నెల తర్వాత 5 కేజీల సల్ఫర్, ఆ తర్వాత 25 కేజీల మెగ్నీషియం నెలకు అందిస్తే సరిపోతుందని విజయ్ తెలిపారు. తద్వారా ప్రతి మొక్కకు వచ్చే కొమ్మలైనా ప్రధాన కొమ్మ, పిల్ల కొమ్మలు చాలా తక్కువ దూరంలో వస్తాయని తెలిపారు. పూత, కాత ఎక్కువగా రావడంతో పాటు రాలిపోకుండా ఉంటాయని విజయ్ వివరించారు.

సాళ్ల మధ్య ఎక్కువ దూరం పెట్టడం వల్ల గాలి, వెలుతురు బాగా తగిలి అధిక దిగుబడి వస్తోంది. చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని అనుభవపూర్వకంగా విజయ్ చెబుతున్నారు. ఎకరానికి రూ. 20 వేలు ఖర్చయ్యింది. 20 క్వింటాళ్ల పత్తి తీసిన తర్వాత మళ్లీ నీటి తడి ఇచ్చారు. ఫలితంగా ముందుందు కూడా మరికొంత పత్తి దిగుబడి రావచ్చని విజయ్ ఆశిస్తున్నారు.

– గొడిసెల కృష్ణకాంత్ గౌడ్,
స్టాఫ్ రిపోర్టర్, సాక్షి, ఆదిలాబాద్.

సాగు పద్ధతి మార్చుకొని అధిక దిగుబడి సాధించా...

రెండేళ్ల కింద పత్తి సాగులో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. మహారాష్ట్రలో కొంతమంది రైతులు అవలంభిస్తున్న అమృత్ ప్యాటర్న్‌లో గతేడాది పత్తి సాగు చేశాను. కొన్ని కాయలు కూడా కుళ్లిపోయాయి. అప్పుడు 9 నుంచి 11 క్వింటాళ్ల మధ్య దిగుబడి వచ్చింది. అమృత్ విధానాన్ని పూర్తిస్థాయిలో పాటించకపోవడంతో దిగుబడి అంతకు పరిమితమైంది. రెండో ఏడాది.. గడిచిన వానా కాలంలో ఈ విధానంలో అమృత్ ప్యాటర్న్‌లో అన్ని పద్ధతులను పూర్తిస్థాయిలో అవలంభించాను. ఎకరానికి 20 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది.

– ఫడ్ విజయ్ (77024 42958),
ఇన్నోవేటివ్ పత్తి రైతు, కొల్హారి గ్రామం,
గుడిహత్నూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా

సాగుబడి
శ్రావణ కార్తె
జనవరి 24 నుంచి

మొబైల్ ఈవీ కూరగాయల కూలర్!

- తెలంగాణ నాబార్డ్ తోడ్పాటుతో రూపొందించిన పుణే స్టార్టప్ రుకార్ట్
- రైతులు, ఎఫ్.పి.ఓ.ల ఆదాయం 150% పెరిగే అవకాశం



చిన్న, సన్నకారు కూరగాయలు, పండ్ల రైతుల ఆదాయం పెంపొందించే లక్ష్యంతో మహారాష్ట్ర పుణేకు చెందిన నలుగురు ఐఐటీయన్లు 'రుకార్ట్' పేరిట స్టార్టప్ సంస్థను స్థాపించి ఏ రకమైన విద్యుత్తూ అవసరం లేని కూరగాయలు, పండ్లను నిల్వ ఉండే కూలర్‌ను రెండేళ్ల క్రితమే రూపొందించారు. ఇప్పుడు విద్యుత్ బ్యాటరీతో నడిచే వ్యాన్‌కు సబ్జీ కూలర్‌ను నాబార్డ్ తోడ్పాటుతో అనుసంధానించారు.

సబ్జీ (కూరగాయల) కూలర్‌లో వంద కిలోల ఆకుకూరలు, పువ్వులు, కూరగాయలను 4 నుంచి 6 రోజులు తాజాదనం పోకుండా నిల్వ చేయవచ్చు. అందుకు ఈ సబ్జీ కూలర్‌కు కావాల్సింది రోజుకు 20 లీటర్ల నీరు మాత్రమే. ఎటువంటి విద్యుత్తూ అవసరం లేదు. పర్యావరణ అనుకూలమైన 'మెరుగైన ఆవిరి శీతలీకరణ' ఆధారిత ఆటోమైజ్డ్ కోల్డ్ స్టోరేజీని రుకార్ట్ సంస్థ అందిస్తోంది.

ప్రత్యేక మెటల్‌తో తయారు చేసిన సబ్జీ కూలర్ గోడలోకి నీరు పోయాలి. బయటి వాతావరణంలో వేడి వల్ల ఈ నీరు ఆవిరవుతూ లోపలి కూరగాయలకు చల్లదనాన్నిస్తుంది.



ఇది ఉద్యాన ఉత్పత్తులను తాజాగా నిల్వ ఉంచడానికే కాదు.. అరటి, నిమ్మ, మామిడి, బొప్పాయి మొదలైన పండ్లను సహజంగా మగ్గబెట్టే గదిగా కూడా పనిచేస్తుందని తయారీదారులు చెబుతున్నారు.

సబ్జీ కూలర్ అరెకరం కూరగాయల లేదా పండ్ల తోట ఉన్న రైతుకు లేదా తన ఉత్పత్తులను నేరుగా అమ్ముకునే రైతుకు అనుకూలంగా ఉంటుంది. దీన్ని పొలం దగ్గర లేదా ఇంటి దగ్గర లేదా మార్కెట్‌లో ఆరుబయట, గోదాములలో సులువుగా ఏర్పాటు చేసుకోవచ్చు. 5 రాష్ట్రాల్లో రైతులు, బెంగళూరులోని సహజ సమృద్ధ ఆర్గానిక్ ప్రొడ్యూసర్స్ కంపెనీ, ఏలూరులోని హరిత మిత్ర వంటి ఎఫ్.పి.ఓ.లు, రిటైల్ అమ్మకందారులు ఇప్పటికి 425 సబ్జీ కూలర్లను ఉపయోగిస్తున్నారు.

మొబైల్ కూలర్‌తో మరింత ఆదాయం

తెలంగాణ నాబార్డు ఆర్థిక తోడ్పాటుతో రుకార్ట్ సంస్థ విద్యుత్ బ్యాటరీతో నడిచే మొబైల్ సబ్జీ కూలర్ వ్యాన్‌ను రూపొందించింది. సిద్దిపేట జిల్లా ములుగులోని రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్.పి.ఓ.)లో ఈ నెల 23న దీన్ని ఆవిష్కరించారు. తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్ముకొనే రైతులు, ఎఫ్.పి.ఓ.ల ఆదాయాన్ని 150% పెంపొందిస్తుందని మొబైల్ ఎలక్ట్రిక్ సబ్జీకూలర్ వ్యాన్ దోహదపడుతుందని రుకార్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరైన వికాస్ ఝా తెలిపారు.

మొబైల్ సబ్జీ కూలర్ పూర్తి చార్జింగ్‌తో గంటకు 25 కి. మీ. వేగంతో వంద కి.మీ. నడుస్తుంది. 350 కిలోల వరకు బరువు మోస్తుంది. కూరగాయలు, పూలు, ఆకు కూరల రంగు, తాజాదనం, దృఢత్వాన్ని కాపాడుతుంది. వృథాను 15% అరికడుతుంది. దీనిపై పెట్టే పెట్టుబడిని 7 నెలల్లోనే తిరిగి రాబట్టుకోవచ్చని వికాస్ ఝా వివరించారు. వివరాలకు.. 88790 49787, 88956 341918.

మార్చి నుంచి మెత్తళ్ల/పరిగెల సీడ్ సరఫరా



విటమిన్ 'ఎ' తదితర పోషకాలు పుష్కలంగా ఉండే చిరు చేపలు మెత్తళ్ల (పరిగెల) విత్తనోత్పత్తిలో శాస్త్రవేత్తలు సాధించిన విజయం గురించి ఈ నెల 10న 'సాక్షి సాగుబడి' కథనం ద్వారా తెలుసుకున్నాం కదా. మెత్తళ్ల సీడ్ మనకు ఎప్పటికి చేతికి అందుతుందీ అని పలువురు రైతులు ఆత్రుతను వ్యక్తపరిచారు. ఈ నేపథ్యంలో సీడ్ ఉత్పత్తి చేసిన హేచరీని 'సాక్షి' ఫోన్ ద్వారా సంప్రదించింది. మార్చి నెల నుంచి సీడ్‌ను విక్రయిస్తామని ఒడిషాలోని బిశ్వాల్ ఆక్వా ఫామ్ అండ్ హేచరీ అధిపతి సౌరబ్ కుమార్ బిస్వాల్ 'సాక్షి'కి తెలిపారు. జగత్సింగ్‌పూర్ జిల్లా తులంగ గ్రామంలో ఈ హేచరీ ఉంది. భువనేశ్వర్ నగరానికి 100 కి.మీ. దూరంలో తారాదీప్ వెళ్లే మార్గంలో తులంగ ఉంటుంది. మెత్తళ్ల ఫిష్ స్పాన్ (50–60 గంటల వయసున్న పిల్లలు)ను మార్చి మొదటి వారం నుంచి రైతులకు విక్రయిస్తారు. లక్ష స్పాన్ ధర రూ. 1,500. ఫ్రై (10–15 రోజుల పిల్లలు)ని మార్చి 15 నుంచి సరఫరా చేస్తారు. వెయ్యి ఫ్రై ధర రూ. 200. ఆగస్టు–సెప్టెంబర్ వరకు మెత్తళ్ల సీడ్ ఉత్పత్తి, సరఫరా జరుగుతుంది. పాలిథీన్ బ్యాగ్‌లలో చేప పిల్లలను ఆక్సిజన్‌తో పాటు నింపి సిద్ధం చేసిన తర్వాత 30 గంటల్లోగా గమ్యం చేర్చాలని బిస్వాల్ తెలిపారు. రోజూ ఆంధ్రప్రదేశ్‌కు 10–15 ఇన్సులేటెడ్ వ్యాన్లు వెళ్తూ ఉంటాయని, వాటిలో మోల సీడ్‌ను తరలించవచ్చన్నారు. ఇతర వివరాలకు.. 93376 62527.

26 నుంచి సేంద్రియ సాగు, విలువ జోడింపుపై 3రోజుల శిక్షణ

సేంద్రియ సాగు విధానం, అందుకు అవసరమైన కషాయాలు, మిశ్రమాల తయారీతోపాటు రైతులు పండించిన పంటలకు విలువ జోడింపుపై ఈ నెల 26, 27, 28 తేదీలలో గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గర కొర్నెపాడు గ్రామంలోని రైతు శిక్షణా కేంద్రంలో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో 3 రోజుల రైతు శిక్షణా కార్యక్రమం జరగనుంది. ఉ. 10 నుంచి సా. 5 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన రైతులు 97053 83666, 95538 25532 ఫోన్ నెంబర్లలో తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. భోజనం, వసతి సదుపాయం ఉంది. ముందుగా రిజిస్టర్ చేసుకున్న 30 మంది ఏపీ రైతులకే ఈ అవకాశం.

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్



రంజీ ట్రోఫీ మ్యాచ్‌తో జడేజా పునరాగమనం

మోకాలి గాయం నుంచి కోలుకున్న భారత క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా పునరాగమనం చేయనున్నాడు. తమిళనాడు జట్టుతో నేడు చెన్నైలో మొదలయ్యే రంజీ ట్రోఫీ చివరి లీగ్ మ్యాచ్‌లో జడేజా సౌరాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. 34 ఏళ్ల జడేజా గత ఏడాది ఆగస్టు నుంచి ఆటకు దూరంగా ఉన్నాడు. సౌరాష్ట్ర జట్టుకు దాదాపుగా నాకౌట్ బెర్త్ ఖరారు కావడంతో చివరి మ్యాచ్ నుంచి రెగ్యులర్ కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్, సీనియర్ స్టార్ చతేశ్వర్ పుజారాలకు విశ్రాంతి ఇచ్చారు.

క్వార్టర్ ఫైనల్లో దక్షిణ కొరియా



ప్రపంచకప్ హాకీ టోర్నీలో దక్షిణ కొరియా జట్టు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. భువనేశ్వర్‌లో సోమవారం జరిగిన 'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లో కొరియా 'షూటౌట్'లో 3-2తో 2016 రియో ఒలింపిక్స్ విజేత అర్జెంటీనా జట్టును ఓడించింది. నిర్ణీత సమయం ముగిశాక రెండు జట్లు 5-5తో సమంగా నిలిచాయి. మరో 'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లో జర్మనీ 5-1తో ఫ్రాన్స్‌పై నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరింది.

క్లీన్ స్వీప్ లక్ష్యంగా...

- నేడు న్యూజిలాండ్‌తో భారత్ చివరి వన్డే
- పరువు కోసం కివీస్ పోరు
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి 'స్టార్ స్పోర్ట్స్-1'లో ప్రత్యక్ష ప్రసారం

ఇండోర్: ఇప్పటికే న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ వశమైంది. నంబర్‌వన్ స్థానం దక్కింది. ఇప్పుడు టీమిండియా క్లీన్ స్వీప్‌తో టాప్ ర్యాంక్‌ను పదిలపరుచుకునే పనిలో పడింది. మొదటి మ్యాచ్‌లో బ్యాట్‌తో, రెండో మ్యాచ్‌లో బౌలింగ్‌తో పర్యాటక జట్టును దెబ్బమీద దెబ్బ వేసిన భారత్ నేడు జరిగే చివరిదైన మూడో వన్డేలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టాలని పట్టుదలతో ఉంది. మరోవైపు కివీస్‌ను ఫలితాలే కాదు... బ్యాటింగ్ ఆర్డర్ కూడా పరేషాన్ చేస్తోంది. గత రెండు మ్యాచ్‌ల్లో టాప్-5 బ్యాటర్స్‌లో ఏ ఒక్కరు కూడా అర్ధసెంచరీ అయినా చేయలేకపోయారు. ఇది జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. పరువు నిలబెట్టుకోవాలంటే ఇప్పుడు బ్యాటింగ్ గేర్ మార్చుకోవాల్సిందే. లేదంటే సిరీస్ చేజార్చుకున్న న్యూజిలాండ్ ఆఖరి పోరులోనూ ఓడితే ఈ ఏడాది వన్డే ప్రపంచకప్ వేదికపై ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది.

కోహ్లి స్కోరే బాకీ!

ఈ ఏడాది వరుసగా ఐదు వన్డేలు (లంకపై 3) గెలిచిన టీమిండియా వరల్డ్‌కప్ సన్నాహానికి ఘనమైన ఆరంభమే ఇచ్చింది. కాబట్టి భారత జట్టు ఏ బెంగా, ఒత్తిడి లేకుండా యథేచ్ఛగా చెలరేగడం ఖాయం. ఇక ఈ సిరీస్‌లో ఏమైనా మిగిలింది... చూడాల్సింది ఉందంటే అది కోహ్లి క్లాసిక్సే! శ్రీలంకపై తన శైలి శతకాలతో పాత కోహ్లిని తలపించిన అతను ఈ సిరీస్‌లో 8, 11 పరుగులే చేశాడు. అతని ఫామ్‌పై జట్టు మేనేజ్‌మెంట్‌లో ఏ ఒక్కరికీ అనుమానమే లేదు. కానీ తన మార్క్ బ్యాటింగ్ జోరు చూడాలని జట్టే కాదు... యావత్ భారత అభిమానులు బలంగా కోరుకుంటున్నారు.



లాథమ్

పిచ్, వాతావరణం

ఫ్లాట్ పిచ్ ఇది. పైగా గ్రౌండ్ చిన్నది కావడంతో ప్రేక్షకులకు పరుగుల విందు గ్యారంటీ. టాస్ నెగ్గిన జట్టు బౌలింగ్ ఎంచుకుంటుంది. వాన లేదు. మంచు ప్రభావం బౌలర్లపై పడుతుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, ఇషాన్, సూర్యకుమార్, పాండ్యా, వాషింగ్టన్ సుందర్, సిరాజ్, శార్దుల్, కుల్దీప్, షమీ/ఉమ్రాన్.

న్యూజిలాండ్: లాథమ్ (కెప్టెన్), అలెన్, కాన్వే, నికోల్స్/చాప్‌మన్, మిచెల్, ఫిలిప్స్, బ్రేస్‌వెల్, సాన్‌ట్నర్, షిప్లే/డఫీ, టిక్నెర్, ఫెర్గూసన్.



ప్రాక్టీస్‌లో రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్

మహాకాళేశ్వరుడి సేవలో...



ఇండోర్‌లోని సుప్రసిద్ధ శైవక్షేత్రం ఉజ్జయినిలోని శ్రీ మహాకాళేశ్వరుడిని భారత క్రికెటర్లు, అంపైర్లు, మ్యాచ్ అధికారులు దర్శించుకున్నారు. సోమవారం ఉదయం భస్మా హారతి సేవలో ఆటగాళ్లంతా తరించారు. వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, సూర్యకుమార్ యాదవ్‌లు జలాభిషేకం చేశారు. కారు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై జట్టుకు దూరమైన సహచరుడు రిషభ్ పంత్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించినట్లు ఆటగాళ్లు తెలిపారు. స్వామి వారి దర్శనానంతరం ఉజ్జయిని లోక్‌సభ ఎంపీ అనిల్ ఫిరోజియా క్రికెటర్లను సత్కరించారు.

5 ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం వేదికగా ఇప్పటి వరకు భారత్ ఐదు వన్డేలు ఆడగా... ఐదింటిలోనూ విజయం సాధించింది. 2011లో వెస్టిండీస్‌తో ఇక్కడే జరిగిన వన్డేలో వీరేంద్ర సెహ్వాగ్ (219) డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. ఈ మైదానంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలిసారి వన్డే జరగనుంది.

11 నేడు జరిగే వన్డేలో న్యూజిలాండ్‌పై భారత్ గెలిస్తే స్వదేశంలో 11వసారి ద్వైపాక్షిక సిరీస్ క్లీన్‌స్వీప్ అవుతుంది.

జొకోవిచ్ ఫటాఫట్...

- క్వార్టర్ ఫైనల్లో సెర్బియా స్టార్
- కేవలం ఐదు గేమ్‌లు చేజార్చుకొని ప్రిక్వార్టర్ ఫైనల్లో విజయం

మెల్‌బోర్న్: తనకెంతో కలిసొచ్చిన ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో పదోసారి విజేతగా నిలిచేందుకు సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ మూడు విజయాల దూరంలో ఉన్నాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ జొకోవిచ్ 6-2, 6-1, 6-2తో 22వ సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)పై అలవోకగా గెలిచాడు. 126 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ కేవలం ఐదు గేమ్‌లను మాత్రమే తన ప్రత్యర్థికి కోల్పోయాడు. ఆరుసార్లు అలెక్స్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ 26 విన్నర్స్ కొట్టాడు. నెట్ వద్దకు 21 సార్లు దూసుకొచ్చి 14 సార్లు పాయింట్లు నెగ్గిన అతను తన సర్వీస్‌లో ఒక్కసారి కూడా ప్రత్యర్థికి బ్రేక్ పాయింట్ అవకాశం ఇవ్వలేదు. మరోవైపు ఐదో సీడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా) ఐదు సెట్‌ల హోరాహోరీ పోరులో గట్టెక్కి రెండోసారి ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్నాడు. 3 గంటల 37 నిమిషాలపాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో రుబ్లెవ్ 6-3, 3-6, 6-3, 4-6, 7-6 (11/9)తో హోల్గర్ రూన్ (డెన్మార్క్)పై విజయం సాధించాడు.

అమెరికాకు చెందిన అన్‌సీడెడ్ క్రీడాకారులు టామీ పాల్, బెన్ షెల్టన్ తమ సంచలన ప్రదర్శన కొనసాగిస్తూ తమ కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు.



జొకోవిచ్

ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో టామీ పాల్ 6-2, 4-6, 6-2, 7-5తో 24వ సీడ్ బాటిస్టా అగుట్ (స్పెయిన్)పై, బెన్ షెల్టన్ 6-7 (5/7), 6-2, 6-7 (4/7), 7-6 (7/4), 6-2తో జేజే వుల్ఫ్ (అమెరికా)పై గెలిచారు. క్వార్టర్ ఫైనల్స్‌లో రుబ్లెవ్‌తో జొకోవిచ్; బెన్ షెల్టన్‌తో టామీ పాల్ తలపడతారు.



గార్సియా

నాలుగో సీడ్ గార్సియాకు షాక్

మహిళల సింగిల్స్ విభాగంలో నాలుగో సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్) కథ ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగిసింది. ప్రపంచ 45వ ర్యాంకర్ మగ్దా లినెట్టి (పోలాండ్) 7-6 (7/3), 6-4తో గార్సియాను ఓడించింది. ఈ గెలుపుతో 30 ఏళ్ల మగ్దా లినెట్టి తన 30వ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలిసారి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ఐదో సీడ్ సబలెంకా (బెలారస్) 7-5, 6-2తో 12వ సీడ్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్)పై, డొనా వెకిచ్ (క్రొయేషియా) 6-2, 1-6, 6-3తో ఫ్రువిర్తోవా (చెక్ రిపబ్లిక్)పై, 30వ సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) 6-0, 6-4తో షుయె జాంగ్ (చైనా)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

'మిక్స్‌డ్' క్వార్టర్స్‌లో సానియా-బోపన్న జోడీ



తన కెరీర్‌లో చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతున్న భారత మహిళా టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మిక్స్‌డ్ డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. సోమవారం జరిగిన రెండో రౌండ్‌లో సానియా మీర్జా-రోహన్ బోపన్న (భారత్) జోడీ 6-4, 7-6 (11/9)తో మకోటో నినోమియా (జపాన్)-ఏరీల్ బెహర్ (ఉరుగ్వే) ద్వయంపై విజయం సాధించింది.

ఇంటివాడైన కేఎల్ రాహుల్



భారత స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ ఓ ఇంటివాడయ్యాడు. బాలీవుడ్ నటి అతియా శెట్టిని సోమవారం రాహుల్ పెళ్లి చేసుకున్నాడు. కొన్నేళ్లుగా వీరిద్దరు ప్రేమలో ఉన్నారు. ముంబైలో అతియా శెట్టి తండ్రి, బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టికి చెందిన ఫామ్‌హౌస్‌లో అతి కొద్ది మంది సన్నిహితుల మధ్య ఈ వివాహ వేడుక జరిగింది. 30 ఏళ్ల అతియా 2015లో 'హీరో' సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. అనంతరం 'ముబాకరాన్'... 'నవాబ్‌జాదే'... 'మోతీచూర్ చక్నాచూర్' సినిమాల్లో నటించింది. 30 ఏళ్ల రాహుల్ ప్రస్తుతం భారత టెస్టు జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్‌కు రాహుల్ దూరంగా ఉన్నాడు.

మేరీకోమ్ సారథ్యంలో...



న్యూఢిల్లీ: భారత బాక్సింగ్ దిగ్గజం మేరీకోమ్ ఒకేసారి రెండు కీలకమైన బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమైంది. స్టార్ రెజ్లర్లు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు దర్యాప్తు చేసే కమిటీకి ఆమె నేతృత్వం వహించనుంది. అలాగే సమాఖ్య రోజువారీ వ్యవహారాల్ని చూసుకునే బాధ్యత కూడా మేరీకోమ్‌కే కట్టబెట్టారు. ఐదుగురు సభ్యుల కమిటీలో ఆమెతో పాటు 2012 లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, స్టార్ రెజ్లర్ యోగేశ్వర్ దత్, మాజీ షట్లర్ తృప్తి ముర్గుండే, మాజీ 'టాప్స్' సీఈఓ రాజగోపాలన్, 'సాయ్' మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధిక శ్రీమాన్ ఇతర సభ్యులుగా ఉన్నారు. 'రెజ్లింగ్ అధ్యక్షుడిని బాధ్యతల నుంచి తొలగించలేదు. ఆరోపణల నేపథ్యంలో దైనందిన సమాఖ్య వ్యవహారాల నుంచి తాత్కాలికంగా తప్పించాం. ఇప్పుడు మేరీకోమ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల విచారణ కమిటీయే రెజ్లర్ల ఆరోపణలపై దర్యాప్తు చేస్తుంది. సమాఖ్యను నడిపిస్తుంది' అని కేంద్ర క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. నెల రోజుల గడువుతో కమిటీ పనిచేస్తుందని, వారిచ్చే నివేదికను బట్టి చర్యలు చేపడతామని ఆయన చెప్పారు.

రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిపై విచారణకు కేంద్ర క్రీడా శాఖ కమిటీ ఏర్పాటు

సినిమా

స్టార్ వార్



• ప్రభాస్ • విజయ్ • అల్లు అర్జున్

బాక్సాఫీస్ వసూళ్ల కోసం గ్యాంగ్‌వార్‌కు రంగం సిద్ధమవుతోంది. అల్రెడీ కొందరు స్టార్స్ వార్ డిక్లేర్ చేసి సెట్స్‌లో బిజీగా ఉన్నారు. మరికొందరు రెడీ అవుతున్నారు. ఈ బాక్సాఫీస్ గ్యాంగ్‌వార్ పై ఓ లుక్ వేద్దాం.

పోలీసాఫీసర్‌గా ప్రభాస్ నటించనున్న సినిమా 'స్పిరిట్'. 'అర్జున్‌రెడ్డి' ఫేమ్ సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించనున్న ఈ సినిమా పనులు ఈ ఏడాది చివర్లో ప్రారంభం కానున్నాయి. ప్రభాస్ కెరీర్‌లో 25వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ 'స్పిరిట్' ముంబైలో జరిగే గ్యాంగ్‌వార్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందనే టాక్ వినిపిస్తోంది. అలాగే సందీప్‌రెడ్డి ప్రస్తుతం తెరకెక్కిస్తున్న హిందీ 'యానిమల్' కూడా ఇలాంటి తరహా చిత్రమే. రణ్‌బీర్ కపూర్ హీరోగా రూపొందుతున్న కంప్లీట్ గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్ ఇది. తండ్రి కోసం ఓ యువకుడు గ్యాంగ్‌వార్‌లో ఎలా చిక్కుకున్నాడు? అనే కోణంలో ఈ సినిమా సాగుతుందని బాలీవుడ్ టాక్. ఈ ఏడాది ఆగస్టులో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఇక దర్శకుడు సుజిత్ తెరకెక్కించనున్న సినిమాలో పవన్ కల్యాణ్ హీరోగా నటించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ టైమ్‌లో 'దే కాల్ హిమ్ ఓజీ' అనే ట్యాగ్‌లైన్ తెరపైకి వచ్చింది. 'ఓజీ' అంటే ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్ అని ప్రచారం జరిగింది. దీంతో పవన్-సుజిత్ కాంబినేషన్‌లోని మూవీ గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్ అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఎర్రచందనం స్మగ్లింగ్ సిండికేట్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన సినిమా 'పుష్ప'. అల్రెడీ విడుదలైన 'పుష్ప' తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో కొన్ని గ్యాంగ్‌వార్ సీన్స్ చూశాం. అలాగే 'పుష్ప: ది రైజ్'కు కొనసాగింపుగా రానున్న 'పుష్ప: ది రూల్'లోనూ కొన్ని గ్యాంగ్ వార్ సన్నివేశాలు ఉంటాయనుకోవచ్చు. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప' సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కాగా సీనియర్ యాక్టర్ రాజశేఖర్ సైతం ఈ వెండితెర గ్యాంగ్‌వార్‌లో భాగమయ్యారు. పవన్ సాధినేని దర్శకత్వంలో రాజశేఖర్ హీరోగా తెరకెక్కుతున్న 'మాన్‌స్టర్' గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్. ఈ సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. అలాగే యువ హీరో సందీప్ కిషన్ టైటిల్ రోల్‌లో, విజయ్ సేతుపతి ఓ లీడ్ రోల్‌లో నటించిన 'మైఖేల్' కూడా గ్యాంగ్‌స్టర్ డ్రామానే. ఇంకోవైపు 'మాస్టర్' చిత్రం తర్వాత తమిళ ప్రముఖ హీరో విజయ్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో తాజాగా మరో సినిమా రూపొందనుంది. ముంబై నేపథ్యంలో సాగే గ్యాంగ్‌వార్‌గా ఈ సినిమా ఉంటుందనే టాక్ ఆల్రెడీ కోలీవుడ్‌లో మొదలైంది. ఈ సినిమాలో సంజయ్ దత్, ఫాహద్ ఫాజిల్ కీలక పాత్రలు చేయనున్నారనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ సినిమా షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసి ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు లోకేష్ అండ్ కో. అదే విధంగా ఈ సినిమా తర్వాత కార్తీతో 'ఖైదీ'కి సీక్వెల్‌గా 'ఖైదీ 2' తీయనున్నారు లోకేష్. డ్రగ్స్ మాఫియా నేపథ్యంలో సాగిన 'ఖైదీ' సినిమాకు సీక్వెల్‌గా రానున్న 'ఖైదీ 2' గ్యాంగ్‌వార్ ఫిల్మ్ అట. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. అటు కన్నడంలో ఉపేంద్ర, కిచ్చా సుదీప్, శ్రియ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కబ్జ'. ఆర్. చంద్రు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా 1960-1984 బ్యాక్‌డ్రాప్‌లోని గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్ అని తెలుస్తోంది. కాగా, 'సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైన దుల్కర్ సల్మాన్ చేస్తున్న మలయాళ చిత్రం 'కింగ్ ఆఫ్ కోతా'. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే ఈ సినిమాకు అభిషేక్ జోషి దర్శకుడు. దుల్కర్ కెరీర్‌లో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానున్నట్లుగా తెలుస్తోంది. ఈ సినిమాలతో పాటు మరికొన్ని చిత్రాలు గ్యాంగ్‌వార్ నేపథ్యంలో ప్రేక్షకులను అలరించనున్నాయి.



• రణ్‌బీర్ • కార్తీ • దుల్కర్ • రాజశేఖర్ • ఉపేంద్ర, సుదీప్

ఆర్ఆర్ఆర్‌కు జపాన్ అకాడమీ అవార్డు



• రామ్‌చరణ్, ఎన్టీఆర్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' ఇప్పటికే పలు అంతర్జాతీయ అవార్డులు సాధించిన విషయం తెలిసిందే. తాజాగా 46వ జపాన్ అకాడమీ ఫిల్మ్ ప్రైజ్‌కు సంబంధించి 'అవుట్ స్టాండింగ్ ఫారిన్ ఫిల్మ్' విభాగంలో 'ఆర్ఆర్ఆర్' అవార్డు సాధించింది. 'అవతార్: ద వే ఆఫ్ వాటర్', 'టాప్‌గన్: మ్యావరిక్' వంటి హాలీవుడ్ చిత్రాలను దాటి 'ఆర్ఆర్ఆర్' ఈ జపాన్ అవార్డును సాధించడం విశేషం. గత ఏడాది జపాన్‌లో విడుదలైన 'ఆర్ఆర్ఆర్' అక్కడి బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబడుతున్న సంగతి తెలిసిందే. ఇక 95వ ఆస్కార్ అవార్డ్స్‌కు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో 'నాటు నాటు' పాట (మరి కొన్ని విభాగాల్లో 'ఆర్ఆర్ఆర్' నామినేషన్ పోటీలో ఉంది), 'బెస్ట్ ఫారిన్ ఫిల్మ్' విభాగంలో గుజరాతీ ఫిల్మ్ 'ఛెల్లో షో', డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో 'ఆల్ దట్ బ్రీత్స్', డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ 'ఎలిఫెంట్ విష్పర్స్' ఆస్కార్స్ షార్ట్ లిస్ట్ జాబితాలో ఉన్నాయి. 'ఆర్ఆర్ఆర్', 'ఛెల్లో షో'లతో కలిపి పది ఇండియన్ చిత్రాలు ఆస్కార్ రిమైండర్ లిస్ట్‌లో ఉన్నాయి. కాగా నేడు ఆస్కార్ నామినేషన్స్ వెల్లడి కానున్నాయి. మరి.. ఎన్ని ఇండియన్ చిత్రాలు నామినేషన్స్ దక్కించుకుంటాయో చూడాలి..

హిట్ డైరెక్టర్‌తో...



• వెంకటేశ్

వెంకటేశ్ తన కెరీర్‌లో 75వ మైలురాయి చేరుకుంటున్నారు. ఈ మైల్‌స్టోన్ మూవీ గురించి పూర్తి వివరాలు బుధవారం తెలుస్తాయి. అయితే 'హిట్' చిత్రదర్శకుడు శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ 75వ చిత్రాన్ని నిర్మించనున్నామని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత వెంకట్ బోయనపల్లి సోమవారం తెలిపారు. ''శ్యామ్ సింగరాయ్'తో నిర్మాణంలోకి అడుగుపెట్టిన మేం ప్రొడక్షన్ నం. 2గా వెంకటేశ్ గారి సినిమా నిర్మించనున్నాం. వెంకటేశ్‌గారి కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్ సినిమాగా రూపొందించనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. కాగా.. ఈ సినిమా ప్రకటించిన సందర్భంగా వెంకటేశ్ ప్రీ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఇది యాక్షన్ జానర్ చిత్రం అని ఈ పోస్టర్ స్పష్టం చేస్తోంది.

యాక్షన్ వేద



• శివరాజ్‌కుమార్

కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ హీరోగా రూపొందిన చిత్రం 'వేద'. ఈ చిత్రాన్ని శివ రాజ్‌కుమార్ భార్య గీతా శివ రాజ్‌కుమార్ నిర్మించారు. శివరాజ్‌కుమార్‌కి 'వేద' 125వ సినిమా కావడంతో గీతా పిక్చర్స్‌లో తొలి ప్రాజెక్ట్‌గా నిర్మించారు. గత ఏడాది డిసెంబర్‌లో కన్నడంలో విడుదలైన ఈ చిత్రం కంచి కామాక్షి కలకత్తా కాళీ క్రియేషన్స్ ద్వారా తెలుగులో 'వేద' టైటిల్‌తోనే విడుదల కానుంది. ''పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం కన్నడంలో ఘన విజయం సాధించింది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఎ. హర్ష దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఘనవిలక్ష్మణ్, అదితీ సాగర్, శ్వేత చంగప్ప, ఉమాశ్రీ తదితరులు నటించారు.

ఈ జర్నీ మా మామయ్యకు అంకితం

- సుధీర్‌బాబు

'నన్ను సినిమాల్లోకి 'వెళ్లనివ్వాలా? వద్దా? అని ఇంట్లో కన్‌ఫ్యూజన్. 'కష్టపడితే సక్సెస్ అవుతాడు. చెయ్యనివ్వండి' అని మా మామయ్య కృష్ణగారు అన్నారు. అంతే.. నా లైఫ్ టర్న్ తీసుకుంది. కృష్ణగారు వేల తారల్లో ఒక్కరిగా వెలిగిన సూర్యుడు. ఆయన ఒక కాగడాన్ని వెలిగించి వెళ్లిపోయారు. ఇప్పుడు దాన్ని పట్టుకుని ముందుకు నడవాల్సిన బాధ్యత మా కుటుంబానిది'' అని హీరో సుధీర్‌బాబు అన్నారు. సుధీర్‌బాబు హీరోగా, శ్రీకాంత్, భరత్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'హంట్'. మహేశ్ దర్శకత్వంలో ఆనందప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సుధీర్ బాబు మాట్లాడుతూ – ''నా ప్రతి సినిమా మార్నింగ్ షో తర్వాత కృష్ణగారి నుంచి నాకు ఒక ఫోన్ కాల్ వచ్చేది. ఇప్పుడు నేను అది మిస్ అవుతా. కృష్ణగారు ఎవరూ చేయని ప్రయోగాలు చేశారు. ఆ ధైర్యంతోనే 'హంట్' సినిమా చేశాను. ఆయన చనిపోవడానికి 20 రోజుల ముందు సినిమా ఏదైనా చూస్తారా? అని అడిగితే... మహేశ్, సుధీర్ సినిమాలు చూద్దామని అనుకుంటున్నానని అన్నారు. వందల సినిమాలు చేసిన సూపర్ స్టార్ నా సినిమాలు చూస్తానని కోరుకోవడం కంటే నాకేం కావాలి. ఎంత దూరం వెళతానో తెలియదు. ఈ జర్నీ మా మామయ్యకి అంకితం'' అన్నారు. ''ఇంగ్లిష్ టైటిల్‌తో వస్తున్న తెలుగు చిత్రం 'హంట్''' అన్నారు ఆనందప్రసాద్. ''ఈ సినిమాలో నాది పాజిటివ్ క్యారెక్టరా? నెగిటివా? అనేది సస్పెన్స్'' అన్నారు శ్రీకాంత్. ''విక్రమ్'కు, మా 'హంట్'కు సంబంధం లేదు'' అన్నారు మహేశ్. నటుడు గోపరాజు రమణ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత అన్నే రవి పాల్గొన్నారు.



• శ్రీకాంత్, భరత్, సుధీర్‌బాబు

అందరూ గర్వపడే సినిమా అవుతుంది

- సందీప్ కిషన్

సందీప్ కిషన్ హీరోగా నటించిన పాన్ ఇండియా మూవీ 'మైఖేల్'. విజయ్ సేతుపతి, గౌతమ్ మీనన్, దివ్యాంశ కౌశిక్, వరలక్ష్మీ శరత్‌కుమార్, వరుణ్ సందేశ్ ముఖ్య తారలుగా రంజిత్ జయకొడి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. నారాయణ్ దాస్ కె. నారంగ్ సమర్పణలో భరత్ చౌదరి, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 3న విడుదల కానుంది. సోమవారం ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సందీప్ కిషన్ మాట్లాడుతూ – ''మనల్ని అభిమానించేవాళ్లు మనం కాస్త నిరాశలో ఉన్నప్పుడు ఎనర్జీ ఇస్తుంటారు. ఆ ఎనర్జీ నుంచి కొన్ని మ్యాజికల్ సినిమాలు పుడుతాయి. 'మైఖేల్' అలాంటి సినిమానే. మనందరం గర్వపడే సినిమా అవుతుంది'' అన్నారు. వరుణ్ సందేశ్ మాట్లాడుతూ– 'నేనిప్పటివరకూ చేయని క్యారెక్టర్‌ను ఈ సినిమాలో చేశాను'' అన్నారు. ''ఫిబ్రవరి 3న అందరూ థియేటర్‌లోనే ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను'' అన్నారు రంజిత్ జయకొడి. ''ఈ సినిమా కంటెంట్, బిజినెస్ పరంగా మేం హ్యాపీ'' అన్నారు భరత్ చౌదరి.



• సందీప్, వరుణ్ సందేశ్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	320	60,941
నిఫ్టీ ▲	91	18,119

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,359	▲ 281
డోజోన్స్	33,656	▲ 218
ఎఫ్‌టీఎస్ఈ 100	7,784	▲ 14
డాక్స్	15,103	▲ 69
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,265	▲ 25
నికాయ్	26,906	▲ 353

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) – ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	57,044
బంగారం (99.5 స్వచ్ఛత)	56,816
వెండి (కేజీ)	68,273

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	79.56	83.24
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	86.37	90.91
€	యూరో	భారతీయ	98.26	103.12
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	0.50	0.75
AUS	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	54.63	59.45
S$	సింగపూర్ డాలర్	భారతీయ	59.49	64.03
SAR	సౌదీ రియాల్	భారతీయ	20.71	22.38
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.26	23.06
¥	చైనా యువాన్	భారతీయ	10.87	12.95

మరోసారి డిజిటల్ ఇండియా సేల్



హైదరాబాద్: రిలయన్స్ తమ 'డిజిటల్ ఇండియా సేల్' మరోసారి తీసుకొచ్చింది. అత్యాధునిక టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలపై పలు ఆఫర్లు, డిస్కౌంట్లను పరిచయం చేసింది. ఈ నెల 29వ తేదీ వరకూ ఇది అమల్లో ఉంటుంది. డెబిట్/ క్రెడిట్ కార్డుతో చేసే కొనుగోళ్లపై రూ.20,000 వరకూ తక్షణ డిస్కౌంటు అందిస్తుంది. ఇంకా ఇతర ఆకర్షణీయమైన ఆఫర్లూ ఇస్తున్నట్లు రిలయన్స్ డిజిటల్ ఒక ప్రకటనలో వెల్లడించింది. రిలయన్స్ డిజిటల్, మై జియో స్టోర్లతోపాటు www.reliancedigital.inలో కొనుగోలు ద్వారా ఆఫర్లు పొందవచ్చు. కస్టమర్ల కోసం షరతులకు లోబడి ఇన్‌స్టా డెలివరీ, స్టోర్ పిక్-అప్ వంటి సదుపాయాలు అందిస్తున్నట్లు సంస్థ పేర్కొంది.

కెనరా బ్యాంక్ లాభం హైజంప్

క్యూ3లో రూ. 2,882 కోట్లు



ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో రూ. 2,882 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది (2021-22) ఇదే కాలంలో ఆర్జించిన రూ. 1,502 కోట్లతో పోలిస్తే ఇది 92 శాతం అధికం. మొండి రుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడ్డాయి. మొత్తం ఆదాయం రూ. 21,312 కోట్ల నుంచి రూ. 26,218 కోట్లకు జంప్ చేసింది. నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) సైతం రూ. 17,701 కోట్ల నుంచి రూ. 22,231 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 7.8 శాతం నుంచి 5.89 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 2.86 శాతం నుంచి 1.96 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి 16.72 శాతంగా నమోదైంది.

క్యూ3 ఫలితాల నేపథ్యంలో కెనరా బ్యాంక్ షేరు 1.3% బలపడి రూ.323 వద్ద ముగిసింది.

ఈ ఏడాదే దేశీ 5జీ టెక్నాలజీ

- వచ్చే ఏడాదిలో ప్రపంచానికి అందిస్తాం
- భారత్‌లో యాపిల్ ఉత్పత్తుల తయారీ పెంపు
- బిజినెస్ 20 సదస్సులో కేంద్ర మంత్రుల వెల్లడి



గాంధీనగర్: దేశీయంగా అభివృద్ధి చేసిన 5జీ, 4జీ టెలికం సాంకేతికతలు, సాధనాలు (టెక్నాలజీ స్టాక్) ఈ ఏడాది భారత్‌లో అందుబాటులోకి రానున్నట్లు కేంద్ర టెలికం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వీటిని వచ్చే ఏడాది నుంచి ప్రపంచ దేశాలకు అందించగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జీ20 కార్యక్రమాల్లో భాగంగా వ్యాపార వర్గాలతో పరిశ్రమల సమాఖ్య సీఐఐ గుజరాత్‌లోని గాంధీనగర్‌లో నిర్వహించిన బిజినెస్ 20 (బీ20) ప్రారంభ సదస్సులో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. ఇందులో ప్రభుత్వ వర్గాలు, దిగ్గజ సంస్థల సీఈవోలు తదితరులు పాల్గొంటున్నారు. ప్రపంచంలో కేవలం అయిదు దేశాల దగ్గర మాత్రమే 4జీ-5జీ టెలికం టెక్నాలజీ స్టాక్ ఉండగా, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో భారత్ సొంత సాంకేతికతను అభివృద్ధి చేసుకుందని మంత్రి చెప్పారు. దీన్ని ఏకకాలంలో 1 కోటి కాల్స్‌పై ప్రయోగాత్మకంగా పరీక్షించినట్లు వివరించారు. దేశీ టెక్నాలజీతో 2023లో 50,000 - 70,000 టవర్లు, సైట్లు ఏర్పాటు కానున్నాయని మంత్రి వివరించారు.

ఉత్పత్తి పెంపుపై యాపిల్ దృష్టి ..

భారత్‌లో వ్యాపారాలకు అనువైన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అంతర్జాతీయ సంస్థలు మన దేశాన్ని తమకు కీలక కేంద్రంగా మార్చుకుంటున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. టెక్ దిగ్గజం యాపిల్ కూడా భారత్‌లో తమ ఉత్పత్తుల తయారీని పెంచుకునే యోచనలో ఉన్నట్లు ఆయన చెప్పారు. సంస్థ విక్రయించే ఉత్పత్తుల్లో ప్రస్తుతం 5-7 శాతం భారత్‌లో తయారవుతుండగా దీన్ని 25 శాతం వరకు పెంచుకోవాలని యాపిల్ భావిస్తోన్నట్లు తెలుస్తోందని ఆయన వివరించారు. యాపిల్ ఇటీవల ప్రవేశపెట్టిన కొన్ని మోడల్స్ భారత్‌లోనే తయారైనవని మంత్రి చెప్పారు. ఎర్త్ మూవర్స్ మెషీన్ రంగానికి చెందిన ఒక విదేశీ కంపెనీ ప్రస్తుతం భారత్ నుంచి 110 దేశాలకు తమ ఉత్పత్తులను చౌకగా సరఫరా చేస్తోందని, ఇక్కడి నుంచే కొత్త ఉత్పత్తులను కూడా ఆవిష్కరిస్తోందని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ వ్యయాలను తగ్గించడంలో, సామర్థ్యాలను పెంచుకోవడంలో, వ్యాపారాలకు ప్రయోజనాలు చేకూర్చడంలోనూ పీఎం గతిశక్తి కార్యక్రమం కీలక పాత్ర పోషించగలదని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహ విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి అనురాగ్ జైన్ చెప్పారు.

అజెండా రూపకల్పనలో బీ20 కీలక పాత్ర..

జీ-20 దేశాలు, అలాగే మిగతా ప్రపంచ దేశాలకు మరింత విలువ చేకూర్చే దిశగా అజెండాను రూపొందించడంలో బిజినెస్-20 కీలక పాత్ర పోషించగలదని బీ20 ఇండియా చెయిర్ ఎన్ చంద్రశేఖరన్ చెప్పారు. ఈ వేదికకు భారత్ అధ్యక్షత వహించే కాలంలో అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ, సృజనాత్మక నైపుణ్యాలు, డిజిటల్ పరివర్తన తదితర అంశాల్లో పురోగతికి పలు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు, కర్బన ఉద్గారాలరహిత సుస్థిర భవిష్యత్ సాధన ప్రక్రియలో అందరినీ భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని ఐటీసీ సీఎండీ సంజీవ్ పురి అభిప్రాయపడ్డారు. జీ-20కి భారత్ అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో బీ20 ఇండియా సెక్రటేరియట్‌గా వ్యవహరించేందుకు సీఐఐ గతేడాది డిసెంబర్ 1న ఎంపికైంది. సాధారణంగా బీ20 చెయిర్‌గా జీ20 ఆతిథ్య దేశానికి చెందిన ప్రముఖ వ్యాపార దిగ్గజాన్ని జీ20 నియమిస్తుంది. ఈసారి టాటా సన్స్ చైర్మన్ అయిన ఎన్ చంద్రశేఖరన్ ఆ బాధ్యతలు చేపట్టారు.

యాక్సిస్ బ్యాంక్ క్యూ3 భళా

- నికర లాభం 62 శాతం జూమ్
- వడ్డీ ఆదాయం రూ. 11,459 కోట్లు



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 56% ఎగసి రూ. 6,187 కోట్లను అధిగమించింది. స్టాండెలోన్ నికర లాభం మరింత అధికంగా 62% జంప్‌చేసి రూ. 5,853 కోట్లను తాకింది. గతేడాది (2021-22) ఇదే కాలంలో రూ. 3,614 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొండి రుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించాయి. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) సైతం 32 శాతం వృద్ధితో రూ. 11,459 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 0.73% బలపడి 4.26 శాతానికి చేరాయి. ఆదాయం రూ. 21,101 కోట్ల నుంచి రూ. 26,892 కోట్లకు చేరింది. యాక్సిస్ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) వార్షిక ప్రాతిపదికన 3.17% నుంచి 2.38%కి, నికర ఎన్‌పీఏలు 0.91% నుంచి 0.47%కి దిగివచ్చాయి.

క్యూ3 ఫలితాల నేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్ షేరు యథాతథంగా రూ. 930 వద్దే ముగిసింది.

లాకర్ల తాజా ఒప్పందాలకు మరింత గడువు

ఈ ఏడాది చివరి వరకు చేసుకోవచ్చన్న ఆర్‌బీఐ



ముంబై: సవరించిన సేఫ్ డిపాజిట్ లాకర్ల ఒప్పందాలను కస్టమర్లతో బ్యాంక్‌లు కుదుర్చుకోవాల్సి ఉండగా, ఇందుకు ఈ ఏడాది చివరి వరకు గడువును ఆర్‌బీఐ పొడిగించింది. సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా లాకర్ల ఒప్పందాల్లో మార్పులు చేసి, వాటిపై కస్టమర్ల సమ్మతి తీసుకోవాలంటూ 2021 ఆగస్టులోనే ఆర్‌బీఐ అన్ని బ్యాంక్‌లను కోరింది. ''పెద్ద సంఖ్యలో కస్టమర్లు నవీకరించిన లాకర్ ఒప్పందాలపై సంతకాలు చేయాల్సి ఉన్నట్టు మా దృష్టికి వచ్చింది. గడువులోపు (2023 జనవరి 1 నాటికి) లాకర్ ఒప్పందాలను తిరిగి కుదుర్చుకోవాలంటూ కస్టమర్లకు చాలా వరకు బ్యాంక్‌లు తెలియజేయలేదు. కనుక 2023 ఏప్రిల్ 30 నాటికి లాకర్ ఒప్పందాలను తిరిగి కుదుర్చుకోవాల్సిన విషయాన్ని కస్టమర్లకు బ్యాంక్‌లు విధిగా తెలియజేయాలని కోరాం. జూన్ 30 నాటికి కనీసం 50%, సెప్టెంబర్ 30 నాటికి కనీసం 75% కస్టమర్లతో ఒప్పందాలు చేసుకోవాలి. ఒప్పందం కాపీని కస్టమర్‌కు అందించాలి'' అని తాజా ఆదేశాల్లో ఆర్‌బీఐ పేర్కొంది. జనవరి 1 నాటికి ఒప్పందాలు చేసుకుని లాకర్‌లను స్తంభింపజేస్తే, వాటిని తిరిగి విడుదల చేయాలని ఆదేశించింది.

ఈవీ మార్కెట్లోకి హోండా

- 2024 మొదట్లో తొలి టూ వీలర్
- వచ్చే నెల్లో ఆరంభ స్థాయి బైక్
- కంపెనీ ఎండీ అట్సుషి ఒగటా



న్యూఢిల్లీ: హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) విభాగంపై బలమైన ప్రణాళికలతో ఉంది. వచ్చే ఏడాది మార్చి నాటికి తొలి ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాన్ని విడుదల చేయనున్నట్టు కంపెనీ ఎండీ, ప్రెసిడెంట్, సీఈవో అట్సుషి ఒగటా తెలిపారు. యాక్టివా నూతన వెర్షన్ విడుదల సందర్భంగా కంపెనీ ఈవీ ప్రణాళికలను ఆయన వెల్లడించారు. ''మొదటి ఎలక్ట్రిక్ మోడల్‌ను 2024 మార్చిలో విడుదల చేయాలని అనుకుంటున్నాం. భారత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త ప్లాట్‌ఫామ్‌పై దీని అభివృద్ధి చేపట్టాం. మొదటి మోడల్ ఫిక్స్‌డ్ బ్యాటరీతో వస్తుంది. రెండో మోడల్ స్వాపబుల్ (మార్చడానికి వీలైన) బ్యాటరీతో ఉంటుంది. మందుగా దేశవ్యాప్తంగా మాకున్న 6,000 విక్రయ అవుట్‌లెట్ల వద్ద చార్జింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తాం. తర్వాత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా విస్తరణపై నిర్ణయం తీసుకుంటాం''అని ఒగటా వివరించారు. ఈవీ మార్కెట్లోకి ప్రవేశం ఆలస్యంపై స్పందిస్తూ.. ''గతేడాది నుంచి ఈవీ వ్యాపారంపై దృష్టి సారించాం. ఒక్కసారి భారత్‌లో ఈ వ్యాపారం ప్రారంభించామంటే అది స్వల్పకాలానికి కాకుండా దీర్ఘకాలం కోసమే అవుతుంది''అని బదులిచ్చారు.

న్యూజెర్సీలో తనిష్క్ కొత్త స్టోర్



హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల సంస్థ తనిష్క్ అమెరికాలో తొలి స్టోర్‌ను ప్రారంభించింది. న్యూజెర్సీ రాష్ట్రంలో మినీ ఇండియాగా పేరొందిన 'ఓక్ ట్రీ రోడ్' అనే ప్రాంతంలో దీన్ని తెరిచింది. యూఎస్ చట్టసభ్యుడు మెనెండెజ్ కొత్త స్టోర్‌ను ప్రారంభించారు. ఇందులో 6,500కు పైగా ప్రత్యేక డిజైన్లను అందుబాటులో ఉంచారు. అమెరికాలోని భారతీయులకు అనుగుణంగా వీటిని రూపొందించారు. 'తనిష్క్‌ను అంతర్జాతీయ బ్రాండ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. అందులో భాగంగానే అమెరికాలో స్టోర్‌ను తెరిచాము. వచ్చే 2-3 ఏళ్లలో ఉత్తర అమెరికా, పశ్చిమాసియాలో 20-30 స్టోర్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము' అని తనిష్క్ మాతృసంస్థ టైటన్ కంపెనీ లిమిటెడ్ ఎండీ సీ.కే.వెంకటరామన్ తెలిపారు.

రెండు రోజుల నష్టాల్లోంచి లాభాల్లోకి

- ఐటీ, ఫైనాన్స్ షేర్ల దన్ను
- ప్రపంచ మార్కెట్ల సానుకూలతలు
- సెన్సెక్స్ లాభం 320 పాయింట్లు



ముంబై: ఐటీ, ఫైనాన్స్ షేర్లు రాణించడంతో దేశీయ స్టాక్ సూచీలు రెండు రోజుల నష్టాల్లోంచి లాభాల్లోకి మళ్లాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ఇటీవల వెల్లడైన కార్పొరేట్ క్యూ3 ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాలు మెప్పించగలిగాయి. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 320 పాయింట్లు బలపడి 60,941 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 91 పాయింట్లు పెరిగి 18,119 వద్ద నిలిచింది. మెటల్, రియల్టీ రంగాల షేర్లు మాత్రమే నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.220 కోట్ల షేర్లను విక్రయించగా, దేశీయ ఇన్వెస్టర్లు రూ.435 కోట్ల కొన్నారు. గత శుక్రవారం అమెరికా మార్కెట్ల లాభాల ముగింపుతో ఆసియా, యూరప్ మార్కెట్లు సానుకూలంగా ముగిశాయి. నూతన సంవత్సరం(లునార్) సెలవుల కారణంగా ఆసియాలో చైనా, సింగపూర్, దక్షిణ కొరియా, తైవాన్, హాంగ్‌కాంగ్ సూచీలు పనిచేయలేదు. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు లాభాల స్వీకరణ జరగడంతో ఆరంభ లాభాల్ని కోల్పోయి అరశాతం నష్టంతో రూ.2430 వద్ద ముగిసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎల్ఐసీలో 9394 ఏడీవో పోస్టులు

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ఉన్న ఎల్ఐసీ కార్యాలయాల్లో రెగ్యులర్ ప్రాతిపదికన అప్రెంటిస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(ఏడీవో) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది. హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య జోనల్ కార్యాలయంలో వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 9394
- **జోన్ల వారీగా ఖాళీలు:** సెంట్రల్ జోనల్ ఆఫీస్(భోపాల్)-561; ఈస్టర్న్ జోనల్ ఆఫీస్(కోల్‌కతా)-1049; ఈస్ట్ సెంట్రల్ జోనల్ ఆఫీస్(పాట్నా)-669; నార్తర్న్ జోనల్ ఆఫీస్(న్యూఢిల్లీ)-1216;నార్త్ సెంట్రల్ జోనల్ ఆఫీస్(కాన్పూర్)-1033;సదరన్ జోనల్ ఆఫీస్(చెన్నై)-1516; సౌత్ సెంట్రల్ జోనల్ ఆఫీస్(హైదరాబాద్) - 1408; వెస్టర్న్ జోనల్ ఆఫీస్(ముంబై)-1942.
- **దక్షిణ మధ్య జోన్‌లో అప్రెంటిస్ ఏడీవో ఖాళీలు: 1408: డివిజన్ల వారీగా ఖాళీలు:** కడప-90, హైదరాబాద్-91, కరీంనగర్-42, మచిలీపట్నం-112, నెల్లూరు-95, రాజమహేంద్రవరం-69, సికింద్రాబాద్-94, విశాఖపట్నం-57, వరంగల్-62, బెంగళూరు1-115, బెంగళూరు2-117, బెల్గాం-66, ధార్వాడ్-72, మైసూర్-108, రాయచూర్-83, షిమోగా-51, ఉడిపి-84.
- **అర్హత:** ఏదైనా విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ లేదా ముంబైలోని ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఫెలోషిప్ ఉన్నా దరఖాస్తు చేసుకోవచ్చు. లైఫ్ ఇన్సూరెన్స్ ఇండస్ట్రీ లేదా ఫైనాన్స్ ప్రొడక్ట్స్ మార్కెటింగ్ విభాగంలో కనీసం రెండేళ్ల పని అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుంది.
- **వయసు:** 01.01.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** ఏడీవోగా ఎంపికైన అభ్యర్థులకు అప్రెంటిస్ సమయంలో నెలకు రూ.51,500 స్టైపెండ్‌గా చెల్లిస్తారు. తదనంతరం ప్రొబేషనరీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా నెలకు సుమారు రూ.56వేలకు పైగా వేతనం అందుతుంది.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్షలు(ప్రిలిమినరీ/మెయిన్ ఎగ్జామినేషన్), ఇంటర్వ్యూ, ప్రీ-రిక్రూట్‌మెంట్ మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** ప్రిలిమ్స్‌లో రీజనింగ్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ సబ్జెక్టుల నుంచి 100 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం ఒక గంట. మెయిన్స్‌లో రీజనింగ్ ఎబిలిటీ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, జీకే, కరెంట్ అఫైర్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, ఇన్సూరెన్స్ అండ్ ఫైనాన్షియల్ మార్కెటింగ్ అవేర్‌నెస్ తదితర సబ్జెక్టుల్లో 160 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు ప్రారంభతేది:** 21.01.2023.
- **ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లించడానికి చివరి తేది:** 10.02.2023.
- **ఆన్‌లైన్ పరీక్ష కాల్‌లెటర్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 04.03.2023
- **ప్రిలిమినరీ పరీక్ష తేది:** 12.03.2023.
- **మెయిన్ పరీక్ష తేది:** 08.04.2023.
- **వెబ్‌సైట్:** www.licindia.in

ఇఫ్లూ దూరవిద్యలో ఎంఏ ఇంగ్లిష్‌లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీ(ఇఫ్లూ).. 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి దూర విద్యా విధానంలో ఎంఏ ఇంగ్లిష్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **వ్యవధి:** రెండేళ్లు(నాలుగు సెమిస్టర్లు).
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డీన్, స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ది ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీ, హైదరాబాద్ చిరునామకు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 16.02.2023.
- **వెబ్‌సైట్:** efluniversity.ac.in


తెలంగాణ మైనారిటీ పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(టీఎంఆర్ఈఐఎస్).. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనారిటీ పాఠశాలల్లో ఐదో తరగతితోపాటు 6, 7, 8 తరగతులు (బ్యాక్‌లాగ్), ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి 4, 5, 6, 7, 10వ తరగతుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.01.2023
- **ధ్రువపత్రాల పరిశీలన తేది:** 24.04.2023 నుంచి 10.05.2023 వరకు.
- **వెబ్‌సైట్:** tmreis.telangana.gov.in

స్మార్ట్ హైరింగ్.. ఐటీ కొలువు!

» ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్‌కు టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ టెస్ట్
» సైన్స్, కంప్యూటర్స్, ఒకేషనల్ డిగ్రీ ఉత్తీర్ణులకు అవకాశం
» స్మార్ట్ హైరింగ్ ద్వారా 40 వేల మందికి కొలువులు
» ఫిబ్రవరి 10న టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ టెస్ట్



సాఫ్ట్‌వేర్ కొలువు.. ఐటీ రంగంలో కెరీర్.. దేశంలో డిగ్రీ స్థాయి కోర్సులు చదువుతున్న ప్రతి ఒక్కరి స్వప్నం! చదివిన డొమైన్‌తో సంబంధం లేకుండా.. ఇప్పుడు అధికశాతం మంది ఐటీ జాబ్స్ కోసం అన్వేషణ సాగిస్తున్న పరిస్థితి! కాని క్యాంపస్ డ్రైవ్స్ కేవలం ఇంజనీరింగ్ నేపథ్యం ఉన్న టాప్ కాలేజీల విద్యార్థులకే లభిస్తున్నాయనే భావన! ఇలాంటి వారు తమ సాఫ్ట్‌వేర్ కొలువు కలను సాకారం చేసుకునేందుకు మార్గం.. టీసీఎస్ స్మార్ట్ హైరింగ్!! దేశంలో టాప్-5 ఐటీ కంపెనీల జాబితాలో నిలిచిన సాఫ్ట్‌వేర్ సంస్థ టీసీఎస్.. ఆఫ్ క్యాంపస్ పద్ధతిలో చేపడుతున్న నియామక విధానమే.. స్మార్ట్ హైరింగ్! తాజాగా స్మార్ట్ హైరింగ్-2023 ప్రక్రియను టీసీఎస్ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో.. స్మార్ట్ హైరింగ్‌కు దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, సిలబస్ తదితర వివరాలు..

ఐటీ కంపెనీల్లో నాన్-ఇంజనీరింగ్ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కొలువు అందని ద్రాక్షే అనే అభిప్రాయముంది. దీనికి భిన్నంగా.. సైన్స్, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఒకేషనల్, కంప్యూటర్స్/ఐటీ సబ్జెక్ట్‌లతో బ్యాచిలర్ డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ జాబ్ ఖరారు చేసేందుకు ప్రముఖ ఐటీ కంపెనీ టీసీఎస్..ఆఫ్ క్యాంపస్ విధానంలో చేపడుతున్న నియామక ప్రక్రియే.. టీసీఎస్ స్మార్ట్ హైరింగ్.

అర్హతలు

- నిర్దేశిత గ్రూప్‌లలో 2023లో డిగ్రీ పూర్తి చేసుకోనున్న విద్యార్థుల కోసం స్మార్ట్ హైరింగ్ ప్రక్రియను టీసీఎస్‌లో ప్రారంభించింది.
- బీసీఏ, బీఎస్సీ(మ్యాథమెటిక్స్/స్టాటిస్టిక్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/ఎలక్ట్రానిక్స్/బయో కెమిస్ట్రీ/కంప్యూటర్ సైన్స్/ఐటీ), కంప్యూటర్ సైన్స్/ఐటీలో బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సులను 2023లో పూర్తి చేసుకోనున్న విద్యార్థులను అర్హులుగా పేర్కొంది. • పదో తరగతి నుంచి బ్యాచిలర్ డిగ్రీ వరకు ప్రతి స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు లేదా 5 సీజీపీఏతో ఉత్తీర్ణత సాధించాలి. • బ్యాచిలర్ డిగ్రీలో ఒక బ్యాక్‌లాగ్ మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. • అకడమిక్‌గా గ్యాప్ రెండేళ్ల కంటే ఎక్కువ ఉండకూడదని కూడా పేర్కొన్నారు. • దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వయసు 18-28 ఏళ్ల మధ్య ఉండాలి.

'సైన్స్ టు సాఫ్ట్‌వేర్'

టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ ప్రధాన ఉద్దేశం..ఆఫ్ క్యాంపస్ డ్రైవ్‌ను విస్తృతం చేయడం.అదే విధంగా.. నిర్దేశిత సబ్జెక్ట్ గ్రూప్‌లతో డిగ్రీ పూర్తి చేసిన వారికి సాఫ్ట్‌వేర్ కొలువులు ఖరారు చేయడం. ఇందుకోసం ప్రత్యేకంగా సైన్స్ టు సాఫ్ట్‌వేర్ పేరుతో వినూత్న ప్రోగ్రామ్‌ను అమలు చేస్తోంది. దీనిలో భాగంగా మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, బయో కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్‌లతో బీఎస్సీ.. అదే విధంగా బీసీఏ,సీఎస్/ఐటీలో బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సు చివరి సంవత్సరం విద్యార్థుల కోసం స్మార్ట్ హైరింగ్ ప్రక్రియను చేపడుతోంది.

సమయం ఆదా

టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ ప్రక్రియలో మరో ప్రధాన ఉద్దేశం.. సమయం ఆదా చేయడం. వాస్తవానికి క్యాంపస్ డ్రైవ్స్ విధానంలో నియామక ప్రక్రియ పూర్తయి.. అభ్యర్థుల ఎంపిక ఖరారు చేసేందుకు దాదాపు మూడు నెలల సమయం పడుతోంది. దీంతో అటు విద్యార్థులకు, ఇటు సంస్థకు సమయం ఆదా అయ్యేలా టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ ప్రక్రియ దోహదపడుతుంది.

40 వేల మంది

టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ ప్రక్రియ ద్వారా ఏటా దాదాపు 35 వేల నుంచి 40 వేల మంది వరకూ ఫ్రెషర్స్‌ను రిక్రూట్ చేసుకుంటోంది. ఈ సంఖ్యను ప్రతి ఏటా సంస్థ నియామక ప్రణాళిక ఆధారంగా నిర్ధారిస్తున్నారు. జాతీయ స్థాయిలో దాదాపు రెండువేలకు పైగా ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకు ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనే అవకాశం కల్పిస్తోంది.

ఆరు నెలల శిక్షణ

టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి ఆఫర్ ఖరారు చేసుకున్న వారికి ఆరు నెలల పాటు శిక్షణ అందిస్తారు. కోడింగ్, ప్రోగ్రామింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీ అంశాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, బిహేవియర్ స్కిల్స్, ఇతర సాఫ్ట్ స్కిల్స్‌లోనూ నైపుణ్యం పొందేలా శిక్షణ ఉంటుంది. శిక్షణ పూర్తయిన తర్వాత అభ్యర్థులకు వారి ఆసక్తి మేరకు ఐటీ లేదా బీపీఎస్ విభాగాల్లో నియామకాలు ఖరారు చేస్తారు. రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

టీసీఎస్ స్మార్ట్ హైరింగ్ విధానంలో మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి..రాత పరీక్ష, టెక్నికల్ ఇంటర్వ్యూ, హెచ్ఆర్ రౌండ్ ఇంటర్వ్యూ. తొలిదశ రాత పరీక్ష ఫిబ్రవరి 10వ తేదీన టీసీఎస్ ఐయాన్ సెంటర్లలో జరుగుతుంది.

రాత పరీక్ష.. మూడు విభాగాలు

తొలుత ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. మొత్తం మూడు విభాగాల(వెర్బల్ ఎబిలిటీ, రీజనింగ్ ఎబిలిటీ, న్యూమరిక్ ఎబిలిటీ) నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో విభాగం నుంచి 15-20 ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. పరీక్ష వ్యవధి 50 నిమిషాలు.

రెండో దశ.. టెక్నికల్ ఇంటర్వ్యూ

ఆన్‌లైన్ టెస్ట్‌లో సంస్థ నిర్దేశించిన కటాఫ్ మార్కులు సాధించిన వారిని తదుపరి దశ టెక్నికల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఈ దశలో ఐటీ రంగానికి సంబంధించిన అభ్యర్థుల ప్రాథమిక పరిజ్ఞానం, సాఫ్ట్‌వేర్ రంగంపై ఆసక్తి, అకడమిక్ నేపథ్యం ఆధారంగా సంబంధిత సబ్జెక్ట్‌లలో నైపుణ్యాలను పరీక్షిస్తారు.

చివరగా హెచ్ఆర్ ఇంటర్వ్యూ

టెక్నికల్ ఇంటర్వ్యూలోనూ విజయం సాధించిన వారికి చివరగా హెచ్ఆర్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని,నాయకత్వ లక్షణాలను,సాఫ్ట్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు. ఈ ప్రక్రియలోనూ విజయం సాధిస్తే.. నియామకం ఖరారు చేసి.. ఆరు నెలలపాటు నిర్వహించే శిక్షణకు పంపుతారు.

రాత పరీక్షలో విజయం ఇలా

తొలి దశగా నిర్వహించే రాత పరీక్షలో.. 3 విభాగాల నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది. అవి..

వెర్బల్ ఎబిలిటీ

యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ది ఎర్రర్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, యాక్టివ్-ప్యాసివ్ వాయిస్, క్లోజ్ టెస్ట్, వెర్బల్ అనాలజీస్, సెంటెన్స్ కరెక్షన్, పేరా రైటింగ్, కాంప్రహెన్షన్, ఇడియమ్స్, ఫ్రేజెస్, డైరెక్ట్-ఇన్‌డైరెక్ట్ స్పీచ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఇంగ్లిష్ గ్రామర్‌పై పదో తరగతి స్థాయిలో పూర్తి అవగాహన పొందాలి. అదే విధంగా సెంటెన్స్ ఫార్మేషన్, కరెక్షన్, కాంప్రహెన్షన్‌ల కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్స్ చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.

రీజనింగ్ ఎబిలిటీ

ఈ విభాగంలో కోడింగ్, డీ కోడింగ్, స్టేట్‌మెంట్స్ అండ్ ఆర్గ్యుమెంట్స్, బ్లడ్ రిలేషన్స్, అనాలజీ, సిరీస్, పజిల్స్, లెటర్ సిరీస్, వెన్ డయాగ్రమ్స్, విజువల్ రీజనింగ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

న్యూమరికల్ ఎబిలిటీ

ఈ విభాగంలో ఫ్రాక్షన్స్,ప్రాబబిలిటీ, సిరీస్ అండ్ ప్రోగ్రెషన్స్, యావరేజెస్, ఈక్వేషన్స్, ఏరియా, స్పేస్, పెరిమీటర్, రేషియోస్, ప్రాఫిట్ అండ్ లాస్, వర్క్ అండ్ టైమ్, టైమ్ అండ్ డిస్టెన్స్, జామెట్రీ, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, నంబర్ సిస్టమ్, ఎల్‌సీఎం, హెచ్‌సీఎం, పర్సంటేజెస్ వంటి ప్యూర్ మ్యాథ్స్, అర్థమెటిక్‌కు సంబంధించిన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. వీటికి సమాధానం ఇవ్వడం కోసం 12వ తరగతి స్థాయిలో ప్యూర్ మ్యాథ్స్, అదే విధంగా అర్థమెటిక్ పుస్తకాలు అధ్యయనం చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

ప్రతి విభాగంలో ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు సగటున 50 సెకన్ల నుంచి ఒక నిమిషం వ్యవధి మాత్రమే అందుబాటులో ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి.

రిజిస్ట్రేషన్ ఇలా

- టీసీఎస్ స్మార్ట్ హైరింగ్-2023కు హాజరుకావాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.•అందుకోసం https://nextstep.tcs.com/campus/#/ లో లాగిన్ ఐడీ,పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి.
- ఆ తర్వాత ఐటీ, బీపీఎస్ విభాగాల్లో తమకు ఆసక్తి ఉన్న విభాగంపై క్లిక్ చేయాలి.
- తర్వాత దశలో ఆన్‌లైన్ అప్లికేషన్‌ను పూర్తి చేయాలి. అదే విధంగా నిర్దేశిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జనవరి 31, 2023
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** ఫిబ్రవరి 10, 2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.tcs.com/careers/india/tcs-smart-hiring-2023
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్:** https://nextstep.tcs.com/campus/#/

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.